
ఆంధ్రపత్రిక
సచిత్ర వార పత్రిక
4 అణాలు
2-7-'52



లంబాడీ సుందరి

చిత్రకారుడు: శ్రీ ఇ. ఎమ్. నరసయ్య (బళ్ళారి)

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక

Founder: K. NAGESWARA RAO

సంపుటము 44
సంచిక 43
2-7-52

నందన ఆషాఢ శుద్ధ నవమి బుధవారము

విషయానుక్రమణిక



మధ్యప్రదేశ గవర్నర్ డా. పట్టాభి సీతారామయ్య

వ్యాఖ్యలు, విమర్శలు :

పట్టాభిగారు

డా. భోగరాజు పట్టాభి సీతారామయ్యపంతులు గారివంటి నాయకులు, ప్రజ్ఞావంతులు గవర్నరుగా లభించినందుకు మధ్యప్రదేశ్ మంత్రివర్గమూ మధ్యప్రదేశ్ ప్రజలూ అభినందనీయులని చెప్పాలి. గాంధీమహాత్ముని అంతరంగిక వర్గానికీ, కాంగ్రెసు అగ్రనాయక వర్గానికీ చెందిన డాక్టరుగారు వర్ధా, సేవాగ్రామ ప్రాంతాలకు హోదాతో వెడుతున్నారంటే వారికి అత్యంత ఆనందదాయకమైన విషయం కావచ్చు. అయితే ఆదినుంచీ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ నిర్మాతలలో ఒకరైన డాక్టరుగారు ఆంధ్రదేశంలో కాంగ్రెస్ సంస్థ పునర్నిర్మాణ సమస్య క్లిష్టంగా ఉన్న సమయంలో దూరంగా వెళ్ళిపోతున్నారంటే వారి సలహా లేని లోపం కనపడక మానదు. దూరంగా ఉన్నప్పటికీ వారి సలహా ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు ఇంకా లభిస్తూనే ఉండగలదని ఆశించవచ్చును.

దుర్గాబాయిగారు

శ్రీమతి గుమ్మడిదల దుర్గాబాయిగారు ప్లానింగ్ కమిషన్ సభ్యులుగా నియమితులైనారు. దేశీయపునర్నిర్మాణ ప్రణాళికలో మాతాశిశు సంరక్షణ, ప్రజారోగ్యం,



శ్రీమతి దుర్గాబాయిగారు

విద్య, సామాజికశ్రేయస్సు మొదలైన శాఖలను నిర్వహిస్తారు. దుర్గాబాయిగారి నిర్మాణకృషినీ సమాజసేవా కార్య తత్పరతనూ ఎరుగనివారు ఆంధ్రదేశంలో ఎవరూ లేరని చెప్పవచ్చును. చెన్నపురి ఆంధ్ర మహిళాసభ, ప్రసూతి వైద్యశాల దుర్గాబాయిగారి కార్యదీక్షకు చిహ్నాలు. దేశీయ పునర్నిర్మాణానికి వీరి సేవ అమూల్యమైనదని సర్వజనులూ అంగీకరించే విషయం.

మున్సిపాలిటీలు :

చెన్నరాష్ట్రంలోని పురపాలక సంఘాధ్యక్షులు చెన్నపట్నంలో జూన్ 20, 21 తేదీలలో వార్షికసమావేశం జరిపి మళ్ళీ మున్సిపల్ కమీషనర్లని తీసెయ్యాలనీ, చైర్మన్లకి తగిన అధికారాలివ్వాలనీ తీర్మానాలు చేశారు. ముఖ్యమంత్రి శ్రీ రాజగోపాలాచారిగారు సభకు ప్రారంభోత్సవం జరిపారు. పరిపాలనాధికారాన్ని స్థానికసంస్థలకు మరింత కట్టిపెట్టడం మంచిదే కాని దీనికొక మితి అంటూ ఉండాలని రాజాజీఅన్నారు. మితి అనేది ఏ అధికారసంస్థఅయినాసరే స్థానికం కానీ రాష్ట్రవ్యాపియైనది కానీ అన్నీ పాటించి తలొగ్గవలసిందే. కాని అసలు ఉన్న అధికారమేమిటో లేని అధికారమేమిటో తెలియరాని అసందిగ్ధ పరిస్థితి ఎవరికీ మంచిదికాదు. మున్సిపల్ చైర్మన్ల అధికారాలు ఇదమిద్ధమని ప్రభుత్వం ఇంతవరకూ నిర్ణయించలేదు. ఈ అసందిగ్ధ పరిస్థితివల్లనే పురపాలకసంఘాల పురపాలన అయోమయంగా ఉందని చెప్పక తప్పదు. ఇచ్చే అధికారాలు మితంగాఉన్నా ఇబ్బందిలేదు కాని ఇదమిద్ధమని నిర్ణయించి తెలపడం అవసరం.

పురపాలకసంఘాల అధికారాలను గురించి ఇదివరలో పై సభవారు రత్నసభాపతిగారి అధ్యక్షతకింద నియమించిన విచారణ సంఘం ఒక నివేదికను సమర్పించింది. ఆ నివేదికలో నచ్చని అంశాలు ప్రభుత్వానికి అనేకం కనపడి ఉండవచ్చు. లేదా నివేదిక బొత్తిగా నచ్చకపోయి ఉండవచ్చు. ఏదో ఒకటి నిర్ణయం చేస్తే బాగుండేది.

అయితే ఇటువంటి నివేదికలపట్ల తమ వైఖరిని నిర్మొహమాటముగా స్పష్టపరిచినందుకు ముఖ్యమంత్రిగారిని అభినందించాలి ఇటువంటి అభిప్రాయాన్ని ఇంత నిర్మొహమాటంగా ప్రకటించడం పాలకవర్గాలకు అలవాటులేదు. కాని అలా ప్రకటించడం అవసరమూ ప్రభుత్వధర్మమూ కూడా అని చెప్పారు. రాజాజీ చెప్పినదేమిటంటే—విచారణసంఘాలు విచారించి తయారుచేసే నివేదికలు సమర్పించబడగానే పరిశీలించి నిర్ణయించడానికి పరిపాలకులకు వ్యవధీ ఉండదు; అంత తొందరపాటు మంచిది కాదనికూడా వారికి అనిపిస్తుంది. ఆ వ్యవధి, తొందరపాటు తీరిపోయే సమయానికి నివేదికలు పాతబడిపోయినట్లు కనపడతాయి. అంటే రాజాజీ బ్రిటిష్‌వారి పరిపాలనా విధానాన్ని బాగా ఒంటబట్టించుకున్నారన్నమాట. ఏ విషయాన్ని గురించైనా ప్రజలు ఆందోళన ఆరంభించారంటే, వెంటనే విచారణ సంఘం నియమించడం బ్రిటిష్ ప్రభుత్వం కనిపెట్టిన కిటుకు అని లార్డ్ వేవెల్ వ్రాశాడు. విచారణ మాసాల తరబడి ఏళ్ళ తరబడి జరగవచ్చు. ఆపైన నివేదిక సమర్పించబడితే అది మళ్లీ కొన్ని ఏళ్ళ తరబడి ప్రభుత్వ పరిశీలనలోనో 'ప్రభుత్వ ఆలోచనలోనో' ఉంటుంది. ఆ తరవాత నివేదిక ఎప్పుడో బుట్టదాఖలైపోయినట్టు ఏ అధికారో చల్లగా బయటపెడతాడు. విచారణసంఘాల అగత్యం ఇటువంటిదనీ, నివేదికల కింత విలువ ఉంటుందనీ అధికారంలో ఉన్నవారెవరూ పైకి చెప్పరు. చెప్పలేరు. కాని శ్రీ రాజగోపాలాచారిగారు స్పష్టంగా నిర్మొహమాటంగా చెప్పేశారు. అసలుసంగతి దాచిపెట్టి ప్రజలకు ఆశ చావకుండా పూర్తిగా నిరాశ కలిగించకుండా సందిగ్ధస్థితిలో ఉంచడం

క్రూరమైన విషయం. రాజాజీ దాక్షిణ్యపరులని చెప్పాలి.

గ్రామోద్యోగులు:

గ్రామోద్యోగులంటే పరిపాలనా యంత్రాంగానికి మూలబలం అని ఒకరన్నారు. ఇది నిజమో కాదో చెప్పలేం కాని పరిపాలనావ్యాసంగంలో గ్రామాలకు సంబంధించిన యావత్తు మోతబరువూ మోసేది వీరేనని చెప్పాలి ప్రభుత్వమంటే జప్తులు చేయించి అయినా శిస్తులు వసూలు చేసే హృదయంలేని యంత్రాంగమనీ, ప్రజలంటే పన్నులిచ్చుకునేవాళ్లుమాత్రమేననీ జ్ఞప్తికి తెచ్చేది గ్రామోద్యోగులే. అయితే వీరి జీతాలు పోలీసుజీతంలో నాలుగోవంతుకంటె తక్కువ; రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వద్ద జవానుజీతంలో సగం. అయితే ఊళ్ళో పరపతికోసం ఉద్యోగం చేసే కరణం మునసబులు తమకుగల అధికారాన్ని వినియోగించుకో గలిగితే చాలని చూస్తారు. స్థితిపరులకు వారసత్వపు హక్కుగా ఈ ఉద్యోగాలిచ్చి చేయించినంతకాలం మామూళ్లతో సరిపెట్టుకునేవారు. స్థితిపరుల స్థితి చెడిపోగానే మామూళ్ళ మామూలు బలపడి స్థిరపడిపోయింది. కాని మామూళ్లు ప్రజలను పీడించే లంచాలుగా గుర్తించబడి ప్రజలు, ముఖ్యంగా రైతులు, చైతన్యం పొందడంతో ఈ ఉద్యోగులకు పాట్లు ఆరంభమైనాయి. యుద్ధకాలంలో వ్రాతపని పదిరెట్లు పెరిగిందంటే ఆ భారమంతా గ్రామోద్యోగులపైనే పడింది. రాత్రింబగళ్ళు పనిచేసి యుద్ధనిధికి చందాలు పోగుచెయ్యడం ప్రభుత్వపు లాటరీల టక్కెట్లు అంటగట్టడం యుద్ధపు బాండ్లు బలవంతాన ఇప్పించడం, పంటల అంచనాలు తయారుచెయ్యడం వ్యాపార వివరాలు పత్రబద్ధం చెయ్యడం వగైరా వగైరా భారమంతా వీరిపైన పడింది. ప్రజల చైతన్యం పెరగడంతో పాటు మామూళ్ళ సంపాదన తగ్గిపోయింది. పని ఎక్కువైనా ఆదాయం తరిగిపోతుంటే కనిపెట్టేవారు లేకపోయారు. ఇటీవల రెండేళ్ల కిందట కాబోలు వీరి జీతాలు పెంచబడ్డాయి. నెలకి రు 8 నుంచి రు 12 వరకు ఉండే జీతాలు రు 10 మొదలు రు 18 వరకు పెరిగాయి. ఈ జీతం పెంచడం ఎందుకు జరిగిందో, ఏ సూత్రం ప్రకారం కలిపి వేత (గుణకారం) జరిగిందో ఆ వివరాలు ప్రభుత్వానికైనా తెలుసో లేదో. స్థితిసంపదలో, అధికారమో, పెద్ద జీతాలో, కనీసం బంగాళాల డాబు దర్పాలో (పోలీసు ఆఫీసర్లమాదిరి) ఉంటే గాని ప్రజల్లో పలుకుబడి సంపాదించడం కష్టం. అన్ని సన్నగిల్లిన గ్రామోద్యోగులికి ఇప్పుడు పై అధికారులు చిన్నబుచ్చడం తోడయింది. పన్నులు వసూలు చేసేది గ్రామోద్యోగులైతే, అధికారం చలాయించేది రెవిన్యూఆఫీసర్లు, వారి జవాన్లు. ఎన్నికల్లో మనదేశంలో కాంగ్రెస్ అంచనాలు తారుమారవడానికి మూలకారకులు ఎలిమెంటరీ స్కూలు ఉపాధ్యాయులు, గ్రామోద్యోగులూనని ఈమధ్య ఒకరన్నారు. ఇది నిజం కాకపోవచ్చు గాని, పరిస్థితులు ఇప్పటి మాదిరిగానే ఇంకా సాగితే అది నిజం కాగల ప్రమాదం ఉన్నదని శ్రీ రాజగోపాలాచారిగారు గ్రహించారు. గ్రహించి గ్రామోద్యోగులికి తప్పకుండా ఉపకారం చెయ్యాలనుకున్నారు. అయితే జీతాలు పెంచడానికీ, వారి బిడ్డలకు ఉచితంగా విద్యాసౌకర్యం ఏర్పాటు చెయ్యడానికీ ప్రభుత్వానికి కావలసినంత ధనబలం లేదు కాబట్టి ఇంక చెయ్యగలిగిన ఉపకారం ఒక్కటే చేశారు. గ్రామోద్యోగుల్ని చిన్నచూపు చూడరాదనీ, వారిని కూడా గౌరవించాలనీ ప్రభుత్వోద్యోగులికి ఆదేశమిచ్చారు. (27-6-52)

ప్రవృత్తులు

'కళ్ళులేవు బాబూ! ఒక్క కానీ ధర్మం చెయ్యండి బాబూ!!' అంటూ చెయ్యిజాపి అడుగుల చప్పుడైనప్పుడల్లా అరుస్తున్నా కూడా ప్రతివారూ తమని కాదన్నట్టు ఎవరి పనిమీద వాళ్లు వెళ్ళిపోతున్నారు.

టక, టకమని చప్పుడవుతూ ఎవరో వస్తున్నట్టు అనిపించగానే మళ్ళీ అతను దీనంగా అడగటం ప్రారంభించాడు.

'రెండు రోజుల్నుంచీ తిండిలేదు బాబూ ఆకలితో చచ్చిపోతుండాను..'

అడుగులశబ్దం ఆగిపోయింది.

గట్టిగా ఒక నవ్వు వినిపించింది.

మనిషి ఇంకా అక్కడే వున్నాడని గ్రహించిన గుడ్డివాడు ఇంకా దీనంగా ప్రార్థించటం ప్రారంభించాడు.

'విశ్వామిత్ర'

'ఊఁ-! ఇదుగో!' గర్వంగా ఒక కాసు అతని చేతిలోపడేసి ఆ వ్యక్తి వ్యంగ్యంగా నవ్వటం ప్రారంభించాడు. ఆ నవ్వులో అదో విధమైన గర్వంకూడా కలిసింది.

వేలుతో నాణెం చుట్టుని తడివి చూసుకొని అది అణా అని గ్రహించి, సంతోషంతో మొహం పెద్ద చేసుకొన్నాడు గుడ్డివాడు.

'ధర్మ ప్రభువులు!' అని రెండు చేతులూ ఎత్తి దణ్ణంపెట్టాడు.

ఆ వ్యక్తి ఇంకోసారి నవ్వి,

'పిచ్చివాడా! నాకంటె నువ్వే అదృష్టవంతుడివోయ్!' అన్నాడు.

'ఏమిటి స్వామీ! అలా గంటారు!' గుడ్డివాడు అమాయికంగా అడిగాడు.

'నేనూ బిచ్చగాణ్ణే!' అతను ఆగాడు. గుడ్డివాడు మొహం ఆశ్చర్యంగా పెట్టి నోరు తెరిచాడు.

'లోకం హెచ్చుతగ్గుల్ని సమానంగా చూడగలవు! మనుష్యుల ఆకారాల్ని కాకుండా మనసుల్ని ప్రార్థించగలవ్!'

గుడ్డివాడికి కివేం వినపడటం లేదు.

'మరి ఇందాక బూట్ల చప్పుడైంది! బూట్లుగాని ఏమైనా తొడుక్కున్నావా?'

'బూట్లు! మన బతుక్కి తోడు బూట్లు కూడానూ! ఐనా నువ్వు దీవించినట్టు తొడుక్కుందామన్నా అందుకు నోచుకోలేదులే! బూట్లకంటే కూడా నా చెక్క కాలే బాగా చప్పుడు చెయ్యగలదేమోలే, ఐనా'

కొయ్యకాలు సంగతి వినగానే తనకి కళ్ళు రెండూ, (కనీసం ఒక్కటన్నా) వుండి రెండుకాళ్లూ పోగూడదూ? అనుకున్నాడు గుడ్డివాడు.

'కొయ్యకాలంటే ఎలా వుంటుంది?' అమాయికంగా అడిగాడు గుడ్డివాడు.

ఆశ్చర్యంగా చూసి కుంటివాడు 'అయితే నీకు కళ్ళు ఎప్పుడుపోయినయ్!' అన్నాడు.

'ఎప్పుడు పోయినయ్' అనే మాటలు వినగానే గుడ్డివాడు నిస్పృహతో 'అసలు పుట్టేటప్పుడు వుంటేగా పోవటానికి?' అన్నాడు.

(46-వ పేజీ చూడండి)



సీరియల్ నవల

రెండు మహా నగరాలు

చార్లెస్ డికెన్స్

18

ఒక సంవత్సరం గడిచింది; చార్లెస్ డార్నే ఇంగ్లండులో స్థిరనివాసం యేర్పరచుకొని ఉపాధ్యాయవృత్తివల్ల జీవిస్తున్నాడు. ఫ్రెంచిభాష చదువుకోదలచినవాళ్ళకు ట్యూషను చెబుతూవుండేవాడు. ఫ్రెంచిసారస్వతంలో అతనికివున్న ప్రవేశానికి ఆ రోజులు గనక ట్యూషనూ గట్రా చెప్పుకోవలసి వచ్చిందిగాని ఈరోజుల్లో అయితే యే ప్రొఫెసరో అయి కూర్చునేవాడు. ట్యూషన్లు యితరులకు చెప్పుకుంటూ వుండటమే గాక, ఉత్సాహంగల కొంతమంది యువకులతో కలిసి, ఫ్రెంచి వాఙ్మయంయొక్క అవధులు చూడటానికి తీవ్రంగా చదువుకుంటూ వుండేవాడు. ఫ్రెంచిరచనలన్నిటినీ చక్కగా ఇంగ్లీషులోకి తర్జుమా చేయగల సమర్థత అబ్బింది. ఆ రోజుల్లో అలాంటి ప్రతిభగల ఉపాధ్యాయులు దొరకటమంటే దుర్లభంగా వుండేది. రాజులూ జమీందార్లూ దివాలాలు తీసి ఉపాధ్యాయవృత్తికి పూనుకున్న రోజులు అప్పటికింకా రాలేదు. టెల్‌సన్సు బ్యాంకి ఖాతాలలోనుంచి జారిపోయిన రాజవంశీయులెవరూ అప్పటికింకా వంటవాళ్ళుగానూ, షండ్రంగులుగానూ తయారు కాలేదు. మంచి ప్రతిభావంతుడైన ఉపాధ్యాయుడు కావటంచేత డార్నేకు మంచి గిరాకీ తగిలింది. అదిగాక, తన దేశంలో చెలరేగుతున్న దుస్థితి అంతా అతను దినదినం అవగతం చేసుకుంటూనేవున్నాడు. అందుచేత ఎలాగైనా యిక్కడ యింగ్లండులో నిలవదొక్కుకోవాలని చాలా శ్రద్ధగా పనిపాటలు చేసుకుంటున్నాడు.

లండనులో అతను, బంగారు బాటలవెంట నడవాలనిగాని, పూలసజ్జెలమీద పడుకోవాలనిగాని ఆశించలేదు. అలాంటి లేనిపోని దురూహలు పెట్టుకున్నట్టయితే అతను యేవిధంగానూ పైకి రాగలిగేవాడు గాడు. అతను అపేక్షించిందల్లా పని చేసుకునేందుకు అవకాశం; ఆ అవకాశం అతనికి లభించింది. దాన్ని ఎంత చక్కగా ఉపయోగించుకోవాలో అంత చక్కగా ఉపయోగించుకొని పైకి రాగలుగుతున్నాడు.

సృష్ట్యాదినుంచీ యిప్పటివరకూ మగవాడైన ప్రతివాడిలోనూ ఒక స్వభావం వుంది—స్త్రీని ప్రేమించటం; డార్నే కూడా ప్రేమిస్తున్నాడు.

అతను లూసీ మానెట్‌ను ప్రేమిస్తున్నాడు తాను ప్రమాదస్థితిలో చిక్కుబడి కోర్టువిచారణ జరుగుతుండా అతనికి లూసీపట్ల అనురాగం కలిగింది. ఆ స్త్రీ అతనిపట్ల చూపిన జాలి, ఆ జాలి మాటల తియ్యదనం అతణ్ణి ఆకర్షించాయి. జీవనమరణసంధ్యలో నిల్చుని అతను లూసీముఖంవంక చూచాడు. అలాంటి కోమలమైన ముఖం, అందమైన ముఖం, అతను అంతకుపూర్వం ఎన్నడూ చూళ్లేదు. తన హృదయంలోవున్న అపేక్షను అతను లూసీతో యెన్నడూ ముచ్చటించలేదు. ఫ్రాన్సుతో వున్న తమ దివాణం, దివాణంలో ఆనాడు జరిగిన హత్య, అవన్నీ అతని మనస్సులో మసకమసకలేసి కలలోని దృశ్యాలుగా కనుపించుతున్నయ్. ఆ సంఘటన జరిగి అప్పటికి సంవత్సరం జరిగిపోయింది. ఇంతకాలంగా యిద్దరూ కలిసిమెలిసి తిరుగుతున్నా, తన హృదయంలో వున్న అభిప్రాయ మేమిటో అతను లూసీకి రవ్వంతేనా తెలియనియ్యలేదు. అలా దాచివుంచటానికి తగిన కారణం లేకపోలేదు.

వసంతఋతువు: సాయంత్రసమయం; ఆ తరుణంలో, లూసీ, మిస్ ప్రాస్‌లో కలిసి షికారు వెళ్ళివుంటుందని అతనికి తెలుసు. ఆ అవకాశం చూసుకుని అతను డాక్టర్ మానెట్‌తో మాట్లాడటానికి సోహోస్క్వేరుకు బయలుదేరాడు.

అతను వచ్చేసరికి, డాక్టర్ మానెట్ కిటికీకి ప్రక్కగా పడకకుర్చీ వేసుకుని చదువుకుంటూ వున్నాడు. ఆయనలో వున్న జీవశక్తులన్నీ తిరిగి పుంజుకుని ఉత్సాహోద్రేకాలుగల సంపూర్ణమానవుడుగా తయారైనాడు. తనకు సంబంధించిన ప్రతివిషయాన్నీ చక్కగా ఆలోచించుకుని తగిన నిర్ణయానికి రాగల మనోబలం అతనిలో యేర్పడ్డది. డార్నే లోపలికి రావటం మాని, ఆయన, చేతిలోవున్న పుస్తకం ప్రక్కన బెట్టేసి, డార్నేతో కరచాలనం చేశాడు.

'నిన్ను చూసి ఎన్నో రోజులైంది డార్నే, ఇవ్వాళో రేపో వచ్చి తీరతావని అనుకుంటూనే వున్నాం. నిన్న సిడ్నీ కార్టనూ, స్ట్రైయివరూ ఇక్కడికివచ్చి కాసేపు కూర్చుని వెళ్లారు. నువ్వింకా రాలేదేమా అని వాళ్లుకూడా అనుకున్నారు.'

'కృతజ్ఞుణ్ణి—అమ్మాయి'—

'అమ్మాయి క్షేమంగావుంది; నువ్వు రావటం మాకందరికీ కూడా ఎంతో సర్దాగావుంది—అమ్మాయి యేదో పనిమీద బయటికి వెళ్లింది. ఇప్పుడే వచ్చేస్తుంది. కూర్చో'—

'డాక్టరుగారూ!—అమ్మాయి ఈ సమయంలో ఇంట్లో వుండదని నాకు తెలుసు—అందుకనే, ఈ అవకాశం చూసుకుని మీతో ఒక విషయం మాట్లాడాలని వచ్చాను.'

డాక్టర్ మానెట్ ఒక క్షణం మౌనంగా ఆలోచించాడు:

'సరే—ఆకుర్చీ ఇలా దగ్గిరికి ఈడ్చుకో—ఏమిటి సంగతి?—

కుర్చీ దగ్గిరకు ఈడ్చుకున్నాడుగాని, ప్రసంగం యెలా ప్రారంభించాలో మాత్రం తోచలేదు. ఒక క్షణానికి అలా అలా గొంతు పెగుల్చుకుని ఇలా ఉపక్రమించాడు.

'డాక్టరుగారూ!—నాకు మీ కుటుంబంతో పరిచయం యేర్పడి యిప్పటికి దాదాపు ఒకటిన్నర సంవత్సరాలు కావస్తోంది. మీకందరికీ యింత సన్నిహితుణ్ణి కాగలిగినందుకు ఎంతో

అనువాదం: తెన్నేటి సూరి

సంతోషించుతున్నాను. నేను యిప్పుడు మాటాడబోతున్న విషయం మీకు ఎలా'—

డాక్టర్ ఆగమన్నట్టు చెయ్యిచాచాడు :

'లూసీ విషయమా నువ్వు మాట్టాడబోతున్నది ?'—

'అవును లూసీ విషయమే'—

'లూసీవిషయం ప్రసంగం యేది వచ్చినా నాకు ఎందుకో కష్టంగావుంటుంది. నువ్వు యిప్పుడు మాట్టాడుతున్న ధోరణిలో లూసీని గురించి ప్రసంగించటం మరింత కష్టంగా వుంటుంది'—

'లూసీపట్ల నాకెంతో అభిమానంవుంది—లూసీకి నాజీవిత సర్వస్వాన్నీ అర్పించాలను కుంటున్నాను. లూసీని నేను ఎంతగా ప్రేమిస్తున్నానో మాటల్లో చెప్పలేను'—

మరొకక్షణం మౌనం :

'నాకు తెలుసు—లూసీ అంటే నీకు ఎంతో ప్రేమవుందని నాకు తెలుసు'—అని, డాక్టర్ మళ్లా మౌనంగా వూరుకున్నాడు. ఆ విషయమైన ప్రసంగం వినటానికి డాక్టర్ మానెట్ సుముఖంగా లేనట్టు అనుమానపడి, డార్నే వెనకా ముందూ సందేహించు తున్నాడు :

'చెప్పమన్నారా ?...'

మళ్లా క్షణం మౌనం—

'ఆఁ ఆఁ!—సరే—చెప్పు'—

'నేను చెప్పబోయేదేవిటో మీరు ఊహించగలిగే వుంటారు. కాని, నామనస్సులోవున్న ఆందోళనంతా మీకు అర్థం కావటం కష్టం. డాక్టర్ గారూ! నేను లూసీని ప్రేమిస్తున్నాను; ఎంతో ఇదిగా ప్రేమిస్తున్నాను, నా జీవితానికంటే ఎక్కువగా ప్రేమిస్తున్నాను—నా మనస్సులో వున్న ఆవేశాన్నంతా మాటల్లో విప్పి చెప్పలేకపోతున్నాను. డాక్టర్ గారూ! ఒకప్పుడు మీరూ ప్రేమించారు !—ప్రేమ అంటే యేవిటో మీకు తెలుసు ; ఆ అనుభవాన్ని స్ఫురణకు తెచ్చుకుని నామనస్సును అర్థం చేసుకోండి'—

డాక్టర్ ముఖం ప్రక్కకు తిప్పుకుని తలవంచుకు కూర్చున్నాడు. ఆయన చూపులు ముందున్న నేలలోకి గుచ్చుకుపోతున్నయ్. ఆ చివరిమాటలు చెవులబడేటప్పటికి సహించలేకపోయాడు; బాధగా చేతులు ముందుకు చాచి, ఆందోళనగా .

'ఆఁ! ఆఁ!—ఆగు నాయనా ఆగు!—ఆమాట లెత్తబోకు—ఆ సంగతి జ్ఞాపకం చెయ్యకు—నిన్ను బ్రతిమాలుకుంటాను—ఆ సంగతెత్తకు'—

ఏదో గుండెలు కోసుకుపోతున్నట్టు, బాధగా గోలబెట్టాడు. ఆయన పడుతున్న బాధ గమనించి, డార్నేకు ఇక నోటివెంట మాట రాలేదు.

'క్షమించు నాయనా!' అన్నాడు డాక్టర్, 'నువ్వు లూసీని గాఢంగా ప్రేమిస్తున్నావని నాకు తెలుసు—ఆ విషయంలో నా కెలాంటి సందేహమూ లేదు'—

ప్రక్కముఖమై వున్నవాడు డార్నే వేపుకు తిరిగాడు. కాని తల పైకెత్తి అతని ముఖంలోకి చూట్టంలేదు. తల వంచుకుని అలా నేలవంకే చూస్తూ ఆలోచిస్తున్నాడు. దూదిపింజల్లా తెల్లబడిపోయిన తల వెంట్రుకలు ముఖంమీదికిపడి ముఖం కమ్ముకుపోయింది.

'ఈ సంగతి లూసీతో మాట్లాడావా ?'—


'లేదు.'

'పోనీ ఉత్తరమేమైనా వ్రాశావా ?'—


'వ్రాయలేదు'—

'నువ్వు యింతవరకూ అమ్మాయితో ఈ ప్రసంగం యెత్తకుండా ఎందుకు ఊరుకున్నావో నేను అర్థం చేసుకోగలుగు

(47-వ పేజీ చూడండి)



రాష్ట్రపురపాలక సంఘాధ్యక్షుల మండలి వార్షిక సమావేశాన్ని ముఖ్యమంత్రి శ్రీ రాజగోపాలాచారిగారు రాజాజీ హాలులో ప్రారంభించారు.



పెకింగులోని కార్మికభవనంలో భారతీయ చిత్రకళా ప్రదర్శనం.

అన్నదాత

శ్రీ రావెళ్ల హనుమంతరావు

తెల్లవారుఝామున కోళ్ళు కూశాయ్.

గూళ్ళల్లో కమ్మివేయ బడిన కోళ్ళు ఘనంగా కూశాయి. బయట ఇళ్ళమీద, చెట్లమీదవున్న కోళ్లు నెమ్మదిగా కూశాయి. మంచుకు గొంతుక బొంగురు పోయి వుండవచ్చును; లేక తాము బయటనున్నట్లు తెలిస్తే పిల్లులు వచ్చి చంపేస్తాయని భయపడవచ్చును. మొత్తంమీద కోడిపుంజులన్నీ కూశాయ్. ఒకదాని తరువాత మరొకటి వేలంవెర్రిగా కోళ్లన్నీ కూసినప్పటికి తెల్లవారడానికింకానూ చాలా ఆలస్యముంది.

అయినా రామిరెడ్డి కోడికూత వినంగానే దిగ్గునలేసి కూర్చున్నాడు చలి విదిలించి కొడుతూంటే! అతను మంచం మధ్యనే కూర్చొని క్రిందకువంగి పొగాకు పట్టా అందుకొని నెమ్మదిగా చుట్ట జుట్టుకొని దీపందగ్గరకెళ్లి చుట్టకాల్చుకున్నాడు. మళ్ళీ తిరిగి మంచందగ్గర కొచ్చి పదితునకల పొగాకు జేబులో పెట్టుకొని పట్టా జుట్టి భద్రంజేసుకున్నాడు. పైపంచి తలకు చుట్టుకొని, మంచంమీద నున్న గొంగళి దీసి కప్పుకొని, చెప్పులు తొడుక్కొని, కఱ్ఱ చేతబట్టి కూతుర్ని పిలవటం ప్రారంభించాడు.

అమ్మాయి

....

అమ్మాయి

....

ఆవేళప్పుడు ఆవిధంగా ఎన్ని కేకలు వేసినా తన కూతురు లేవదని రామిరెడ్డికి తెలుసును. ఎంతసేపటికైనా కేకలు విని లేచేది భార్యయేననే సంగతి అతనికి నిత్యానుభవమే. అయినప్పటికీ భార్యను పేరెత్తి పిలువడు. అలాచేస్తే సంఘం పరిహాసించుతుందని–హిందూ ధర్మశాస్త్రం శిక్షించుతుందని రామిరెడ్డికి భయం. కనుకనే అతను కూతుర్ని పిలుస్తున్నాడు. ఒకటి–రెండు కేకలకు సమాధానం రాకపోయేసరికి గొంతు పెద్దదిజేసి మరింత గంభీరంగా పిలిచాడు.

అమ్మాయి.

ఎంత మొద్దునిద్దరే ?

మూడోసారి కేకవేసేసరికి భార్యకు మెలకువవచ్చింది. ఆమె ముసుగుదీసి బయటకు చూడకుండగానే విసుగుతో గొణగడం ప్రారంభించింది. "అర్ధరాత్రివేళ–మద్దెల దరువని ఏమిటీ కేకలు ?"

"పొలం వెళ్ళుతూన్నాగాని తలుపేసుకో."

"లేడికి లేచిందే ప్రయాణమన్నారు. అట్లాగే వుంది మీ పని. కాకపోతే ఇప్పుడప్పుడే పొలమేమిట"ని భార్య అనేసరికి–

"నీ దుంపతెగ. కోళ్ళు కూసినాయ్. ఇంకా ప్రొద్దేముంది? లే...లేచి తలుపేసుకో. పెందలాడే అన్నంవండి తూర్పు పొలానికి పంపించు. లే.. తలుపేసుకో."

తలుపు గడ తీసిన శబ్దం వినగానే ఇక లాభం లేదనుకొని రాజమ్మ ముసుగు తొలగించుకొని తలుపు దగ్గరకొచ్చి భర్తను పిలచి పాడిగేదెకు పచ్చమేతవేసి వెళ్ళండని చెప్పి తలుపేసుకొచ్చింది. మంచందగ్గర కొస్తూ తనలో తానే గొణుక్కొంది.

"కోళ్లు కూశాయట పాడు కోళ్ళు. ఈ సంక్రాంతి పండుగరోజులు వస్తే చాలు. మరీ అర్ధరాత్రివేళనే కూయటం ప్రారంభించుతాయి. రేపు పండుగ మూడురోజులు వేసే పందేలతో గాని వీటిరోగం కుదరదు"

రాజమ్మ గొణుక్కొంటూనే మంచం మీద నెమ్మదిగా నడుంవాల్చి దుప్పటి కప్పుకొంది.

2

రామిరెడ్డి బయటకొచ్చేసరికి మంచు తెర గాఢంగా క్రమ్ముకొనివుంది సామాన్యపు మంచుగాక వర్షం కురిసినట్లే కురుస్తోంది. చలి మరింత జోరుగా వేస్తోంది. గాఢంగా క్రమ్ముకొని వున్న మంచులో పదిగజాల దూరమందేమున్నదో కనుపించడం లేదు రామిరెడ్డి అలాగే నెమ్మదిగా చావిడిదగ్గర కెళ్లాడు. అతను చేయగల్గిందిలేక కందెడుగడ్డి ఇవతలకు దెచ్చుకొని చలి మంటవేసుకొన్నాడు. కాసేపు అలాజరిపేసేసరికి మంచుతెర తగ్గిపోయింది. వెంటనే నిప్పును శుభ్రంగా ఆర్పివేసి, పాడిగేదెకు పచ్చమేత వేసి, ఎద్దుల్ని వూడదీసుకొని పొలం తోలుకెళ్ళాడు.

గ్రామం వదలిపొలిమేరకువచ్చి తూర్పు వైపుకు జూసేసరికి మంచుతెరల్ని – చీకటి చాటుల్ని చీల్చుకొంటూ పైకి వస్తూన్న దివ్యజ్యోతి రామిరెడ్డికి కనుపించింది. అదే వేగుచుక్క. తూర్పు వైపునుండి కనుపించే ఆ ఎర్రచుక్కయే కష్టజీవులకు మార్గదర్శి. ఎర్రగా బంతిపూవులా మిలమిలా మెరిసే ఆ వేగుజుక్కయే రైతులకు కర్తవ్యాన్ని బోధించుతూ వారిని కర్మవీరులుగా జేస్తుంది. కుప్పలునూర్చే కార్యక్రమం ప్రారంభించినప్పటినుండి వేసవికాలం పనులన్నీ సంపూర్తి అయ్యేవరకు రైతులకు రాత్రివేళ టైమును తెలిపే గడియారం ఆ వేగుచుక్కయే. ఆ చుక్క పొడిచి పైకివచ్చి కంటికి కనుపించిన తరువాత తిరిగి నిద్రపోవడానికి ఏ రైతు మనస్సూ అంగీకరించదు.

వేగుచుక్క కొంచెం పైగా కనుపించడంతోనే రామిరెడ్డి మరింత జోరుగా ఎద్దుల్ని అదలించటం ప్రారంభించాడు. పాడు మంచుపట్టటంవలన ఆలస్యమయిందని మంచును తిట్టుకున్నాడు. ఛకఛకా ఎద్దుల్ని నడిపించి పొలం జేరుకున్నాడు. నెమ్మదిగా మిగతా రైతులు–కూలీలుగూడా వచ్చారు అంతా కలసి కుప్పనూర్చే కార్యక్రమానికి పూనుకున్నారు...

3

ఈ రోజుల్లో, రైతులు– నౌఖర్లు – కూలీలంతా కుప్పలునూర్చే కార్యక్రమంలో నిమగ్నమైయున్నా, ఉదయం ఏడు, ఎనిమిదిగంటలయ్యేసరికల్లా కుప్పల్లో వున్నవాళ్ళకు విపరీతమైన ఆకలి వేస్తుంది. చరచరా ప్రొద్దు పైకెక్కినకొద్దీ కడుపులో ఆకలి కరకరలాడుతూంటుంది. గ్రామంలో ఇళ్ళదగ్గర ఉన్నవాళ్ళ కింకా చలే వదలదు. మరీ సోమరిపోతుల రకానికి జెందినవారికే వేళకు నిద్రలేవరు గూడాను గడ్డిలో పనిచేసే వాళ్ళు మాత్రం ఆకలి ..ఆకలంటూ ఆరాటపడుతూంటారు.

కుప్పదగ్గరకు ఒక్కొక్కరి అణ్ణాలేవస్తున్నాయి. అన్నం రానివాళ్లు ఆదుర్దాతో వూరివైపుకు ఎదురు జూస్తున్నారు.

అందరి భోజనాలు వచ్చినతరువాత ఆఖరుకు రామిరెడ్డి భోజనం వచ్చింది. చిన్నకూతురంటే రామిరెడ్డికి చాలా ఇష్టము. తెలిసిగాని, తెలియకగాని, పొరపాటునగాని, గ్రహపాటునగాని ఆమె ఎప్పుడైనా, ఏదైనా తప్పుజేసినప్పటికి కొట్టడు సరిగదా కోపంతో కసరుకొనడుగూడాను. ఇంట్లో మరెవ్వరైనా అయితే ఇంటికప్పు ఎగిరిపోయేట్లు కేకలేస్తాడు. తల్లి - దండ్రులకు మిగతావారందరికంటే తమ సంతానంలోని చిన్నపిల్లమీద అధిక ప్రేమ వుండటంలోక సహజమేమో! చిన్న కూతురిమీద ప్రేమ అధికంగా వుండటంవల్లనే ఆమె అందరికంటే ఆలస్యంగా అన్నం తెచ్చినప్పటికీ రామిరెడ్డి కోపంలేకుండా ఇలా అన్నాడు.

"ఇంత ఆలస్యంజేస్తే ఎలాగమ్మా! అటు చూడు వాళ్ళందరికీ అన్నాలు వచ్చాయి. నా కింకా అన్నం రాలేదని ఎదురు జూస్తున్నాను. నా కడుపుల్లో ఎంత ఆకలివున్నదో వూహించు. గడ్డిలో పనిజేసేప్పుడు కాస్త ప్రొద్దెక్కితే సరి ఆకలి దహించుకపోతుంది. కొంచెం వేళ తప్పితే సరి దాహ మెక్కువవుతుంది. ఈ రోజుల్లో తగినంత తిండితినాలి గాని, నీరుత్రాగితే మనిషి పనేమి చేయగల్గుతాడు?"

తండ్రిమాటలు విన్న కూతురు పెదిమెలమీదకు చిరునవ్వును దెచ్చుకొని, "వచ్చేది పండుగగాదేమిటి? అందులో పెద్ద పండుగయ్యె. మరి ఇంటిదగ్గర పండుగపనులు పూర్తిగావద్దేమిటి?" అంది.

"పిచ్చితల్లీ! మీ పండుగ పనులమూలాన కుప్పల్లోవున్న మా అందర్ని ఆకలితో చంపేస్తారేమిటి? వేళకు తిండిలేకుండగా పండుగ పనులేమిటమ్మా?"

ఈ మాటలు వినేసరికి కూతురుకు కొంచెం కోపం వచ్చింది. మూతి అదో రకంగా బిగించుకుంది—

"మీకేం పొలానకూర్చొని కబుర్లు అలాగే చెబుతారు. చీకటి వుండగానే లేచి వాకిళ్ళన్నీ శుభ్రంగా వూడ్వాలి. కళ్ళాపిజల్లాలి. చక్కచక్కని సంక్రాంతి ముగ్గులేయాలి. ఆవుపేడ దెచ్చి గొబ్బిళ్ళు చేయాలి. వాటికి పసుపు-కుంకుమ- బంతిపూవులు పెట్టాలి. తల్లిగొబ్బెమ్మదగ్గర సాంబ్రాణిపొగ వేసి నైవేద్యం పెట్టాలి. అప్పుడా గొబ్బెమ్మలను తీసుకెళ్ళి వాకిళ్ళలో పెట్టాలి. ఇది చిన్నక్కాయి-నేనూ చేసేపని. ఇంక అమ్మ-పెద్దక్కాయి ఇంట్లో పనులు జేసుకొని, గేదెలకు కుడితిబెట్టి-పాలుపితుక్కొని పనులైన తరువాత నాకు అన్నం పెడితే తిన్నాను. మీకు తెచ్చాను నేను మాత్రం కూర్చున్న దెక్కడేమిటి?"

ఈ మాటలు విన్న వెంకిరెడ్డి నవ్వుతూ ఇలా అన్నాడు. "బావా ఇలాగైతే మీ అమ్మాయి మొగుడుకు బాగానే అన్నం పెడుతుంది. చేసుకున్నవాడు ఒక్కరోజుతో మలమలమాడి చావవలసిందే"

వెంకిరెడ్డి అన్నమాటల్ని పెద్ద పాటింపులోకి తీసుకోకుండగానే రామిరెడ్డి కూతురువైపుకుజూసి- "పోనీలే.....రేపటినుండైనా కాస్త పెందలకాడనే అన్నాలు తెచ్చిపెట్టు అన్నాడు.

సరేలెమ్మన్నట్లుగా తలవూపిన కూతురు గేదెకు పచ్చగడ్డి ఏ గట్టున కోసుకెళ్ళనని అడిగింది.

"పచ్చగడ్డి నువ్వు కోసుకెళ్ళడమేమిటి? అమ్మ ఏమైంది?" అని తండ్రి అడిగేసరికి—

"పండుగ దగ్గరకు రావడం లేదేమిటి?



అందుచేత ఇల్లు మరమ్మతు చేస్తోంది. జెత్తికలు వలవాలి. మన్ను-పేడ-వూక కలిపి మెత్తగా తొక్కాలి. ఒక్కొక్క యింటికే గుద్ద కట్టువేయాలి. తరువాత ఇళ్లన్నీ అలకాలి. గోడలకు సున్నం రాయాలి అరుగులు బాగుజేసుకోవాలి. పప్పులు వండుకొనేందుకు పిండి గొట్టుకోవాలి. పనులున్నాయని అమ్మ పచ్చగడ్డికి రానన్నది. ఈ వారంరోజులూ నన్నే కోసుక రమ్మనమంది." కూతురు చెబుతూన్న మాటలు వింటూన్న తండ్రి యీ లోకాన్నే మరచిపోతూన్నాడు. అందరూ గబగబా అన్నం తింటూంటే రామిరెడ్డి నెమ్మదిగా తింటున్నాడు. కూతురు పచ్చగడ్డిని కోసుకెళ్ళుతాననే అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేసినప్పుడు రామిరెడ్డి ఒక్కక్షణంపాటు మహానందాన్ని అనుభవించాడు. తన కొడుకులు—కూతుళ్ళందరూ తనలాగానే కష్టపడి పనిజేయడానికి ఉత్సాహాన్ని కనపరచడం మాటిమాటికి గుర్తుకు తెచ్చుకొని మురుసుకొన్నాడు.

"అలాగైతే మంచిఎత్తుగడ్డి ఆ బోదెగట్టునున్నది కోసుకెళ్ళు. ప్రతిరోజూ ఆనవాలుగా కోసుకెళ్ళుతూండు. గడ్డిలో జాగ్రత్త. పురుగులుంటాయి."

ఎడమచేత్తో తట్ట బట్టుకొని, కుడిచేతిలో కత్తి అటూ ఇటూ త్రిప్పుతూ ఒయ్యారంగా బోదెగట్టువైపుకు నడుస్తూన్న కూతురు గభాలున ఆగి తండ్రివైపుకు జూసి "పండుగకు బావయ్యను తీసుకురావాలట"ని తనలో తానే నవ్వుకొంటూ బోదెగట్టుకు వెళ్లిపోయింది.

4

అందరూ కలసి భోజనాలు తింటున్నారు. రైతు-కూలీ వర్గభేదం లేదు. అవర్ణులు-సవర్ణులు వర్ణభేదం లేదు. పెద్దా-చిన్నా వయస్సుభేదం లేదు. అందరూ కలసి ఏకపంక్తిగా కూర్చొని భోజనాలపని పూర్తిజేస్తూన్నారు. ఎద్దులు బంతికట్టులో నిలబడి నెమర్లు వేస్తున్నాయి. గిత్తలకు కాళ్లనొప్పులు పుట్టాయి కాబోలు అక్కడనే, బంతికట్టులోనే పడుకొని నెమర్లు వేస్తూన్నాయి. పెద్దయెద్దులకు ఆకలి దీరక ఇంకనూ మెరుగుకంకులు నములుతూనే ఉన్నాయి.

ఇంతలోనే తొమ్మిదిగంటల రైలుబండి వచ్చే కూత వినిపించింది. అందరూ భోజనాలపని గబగబా పూర్తిజేసుకొని లేచి చేతులు కడుక్కొన్నారు. చుట్టలు జుట్టేవాళ్లు చుట్టల్ని - బీడీలు కాల్చేవాళ్ళు బీడీల్ని - ఎవరి అవుసరాల్ని వారు తీర్చుకొని తిరిగి పని ప్రారంభించారు.

నిముషంసేపు అయినా విశ్రాంతి తీసుకోరు తెల్లవారుఝామున నాల్గు గంటలకే లేస్తారు. రాత్రి ఎనిమిది గంటలవరకు పనిజేస్తూనే వుంటారు. రోజుకు పదహారు గంటలు పనిజేసినప్పటికీ మిగిలే ఫలితం మాత్రం హుళక్కి. వాళ్లు రైతులు. కష్టజీవులు. పచ్చని పైరులతో నిండి నిబిడీకృతమై కన్నుల కానందాన్ని గల్గించే పొలాల్లో వున్నంతకాలం విచ్చిన మనస్సులతో విహరిస్తారు. పైరులమీద తేలియాడుతూండే పిల్లవాయువులు వచ్చి తమపై పడుతున్నపుడు స్వర్గసుఖాన్ని అనుభవించుతారు. ప్రకృతిమాత ఒడిలో బంగారుపాప పంటపొలం అయితే, ఆమె అల్లారుముద్దుపాపడు రైతు. అతడు దేశానికి వెన్నెముక. రాజ్యానికి రక్షకుడు. కోట్లాది జీవరాసులకు జీవనప్రదాత. జాతికి వెలుగు. సంఘానికి వెన్నెల అతను పొలంలో వుండి పనిజేయునప్పుడు అనుభవించే ఆనందం వేరు. అది మాతృదేవి ఒడిలో జేరి కేరింతలాడే పసిబాలుర ఆటలకంటే ఆనందదాయకమైన పిడికొట్టుడు బల్లక్రింద జేరుతున్న ధాన్యపురాసుల్ని జూసి, అర్థచంద్రాకారంగా పెరుగుతున్న వరిగడ్డి గడిమిని జూసి, వరిమోళ్లు దాటి అప్పుడప్పుడే పైకి వస్తున్న మినుము—జనుము—పెసర మొక్కలను జూసి అతను పొందే ఆనందానుభూతి వేరు. అన్ని సంపదలను చేతికిచ్చే పొలంలో నిలబడి యున్నపుడు అతను కనే తీయని కలలే వేరు. అయితే, యీ తీయని కలలు పగటికలలవుతాయి గూడా.

గింజలు రాలగొట్టడం, గడ్డి దులపడం, బంతులు తోలడం అవసరాన్ని బట్టి అందరూ పనిజేస్తూన్నారు. రామిరెడ్డి గూడా తన బంతుపని పూర్తిజేసుకొంటూనే వున్నాడు. కూతురు తట్టనిండా పచ్చగడ్డిని కోసుకొని ఇంటికెళ్లుతూ మంచినీళ్ళ కొచ్చి తట్టను క్రిందదింపుకొని మంచినీళ్ళు త్రాగుతూ మళ్ళీ అంది "నాన్నా బావయ్యను పండుగకు తీసుకరావాలి."

మాటలో మాటగా నవ్వుతూ వెంకిరెడ్డి అన్నాడు. "బావా యీ పిల్ల పెళ్ళిఅయిన తరువాత మొగుణ్ణి తీసుకొచ్చేవరకు పోట్లాడుతూనే వుంటుంది"

ఆ పిల్ల వెళ్ళినతరువాత కాసేపటికి ఏదో మాటల సందర్భంమీద తాతిరెడ్డి ఇలా అన్నాడు. "రామిరెడ్డీ! యీ సంవత్సరం రెండో అమ్మాయికి పెళ్ళిజేయ వేమిటి?"

"ఇప్పుడప్పుడే తొందరేమి వచ్చిందిలే. పెద్దమనిషై ఇంకా మూడు మాసాలే నా కాలేదు"-రామిరెడ్డి పైవిధంగా సమాధానం చెప్పగానే తిరిగి ఎవరిపనిలో వారు నిమగ్నులైపోయారు.

అందరితోబాటు రామిరెడ్డిగూడా పని జేస్తూన్నప్పటికీ తనలో తాను తీవ్రంగానే ఆలోచించుకొంటున్నాడు.

"పండుగకు అల్లుణ్ణి తీసుకరావాలి. ఇది ఎలాగూ తప్పదు. అల్లునికి పంచెలు, అమ్మాయికి చీరెలు, ఇంట్లోవాళ్లకి బట్టలు, ఇంకా పండుగ ఖర్చులు. ఇంతే గాదు. పెద్దమ్మాయి పెళ్ళయి రెండు సంవత్సరాలైనా ఇంతవరకు ఇస్తానన్న కట్నం ఇవ్వనేలేదు. పెళ్లి అయేనాటికి రెండుమూడువేలు నిలువవుంటే అవి ఖర్చులకు సరిపోయాయి. కట్నంగా ఇస్తామన్న మూడువేల రూపాయలు అప్పుడే ఇవ్వమని అడిగితే పంటలనాటికి వడ్డీతోసహా ఇచ్చేస్తానని చెప్పాను. గాలిపాటు సరిగ్గా లేక నిరుడు సంవత్సరం పంటలు సరిగ్గా పండకపోవటంవలన యీ సంవత్సరం ఇస్తానని చెప్పాను. పరిస్థితుల్ని బట్టిజూస్తే యీ సంవత్సరం గూడా ఇవ్వగలిగేట్లు కనుపించడంలేదు. పంట తరుగ్గానే కనుపించుతోంది. వ్యవసాయ శాఖవారు సకాలంలో ఎరువుల్ని సప్లయిజేస్తే బాగుండేది. వారా పని చేయకనేపోయారు. అధికాహారోత్పత్తికి పూనుకోనండని రైతుల్ని హెచ్చరించుతూ కాగితాలమీద ప్లానుల్ని తయారుజేసి పేపర్లనిండా ప్రకటనలుజేసే ప్రభుత్వం అందుకు తగిన సహాయం రైతులకు చేయనే చేయుటంలేదు. పంటలు తరగడం, జీవితావసరవస్తువుల ధరలు - వ్యవసాయపనిముట్ల ధరలు గత రెండు సంవత్సరాల్లోనూ కొరియా యుద్ధం పేరుతో విపరీతంగా పెరిగిపోవడం, ఇంట్లో ఖర్చులుగూడా జాస్తిగావడం, ఈ కారణాలన్నింటివల్ల చేసిన బాకీలు చాలా అయ్యాయి. ఈ సంవత్సరం పంట చిల్లర బాకీలకు - ఖర్చులకు సరిపోతుంది.

"మరోసంవత్సరం వచ్చేసరికి అల్లుని కట్నం వడ్డీతోసహా నాల్గువేలవుతుంది. రెండోఅమ్మాయి పెళ్ళిప్రయత్నం జరిగితే ఎంతలేదన్నా మళ్ళీ రెండువేలరూపాయలు ఖర్చు. ఇక కట్నం సంగతి వేరు. మనకు మనంగా ప్రయత్నం చేయక పోయినా కలసివస్తే మాత్రం పెళ్ళిచేయక తప్పదు. ఖర్చులు-కట్నాలు తప్పవు.

"ఇద్దరు అమ్మాయిలకు కట్నాలక్రిందనూ, పెళ్ళి - పేరంటాల ఖర్చులక్రిందనూ మొత్తం మూడెకరాలు అమ్మవలసి వస్తేట్లుంది. వున్న పదెకరాల్లో మూడెకరాలు పోతే ఏడెకరాలు మిగులుతుంది. ఇంకొక ఆడపిల్ల పెళ్లికుంటుంది. ఆ అమ్మాయి పెళ్లి నాటికి మరికొంత పొలాన్ని అమ్మితే చివరకు మగపిల్లలు ముగ్గురకు ఏమి మిగులుతుందో ఏమో!"

పనేమిజేస్తున్నప్పటికీ రామిరెడ్డి కిదే ఆలోచన. నాల్గుగంటల రైలుబండి తిరిగి వచ్చేస్తోంది. అంతా తొందరపడుతున్నారు. చల్లబడిపోతే గాలివేయదు. గాలి తగ్గితే పోతపని పూర్తిగాదు. పోతపని పూర్తిగాకపోతే ధాన్యం ఇవ్వాళ ఇంటికి జేరదు. ధాన్యం ఇవాళనే ఇంటికెళ్లితే వీటిని పురిలో పోసేయవచ్చును. రేపు మరొక తప్ప పదేయవచ్చును.

ఈ తొందర పనుల్లో మిగతావాళ్లతో బాటు తానుగూడా పనిజేస్తున్నప్పటికీ రామిరెడ్డి మనస్సుమాత్రం ఆవేశంతో-ఆవేదనతో-ఏదో ఆలోచించుతూనే వుంది. రైలు జీవితానికి, రైతుజీవితానికి మధ్యనున్న తేడాయేమిటి? జీవంలేని రైలు గొప్పదా? జీవమున్న రైతు గొప్పవాడా?

రైలు ఉదయం తొమ్మిదిగంటల కెళ్లింది తిరిగి సాయంకాలం నాల్గుగంటలకు వచ్చేస్తోంది. రేపూ అంతే. ఎల్లుండి అంతే. ఎప్పుడూ అంతే. వెళ్లుతుంది. వస్తుంది. రైతూ ఇంతే. తెల్లవారుఝామున నాల్గుగంటలకు రావడం. రాత్రి ఎనిమిదిగంటలకు వెళ్ళడం. ఇది మామూలే. ఈవిషయంలో రైలు జీవితానికి-రైతు జీవితానికి ముఖ్య తేడా ఏమీ కనుపించడంలేదు.

ఇక మిగతా విషయాల్లో రైలే గొప్పదిగా కనుపించుతోంది. దాని మరలకు ఆయిల్-బొగ్గూ-నీరూ పూర్తిగా కావాలి. దాని కడుపుకు కావలసినంత ఆహారం. ఎప్పుడు పెట్టకపోతే అప్పుడు రపీమని ఆగిపోతుంది. రైల్వే శాఖకు చెందిన ప్రభుత్వ పరివారమంతా వచ్చినట్లుగా దానికి జోహుకుం చేయాలి. రైలుకున్న ఈ హక్కు రైతుకులేదు. తనకు కావలసిన వ్యవసాయ పనిముట్లనుగాని, ఎరువుల్నిగాని, విత్తనాలనుగాని, పశువుల దాణా దినుసులనుగాని సకాలంలో-సరైన ధరల కివ్వమని ప్రభుత్వాన్ని గొంతెత్తి అడగలేడు. వీటికోసం సమ్మెచేయలేడు. ఎలాగో కష్టపడి-బాధపడి ఏదోవిధంగా పంట పండించిన తరువాత తాను అమ్మకొనే ధాన్యానికి గిట్టుబాటయ్యే ధర వచ్చేట్లుగా ప్రయత్నాలు చేసుకోవడానికి రైతుకు హక్కులేదు. ధాన్యానికి ధర నిర్ణయించేప్పుడు ప్రభుత్వం రైతునిసలహా అడగదు. మిగతా పారిశ్రామిక వస్తువులధర విషయం అలాగాదు. రైతు అన్ని విధాలా అసమర్థుడు. పెట్టుబడిదారీ ప్రపంచంలో రైతుజీవితం కంటే రైలుజీవితమే గొప్పదిగానూ విలువ గల్గిందిగానూ వుంది. మరో ప్రపంచం విషయం ఎలా వుంటుందోగదా?

5

పొలాన పనులు పూర్తికాగానే ధాన్యం బస్తాలను బళ్ళకెత్తుకొని అందరూ ఇంటికొచ్చేశారు. ధాన్యాన్ని పురిలో పోసిన తరువాత వెంకిరెడ్డి, తాతిరెడ్డి మున్నగువారు కలసి కుప్పలు నూర్చుకొనే సహాయదారులంతా తమతమ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

రామిరెడ్డిగూడా ఎద్దుల్ని చావిట్లోకి తోలుకెళ్లి కట్టేసి, మేతవేసి, ఇంటికి వచ్చాడు. భార్య తెచ్చియిచ్చిన వేరుశెనగకాయలు తిని, కంచెంబుడు మంచినీళ్ళు త్రాగి, పొంతకాగు బయటపెట్టుకొని నీళ్లు పోసుకొంటున్నాడు. భార్య దగ్గిరకొచ్చి అడుగుతోంది.

"పండుగ దగ్గరకొస్తోంది."

"అయితే ఏమంటావేమిటి?"

"ఎప్పుడూ ఇంతే. నేను మాట్లాడితే నెకస్సు బుస్సులాడుతారు. బయట అరుగుకైనా సిమెంటు రాస్తే బాగుంటుంది. రేపు పండుగకు అల్లుడు గూడా వస్తాడు. నాల్గు సిమెంటుకట్టలు—ఇసుక తెప్పించండి. మేమే ఎలాగో పని పూర్తి జేసుకొంటాము."

"అలాగే లే."

"బళ్లోకి పోయే మగపిల్లాళ్ళు గోలచేస్తున్నారు. పండుగనాటికన్నా కొత్త చొక్కాలు-లాగూలు కావాలంటున్నారు. రోజూ నన్ను చంపుకతింటూన్నారు. రాత్రివేళ మీరు వచ్చేసరికి వాళ్ళు నిద్రపోతారు. తెల్లవారుఝామున వాళ్లు లేవక ముందే మీరు లేచివెళ్లిపోతారు. రేపు పండగకు తీసికొచ్చినప్పుడు అల్లునికి గూడా బట్టలు పెట్టాలి అందరికీ ఒకసారే తెండి."

"సరే. తీరుబడి అయినప్పుడు బస్తీ వెళ్ళి వస్తాను."

స్నానం పూర్తికాగానే అన్నం వడ్డించగా రామిరెడ్డి తింటూంటే రాజమ్మ అడుగుతుంది.

"పెళ్లీడు కొచ్చిన అమ్మాయికి గాజులైనా లేవు. నాల్గు సవరనులు బంగారం తెప్పించండి. రెండు జతలు గాజులు చేయించుదాం. ఎవ్వరైనా సంబంధాలవాళ్లు చూసేందుకు వచ్చినా బాగుంటుంది."

అల్లుని కివ్వవలసిన కట్నం బాకీ, వున్న చిల్లర రుణాలు, అమ్మాయి పెళ్లి కలిసివస్తే అయ్యే రుణం, వస్తూన్న ఆదాయం, అవుతూన్న ఖర్చులు అన్నింటినీ వివరంగా భార్యకు చెప్పేసి పరిస్థితుల్ని బట్టి జాగ్రత్తగా ఖర్చులుచేయమని రాజమ్మను మందలించుదామనుకున్నాడు. ఇంతలోనే బయటనుండి కేకలు వినుపించాయి.

సందా కవళం తల్లీ!

....

ప్రొద్దుటినుండి తిండిలేదు మామ్మా!

....

అన్నదాత గృహాలు అమ్మా!

రాజమ్మ ఒక ముద్ద అన్నం పట్టుకెళ్లి వాళ్లకు పెడుతోంది. రామిరెడ్డి అనుకొన్నాడు. అన్నదాతలం. నిజంగా మేము అన్నదాతలం. మా పరిస్థితు లెలా వున్నా ఇతరులకు తప్పని సరిగా అన్నదానం జేస్తాం. మా ఇంట్లో పరిస్థితులు ఎలా వున్నప్పటికీ మేము బాహ్య ప్రపంచానికి అన్నదాతలమే. ముమ్మాటికి అన్నదాతలమే." ★

చౌర్యంలో క్రొత్త పంథా

శ్రీ మధురాంతకం రాజారాం

సమయం : ఉదయం 9 గంటలు

[కరుణాకరంగారి ఇంట్లో హాలు. అతని భార్య మీనాక్షి ఒకమూల కూచొని కూరగాయలు తరుగుకొంటున్నది. కుమారుడు శంకర్ కుర్చీలో కూచొని ఏదో చదువుకొంటున్నాడు. కుమార్తె అన్నపూర్ణ హాలుకూ వంటగదికీ మధ్య గడపలో నిలుచుని వున్నది]

మీనాక్షి : మీ నాన్నగారి నీలా ఒక్కసారి పిలువు శంకర్.

శంకర్ : ఎక్కడున్నారని పిలవమంటావమ్మా?

మీనాక్షి : మిద్దెపైన లేరూ?

శంకర్ · లేరు.

మీనాక్షి : ఐతే ఎక్కడికి వెళ్ళినట్టు?

అన్నపూర్ణ : మాకు జోస్యం తెలుసనుకుంటున్నావామ్మా? బహుశా రీడింగ్ రూముకు వెళ్ళివుంటారు.

మీనాక్షి : ఆ రీడింగు రూమొకటి మన ప్రాణానికి! నిద్రలేవకముందే పేపరు ఇంటికే వస్తుందాయె. అక్కడి కెందుకు వెళ్తారో, ఏమో నాకర్థం కావడంలేదు.

శంకర్ : ఒక్క ఐదు నిమిషాలు అయినా ప్రశాంతంగా చదువుకోనిస్తావామ్మా నువ్వు? అస్తమానం అదిలేదు, ఇది లేదు అంటుంటావ్.

మీనాక్షి : లేనిదిలేదు అని ఆయనతో గాక ఇంకెవరితో చెప్పమంటావురా? లేని వస్తువు కొని తెమ్మంటారని ఇంట్లో మగవాళ్ళంతా ఇలా పరారైపోతే కాపురాలెం జరుగుతాయిరా నా తండ్రీ?

అన్నపూర్ణ : నాన్నగారిలాంటి కవులకు కావలిసింది కాపురాలు కాదమ్మా, కల్పనలు. వారు కల్పనలో దిగిపోయారంటే ఒక్క కాపురాన్నేమిటి, నిఖిల ప్రపంచాన్నీ మరచిపోతారు.

శంకర్ : వారు మరచిపోయినా మన లాంటివాళ్ళం జ్ఞాపకం చేస్తూనే వుంటాముగా! (విసురుగా వెళ్ళిపోతాడు)

అన్నపూర్ణ : మొన్న నేం జరిగిందో తెలుసామ్మా? నువ్వింట్లో లేవు. ఎవరో యిద్దరు నాన్నగారిని చూడడానికి వచ్చారు. వాళ్ళని చూచిందే తడవుగా ఈయన 'అద్భుతమైన ప్లాట్ దొరికింది. బ్రహ్మాండమైన ప్లాట్ దొరికింది' అని వీధిలో పోయేవాళ్లు వినేట్టు చెప్పసాగారు. పాపం! ఆ ఇద్దరు పెద్దమనుషులు ఇల్లు కట్టుకోడాని కేదైన చక్కని స్థలం దొరికిందేమో ననుకొని నాన్నగారి చేయి నొప్పిపెట్టేటట్లుగా షేక్ హేండ్ చేసి పారేశారు.

మీనాక్షి : కొత్తగా ఇల్లు కట్టకపోతే పోయె; ఉన్న ఇంటికి సరిగ్గా అద్దె ఇస్తూంటే చాలు.

అన్నపూర్ణ : ఐనా నీకేమమ్మా. నువ్వు పోయి కాపురంచేసేట్టుగా వుంటే నాన్నగారు ఈ క్షణం సహారా ఎడారిలో నూరుఎకరాలు, బంగాళాఖాతంలో ఏభై ఎకరాలు తీసుకోగలరు!

మీనాక్షి : అక్కడి కెందుకే పోవడం. ఇక్కడున్నా నా బ్రతుకు ఎడారిగానే వుందిగా! కట్టెలమోపు తేకపోతే ఈదినం వంటాలేదు, గింటాలేదు.

(వడివడిగా కరుణాకరం ప్రవేశించి ఈజీచేర్లో కూలబడుతాడు)

మీనాక్షి : మీ కోసమే ఎదురు చూస్తున్నాం.

కరుణా : థేంక్స్. మీ రెవరుగానీ ఒక్క అరగంటసేపు నాతో మాట్లాడ్డానికి వీలు లేదు. (పైకప్పుకు చూస్తూ) అధ్యక్షా! మహాజనులారా! మహిళామణులారా! నాకీసమావేశంలో ప్రసంగించే అవకాశం కల్గించిన మీ కందరికీ నా ధన్యవాదాలు.

మీనాక్షి : మధ్యాహ్నం వంటకు ఇప్పుడొక మోపుకట్టెలు తెచ్చి పడేయండి. తరువాత మీ ధన్యవాదాలు తీరికగా సమర్పించుకోవచ్చు.

కరుణా : (భార్యమాటలు వినిపించుకోకుండా తన ప్రసంగధోరణిలోనే) మీరు నేనేదో మహావక్తననీ, మీకు తెలియని రహస్యాల్ని విడమర్చి స్పష్టంగా తెలియజెప్పగలననీ అనుకొనివున్నట్లయితే నిజంగా మీరు కలుగబోయేది ఆశాభంగమే.

మీనాక్షి : అతురాలా యధార్థం చెప్పారు. మీవలన ఎంతెంతటి ఆశాభంగాలు కలుగగలవో నాకంటే బాగా యింకెవరికీ తెలియదు.

కరుణా : ఏమిటే నీ వాగుడు? ఎల్లుండి బ్రహ్మాండమైన మీటింగులో ప్రసంగించబోతున్నాను...

మీనాక్షి : ఇప్పుడు భోజనం ఎట్లా చెయ్యమంటారు?

అన్నపూర్ణ : ప్రసంగం మధ్యమధ్య ప్రశ్న లడగడం మామూలేగద నాన్నా.

మీనాక్షి : ఏం మీటింగో? అర్థరాత్రి వరకూ డాబాపైన అటూ ఇటూ తిరుగుతూ మాటాడుకోవడం. తెల్లవారి మొదలు నిలువుటద్దం ముందునిలిచి వదరడం. వారం రోజులుగా ఇదో డ్యూటీ ఐపోయింది. ఇన్ని దినాలు ఏదో వ్రాసి వ్రాసి కాగితాలు ఖరాబుచేశారు. ఇప్పుడు వాగి వాగి...

కరుణా : నాన్సెన్స్.. ఇక నోరు తెరవకు. ఇకమీదట మనం సాధారణ రచయితలమే కాదు. వివేకానందునివంటి వక్తలం. వేదికపై ఎక్కి కరుణాకరం ప్రసంగిస్తున్నాడంటే వేణుగానం విన్న నాగకన్యలవలే సభ తన్మయత్వం చెంది పోవాలి. మధ్యమధ్య లేచే కరతాళ ధ్వనులకి మిన్నూ మన్నూ ఏకమైపోవాలి.

మీనాక్షి : ఐపోతుందనుకోండి. దానివల్ల మీకేమైనా లాభమా?

కరుణా : లాభనష్టాలు వర్తకంలో. కళా విషయికంగా లాభనష్టాలు పాటించడం మహాఘోరం. 'కళకోసమే కళ' అన్నాడొక కళావేత్త.

మీనాక్షి : పెద్దలు సంపాదించి పెట్టి పోయిన ఆస్తిని తెగనమ్మి తింటూ అందరూ హాయిగా ఇంట్లో కూచొని 'కళ కళ' అని కళాభజన ప్రారంభిస్తే ప్రపంచనాటకం పరిసమాప్తి చెందినట్టే. మొదట బ్రతుకు తెరువు, తరువాత కళ.

అన్నపూర్ణ: నాన్నకంటే నువ్వే బాగా ఇవ్వగలవమ్మా లెక్చరు. మీ రిద్దరూ చేరి ఒక పక్షంగా ఎలక్షన్‌లో నిలబడ్డారంటే అతురాలా విజయం మీదే.

కరుణాకరం: ఇక ఊరుకోండి. (ప్రసంగధోరణిలో) నేను యధార్థాన్ని మించి

మరొక్క మాట మాటాడలేను. 'యథార్థ వాదీ లోక విరోధి' అన్నారు పెద్దలు. ఐనా కానీండి. మొట్టమొదట నే నెత్తుకొంటున్న విషయ మేమంటే...

మీనాక్షి : (భర్త ప్రసంగంతో కలుగుకొని) వంటచెరకు లేనిదానివల్ల ఇంటిలో వంట నాస్తిగావడం. కాపురంయొక్క బాగోగుల్ని ఇసుమంతైనా గమనించని ఇంటి యజమాని ఆ ఇంటికిమాత్రమే విరోధికాదు; దేశానికే విరోధి!

అన్నపూర్ణ : బలే! మవ్వేగాన్ని వేదికపై ఎక్కావంటే అన్నాంభూకంపమంత హర్షధ్వానం చెలరేగుతుందమ్మ. నాన్నా, నువ్వూ కలిసి ఆంధ్రరాష్ట్రం కావాలని ప్రచారంజేస్తూ దేశ పర్యటనమే ప్రారంభించవచ్చునే.

మీనాక్షి : ఇదిగో ఈలా చూడండి. మీరు ప్రసంగంచేయండి, పాడండి, భరత నాట్యం ఆడండి. ఏమైనా చేయండి. కానీ ఇంట్లోవాళ్ళు బ్రతుకుతున్నారా చస్తున్నారా అని గమనించడం మాత్రం మరచిపోవద్దండి. ఇంకొక విషయం కూడా ఇప్పుడే చెప్పేస్తున్నాను. ఇంతవరకూ మీరు కథలు వ్రాసేవారు. అవి బాగుంటే ప్రచురించేవాళ్ళు లేకుంటే వాపసుపంపేవాళ్ళు. సమావేశంలో మాటాడ్డమంటే అంత సులభమైన పనిగాదు.

కరుణా : ఎందుకు కాదు ?

మీనాక్షి : 'కూచో' 'లోపల పో' 'నోర్మూయ్' ఈలాంటి కేకలు లేస్తాయి.

కరుణా : నోర్మూయ్ అపశకున పక్షీ! సాయంత్రం ఎట్లాగైనా కట్టెలమోపు తెచ్చి ఇంట్లోపడేస్తాను.

మీనాక్షి : ఐతే అర్ధరాత్రికే భోజనం కూడా తయారౌతుంది.

(వీధిలోనుంచి "కరుణాకరంగారున్నారండీ" అనే కేక వినబడ్తుంది. కరుణాకరం ద్వారందగ్గరికి వెళ్ళి 'రండి రండి' అని ఆహ్వానిస్తాడు. మీనాక్షి, అన్నపూర్ణలోపలికి వెళ్ళిపోతారు. ఆగంతకుడు వచ్చి కుర్చీలో కూచొంటాడు)

కరుణా : మిమ్మల్నింతవరకూ నేను చూచినట్టులేదు.

ఆగం : నేను మిమ్మల్ని ఎన్నోసార్లు చూచివున్నానండి. మీకు తెలిసే వుంటుంది ఈవూళ్ళో 'యువజనసమితి' అనే సంస్థ ఒకటుందని. దానికి నేను కార్యదర్శిని. రేపు మేమొక మీటింగు ఏర్పాటుచేసి వున్నాం, అందు కథ్యక్షుణ్ణిగా...

కరుణా : నన్ను పిలుస్తున్నారు. అంతే గదా! అవశ్యం వచ్చి మీ కార్యాన్ని జయప్రదంగా నెరవేరుస్తాను. ఐతే నన్ను దేన్నిగురించి మాట్లాడమంటారండి ?

ఆగం : మీరు దేన్నిగురించి మాటాడినా వినేందుకు మేము సిద్ధంగా కాచుకొని వున్నామండి, రేపు నాలుగు గంటలకువచ్చి మిమ్మల్ని పిలుచుకొని పోతాను. (లేచి) నాపేరు రంగనాయకులు, వస్తాను. (వెళ్ళిపోతాడు)

శంకర్ : (ప్రవేశించి) నోట్సు కొనుక్కోవాలి నాన్నా. ఒక రూపాయ కావాలి.

కరుణా : (పైమాటల్ని చెవిలో వేసుకోకుండా) సభాసదులారా! నేడు మానవ జీవితాన్ని ఎన్నో సమస్య లెదుర్కొంటున్నాయ్. స్వప్రయత్నంచేత మానవుడు ఈసమస్యల్ని ఛేదిస్తేగాని ప్రపంచానికి శాంతిలేదు.

శంకర్ : నేను "కవర్లీ పేపర్స్"కి నోట్సు కొనుక్కోవాలినాన్నా.

కరుణా : నోట్సు తరువాత కొనుక్కుందువుగానీ మొదట ఒక కాగితం తెచ్చి నేను చెప్పినట్లు వ్రాయి. ప్రసంగం యొక్క పూర్తిపాఠం ఇప్పుడే తయారైపోవాలి.

శంకర్ : కాలేజికి టైమై పోతుంది నాన్నా.

కరుణా : పరవాలేదు లే, నీకాలేజి చదువు ఎప్పుడూ వున్నదే. కాగితమూ పెనా తీసుకో.

2

(మరునాడు సాయంత్రం మూడు గంటలు. కరుణాకరం నిలువుటద్దం ముందు నిలబడి 'డ్రెస్' చేసుకొంటున్నాడు.)

శంకర్ : (ప్రవేశించి) నిన్న వచ్చిన కార్యదర్శి మిమ్మల్ని పిలువమంటున్నాడు నాన్నా.

కరుణా : అతణ్ణి యిక్కడికే రమ్మను (రంగనాయకులు ప్రవేశిస్తాడు) అన్నట్లు మీటింగు ఎన్నిగంటలకండీ ?

రంగ : సరిగ్గా నాలుగున్నరకు ప్రారంభమండీ. అర్జంటుగా బజారువెళ్తున్నాను పూలమాలకోసం, మళ్లీ ఇక్కడికి రావడానికి నాకు టైముండదు. జట్కా పంపిస్తాను. మీరు మరేమీ అనుకోరుగదా.

కరుణా : అబ్బే! అలా అనుకొనే మనిషిని కానండి. మీరు వెళ్ళి మీ పనులు చూడండి. నేను వచ్చేస్తాను.

రంగ : (లేచి వెళ్ళబోతూ) ఇంకొక విషయం. ఉన్నట్లుండి ఈ దినం మా గడియారం ఆగిపోయింది మీ టైంపీస్

(22-వ పేజీ చూడండి)

పాకప్రవీణ

సాధారణంగా ఏ ఇంట్లో "ధుం" అనినా రమణమ్మ అక్కడ వుండాల్సిందే. అంతకు క్రితం రమణమ్మని మర్చిపోయినవాళ్ళు, ఎరగని వాళ్ళు కూడా రమణమ్మని జ్ఞాపకం, పరిచయం చేసుకొని కాళ్ళు పట్టుకొని అయినా పిల్చుకొనిపోతారు. కారణం రమణమ్మ మహా నేర్పరి: ఆమె వంటగదిలో వుంటే వడలకు పప్పురుబ్బిచ్చే వాళ్ళు కూడా అనవసరమే: ఇటు వంట పని, అటు నీళ్ళపని, ఆ ఖర్మ వడ్డన సంగతికూడా నెగ్గించుకోగల, నెగ్గించగల చతుర !!! అందుకే రమణమ్మ అంటే కార్యాలు తల పెట్టినవాళ్ళు ఆమె కాళ్ళు పర్యంతం పట్టుకొంటారు. ఇంతకీ రమణమ్మ ఆశ పోతు కాదు. ఆ ఖర్మ వారింట్లో అన్నం కూడా తినదు. టంచనుగా ఐదురూపాయలు, ఆ పైన వారి దయ ఎంతఇస్తే అంత తీసుకొని గుట్టుగా వెళ్ళిపోతుంది. ఒక పనిరాదు అనేమాటే రమణమ్మదగ్గర నాస్తి.

ఇంతా చేస్తే రమణమ్మ ఏ అరడుగులమనిషో, దుక్కలాగుంటుందో, దంతావళమో అనుకోనేరు!: పట్టెడంతమనిషి. సన్నగా నాజూగ్గా వుంటుంది. రంగునలుపే అయినా ఆ పట్టెడంత వళ్ళు అందంగానే వుంటుంది. అయితే ఆ రెండు పళ్ళు కొద్దిగా ఎత్తు. అది తప్పితే రమణమ్మకేం లోటులేదు. సైనంచు పంచలు నెలకు నాలుగు కడుతుంది. సంవత్సరానికి పన్నెండుచీరలు కొనందే నిద్రపోదు. కష్టపడి వచ్చినడబ్బును ఆమె ఇంట్లో దాచుకోదు. తన ఖర్చులకు పోను మిగిలింది వడ్డీకిస్తుంది. ఇంతకీ ఆమె వయసుముప్ఫయ్ ఐదు; ఆ తలకు ముసుగులేకపోతే ఏ పద పదహారేళ్ళపిల్లో అని అనుకోగలరు ఎవరేనా ఉన్నపాళాన చూస్తే. రమణమ్మని వంటవిషయంగా అడిగితే "ఆఁ...పాతికేళ్ళనుంచీ నాచేతుల్లో నలిగిన వంట విషయం ఏం చెప్పను. వంటఅంటే అసహ్యించుకొనే వాళ్ళూ వున్నారు. వంటంటే ప్రియంగా చూసుకొనేవాళ్ళూ వున్నారు" అని వంటవిషయాన్ని సరిగ్గా చెప్పదు. ఆమె చేతివంట అమృతమే; ఆమాట అందరూ ఒప్పుకొంటారు.

ఒక్కసారి రమణమ్మని "నాకు వంట నేర్పండి" అని ఎవరేనా పడుచుపిల్లలు అడిగితే ... "మీ కెన్ని ఏళ్ళు?" అని అడిగి పదునాలుగేళ్ళు దాటింది అంటే నోరు చప్పరించి "ఆఁ" మానయిపోయింది, వంట నీ వంటికి పట్టదు. నెమ్మదిగా నువ్వే నేర్చుకో అనేది. ఆ పడుచుపిల్లలకు కోపం వచ్చేది. ఇలాగా రమణమ్మ చెప్పడంవల్ల "స్వార్థపరురాలు" ఆమె అనుకొనేవారు. కానీ రమణమ్మ ఒకొక్కప్పుడు అమ్మలక్కలతో చెప్పుకొని ఏడ్చేది. "మా అమ్మ నన్ను ఎనిమిదేళ్ళనుండీ వంటకు పెట్టింది. నాలుగేళ్ళకే పెళ్ళిచేసి నాతాడు తెంపింది. లేకపోతే ఎంచక్కా చదువుకొని ఏళ్ళు దాచుకొని నేనో కులుకులాడిలా వుండలేకపోయానా?"

ఏమయితే ఏం; రమణమ్మ వంటలక్కలా జీవితం ప్రారంభించింది. ఒక్క ముసిలి తండ్రి తప్పితే ఎవ్వరూ లేరు నాఅన్నవాళ్ళు.

రమణమ్మ నోరుజారి చెప్పే మాటల్ని గురించి అమ్మలక్కలు విమర్శ చేసేవాళ్ళు. "మహాగీర్వాణం. తానే అక్కడకి వంట మనిషి అయినట్లు, ఇంకెవ్వరిచాతా కాదా ఆ వంట" అని ఒకమ్మ అంటే, "మనం సోమరులమయితే రమణమ్మకి పేరొచ్చింది. రేపు నా కొడుకు వడుక్కి నేనే చేస్తాను" అని ఓ ఇల్లాలు సవాల్ చేసేది. "లేదమ్మా! మొత్తానికి రమణమ్మ వంటే వంట" అని ఒకపూర్వసువాసిని మెచ్చుకొంటే, "పదునాలుగేళ్ళకే ముదిరిపోతారా ఆడపిల్లలు, వాళ్ళకి వంట నేర్పి తనపేరు నిలిచేటట్టు చేసుకోకూడదా?" అని ఓ గృహిణి విమర్శించేది. వీళ్ళనుకొన్నట్టు రమణమ్మ ఏ పిల్లకీ పాకశాస్త్ర రహస్యం చెప్పనందుకు అందరూ సత్యాగ్రహంచేసి శుభకార్యాలకి రమణమ్మని పిలవడం మానుకొన్నారు. మొదట్లో రమణమ్మ భయపడ్డది. కానీ ఆ తర్వాత ధైర్యంగానే వుండింది.

కమలమ్మగారింట్లో కొడుకు వడుక్కు రమణమ్మని పిలవాలని ఇంటాయన, పిలవ

మిస్ రాజేశ్వరీరాణి

కూడదని కమలమ్మ చాలాసేపు వాదించుకొన్నారు. ఆఖర్న కమలమ్మ కన్నీళ్ళ అస్త్రానికి అదిరిపోయి ఇంటాయన పిల్లిఅయిపోయాడు. వంటగదిలోని కమలమ్మ మరో ముగ్గుర్ని సాయంగా రమ్మని తాను పీటలపై వెళ్ళి కూచుంది. ఆ ముగ్గురూ చెయ్యలేదనుకోకుండా ఉషారుగా సాయం చేశారు. మూడు చేతులు కలిసిన చారు ఉప్పు కషాయ మయింది. ఒకరిపై ఒకరు భారం వేసి ఇంకోపనికి పోయారు గనక కూర మాడిపోయింది. ఆ ముగ్గురిలో ఒకావిడ స్కూల్ ఫైనల్ ఫెయిల్డ్. ఆవిడకి వంట అసలు తెలియకపోవడం మూలాన పాయసానికి కేసరి పవుడర్ వేస్తారనే విషయం తెలియక, పసుపుపచ్చగా వుంటుందని, శుభంగాకూడా వుంటుందని పసుప్పొడి వేసింది!!! ఇంకో ఆవిడ ముగ్గురి బిడ్డల తల్లిఅయినా పదిమందికి వండి పెట్టేంత అదృష్టవంతురాలు కాకపోవడం వల్ల అంతపెద్ద తబిలని దించలేక తిరగతోసి మరలా వార్చింది. అందులో బొగ్గులు, రాళ్లు...కట్టెపేళ్ళు తాలూకు వస్తువులు కలిసిపోయాయి.

వడ్డన ప్రారంభమయింది. కొందరికి విస్తళ్లు వెయ్యకుండానే కమలమ్మ కుటుంబంవాళ్లు, సహాయార్థం వచ్చిన ఇరుగుపొరుగువాళ్లు వడ్డించేసేరు. ఆకులు వెయ్యనివాళ్ళ వరసలో కమలమ్మ భర్త (వాళ్ళ అదృష్టంకొద్దీ) వుండటం మూలాన ఆయన అరిచి ఆర్భాటం చేసేసరికి వడ్డించేవాళ్ళంతా మొదటివాళ్ల సంగతి మర్చిపోయి, ఇలా మళ్ళారు. మొదటివాళ్ళలో ఉద్యోగస్థులంతా వున్నారు. వాళ్ళను మర్చిపోకుండా కమలమ్మ పాయసం తెచ్చి వడ్డించేసరికి తాసీల్దారుగారు "ఈవేళ రమణమ్మగారి వంట ఇంత అధ్వాన్నంగా వుందేం కమలమ్మా?" అని అడిగాడు.

"మర్చిపోయి కేసరి పవుడరనుకొని పసుప్పొడి పాయసంలో వేసినట్లుందే?" అన్నాడు మేజస్ట్రేట్. స్కూల్ ఫైనల్ అమ్మాయి ఈయనగారి సతీమణే?

కమలమ్మముఖం దమ్మిడీ అంతఅయింది.

"కూర ఇలా మాడిపోయిందే మమ్మా! ఊహుఁ...ఇన్నాళ్ళు రమణమ్మ చేసిన వంటకు ఈ వంట దిష్టిపరిహారం" తలవిదల్చాడు డాక్టరు బాబు, కూరని వారగా తోస్తూ...

"అందర్నీ మీదగ్గరకు ఒక్కసారిపంపించేలాగుంది" అని చమత్కరించాడు ప్లీడర్ బాబు నవ్వుతూ డాక్టరుబాబుతో.

కమలమ్మకు తల కొట్టేసినంత పని

(22-వ పేజీ చూడండి)

హెచ్చుతగ్గులు

చెరువుగట్టున కూర్చున్నాను. చల్లని గాలి మెల్లగా వీస్తోంది. ఎండాకాలంలో ప్రాణానికి చల్లదనం చేకూర్చే సాయంకాలం ఎంత బాగుంటుంది! యెంత హాయిగా యెంత మనోహరంగా వుంటుంది! నలువైపులా బూడిదరంగులో ముంచెత్తబడిన పర్వతాలు! పశ్చిమాన సూర్యభగవానుడు తన మిగిలినబంగారాన్ని పంచిపెడుతూ తన ప్రియురాలైన సంధ్యాదేవితో వీడ్కోలు పుచ్చుకోబోతున్న ఆ ఘట్టం! తూర్పున చతుర్దశి చంద్రుడు తన శీతల కిరణాలను లోకంపై ప్రసరింప చేయటానికి పడే తహతహ! బిడ్డలకు ఆకలవుతోందేమో నన్న ఆత్రుతతో ముక్కులలో మేతతో పక్షుల సమూహాలు! ప్రకృతి ఎంతో రమణీయంగా వుంది. కాని ఎంతమంది ప్రకృతి రమణీయతను చూచి ఆనందిస్తున్నారు? రమ్యప్రకృతిని చూచేందుకుగాని, ఆలోచించేందుకుగాని వీల్లేని నిర్భాగ్యులు ఎంతమంది- బండి యెద్దుల్లాగా తిరుగుతూ తింటూ. అంతే! జీవితంలో ఏ చిన్న విషయాన్ని గూర్చి కూడ ఆలోచించేందుకు తీరికేది? ఈలా నే చెరువుగట్టుపైన కూర్చుని లోకం తీరు తెన్నుల్ని గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాను. చేతిలో సిగరెట్ కాలి కాలి వ్రేలు చురుక్కుమంటే తిరిగి నా వూహా జగత్తునుండి వాస్తవ జగత్తుకు దిగాను. లేచి గట్టుపైన పచార్లు చేయటం ప్రారంభించాను. దూరంగా సుమారు ఒక వంద కూలీలు రాళ్ళు కొట్టుతున్నారు. తిన్నగా అచోటికి దారితీశాయి నా కాళ్లు. కూలీలు అలసట పోయ్యేందుకేమో 'ఓ' కొడుతూ రాళ్ళను తమతమ సుత్తెలతో ముక్కలు చేస్తున్నారు. కూలీలందరికీ ఆ చల్లని సాయం సమయంలోకూడా ఫాలభాగాన చెమట బిందువులు విస్పష్టంగా కనిపిస్తున్నాయి. పెదవులు బిగించి శక్తినంతా తమ చేతుల్లోకి కూడ గట్టుకొని రాళ్ళను ముక్కలు చేస్తున్నట్లు స్పష్టంగా గ్రహించవచ్చు. ఆ వందముఖాల్లో ఏదికూడా నేను ఆనందించిన ప్రకృతిని కనీసం చూచినట్టే లేదు! ఇంకేం ఆలోచిస్తారు? ఒకరి ముఖానకూడా నవ్వు కాదు-కనీసం చిరునవ్వు కూడ లేదు. వాళ్లకు హృదయాలున్నాయో లేవో! అవును కమనీయ ప్రకృతిని ఆరాధించే హృదయాలు లేవు వారికి. సమాజం మానవుల్ని మానవులుగాకుండా చేసింది.

ప్రక్కనే ఒక టెంటు, చిన్నది. శుభ్రంగా వుంది. పెద్ద రౌండు టేబుల్ సగం స్థలాన్ని ఆక్రమించింది. టేబుల్ చుట్టూ నాలుగు కుర్చీల్లో నలుగురు పెద్ద మనుషులు కూర్చుని పేకాడుతున్నారు. విలువగల సిగరెట్లు ఒకదానివెంట ఒకటి కాల్చి పారేస్తున్నారు. హుషారుగా కేళాకోళాలతో ఆట సాగుతోంది. ఒక్కొక్కడి ముందర గుప్పెడు నోట్లున్నాయ్ చెల్లాచెదరుగా. కూలీలతో పనిచేయించే కంట్రాక్టర్లు.

బట్టతల కంట్రాక్టర్ లేచాడు. "ఒక నిముషం వుండండి. కూలీల్ని హెచ్చరించి వస్తా" రెండడుగులు వేసి తిరిగి "ఆట సాగనిచ్చేరోయ్! ఒకేనిమిషం" అంటూ తొందరగా కూలీలవైపు వచ్చాడు.

"ఏయ్! మీకేవోయ్. ప్రొద్దుగూడ క్రుంకవచ్చింది. ఇంకా నేనిచ్చిన కుప్పలో రాళ్ళు అన్ని వున్నాయేం?" గద్దించాడు కూలీల్ని.

మనుష్యులతో మనుష్యుడు మాట్లాడినట్లు లేదు. కనీసం షాహుకార్లు తమ కుక్కలతో కూడ మాట్లాడినట్లు లేదు.

"చేస్తున్నాం సామీ!" ఒక కూలికంఠం కదిలింది.

"ఆకుప్ప పూర్తిగాకుంటే యీదినం



శ్రీ బి. నాదమునిరాజు

అర్ధరాత్రయినా మీరు యిండ్లకు పోలేరు." ఆజ్ఞాపించాడు బట్టతలకంట్రాక్టర్.

"ఏం! నేను చెప్పింది అర్థమయిందా? మీకే"

కూలీలు తలలు వూచారు. సుత్తెలదెబ్బలు చురుగ్గా సాగుతున్నాయ్. టక్, టక్, టక్.

నేనూ ఒక వంక నిలుచుని చూస్తున్నా నీ దృశ్యమంతా. మానవునికీ మానవునికీ ఎంత భేదముంది? ఆ టెంటులో వుండే జీవాలూ మనుష్యులే! ఈ రాళ్లుకొట్టే వారూ మనుష్యులే! కాని టెంటులోని వారు కంట్రాక్టర్లు. రాళ్ళను కొట్టేవారు కూలీలు. కంట్రాక్టర్లు చేసేదేమిటి! కంట్రాక్టర్లవి రూపాయలు! ఆ రూపాయలతో యీ కూలీలను-కాదుకాదు-వీరి శ్రమను-కొంటారు. కూలీలతో యిష్టమొచ్చినంతా పనిచేయించుకొంటారు. కాని తమ కిష్టమైనంతే కూలివారి ముఖాన కొట్టారు.

ఏమిటీ సమాజంతీరు? శ్రమ ఒకరిది; ఫలం ఒకరిది.

'అయితే వారు రూపాయలు పెట్టుబడి పెట్టలేదా?' నా హృదయంలోని ఏదో భావం నన్ను ప్రశ్నించింది.

అవును. రూపాయలు పెట్టారు. ఆ రూపాయ లెక్కడనుంచి వచ్చినాయ్. కూలీల శ్రమశక్తి వల్ల సంపాదించిందే గదూ! వారి ముందటి శ్రమశక్తే సాహుకార్లకు రూపాయలయి, అవే నేడు యితోధికంగా కూలీలనే తిరిగి పీడిస్తున్నాయ్. ఈలాగే కాలచక్రంలాగు ఒకవిషమచక్రం సాగిపోతోంది- కూలీలలో వర్గచైతన్యం వచ్చి తమ శ్రమకు తగిన ఫలం అనుభవించే వరకు. నా ఆలోచనలు సాగిపోతున్నాయి తరంగాలు తరంగాలుగా.

కూలీల సుత్తిపోట్ల వేగం హెచ్చింది. టక్-టక్-టక్-టక్-టక్.

నేను మెల్లగా కూలీల దాపుకు పోయినా. ఎవరూ, వాళ్ళను తగిలేంత దగ్గరలోకి పోయినా నావైపు చూడలా. ఒక కూలిమాత్రం చూసీ చూడనట్టు చూసి తిరిగి తల వంచుకుని రాళ్ళు కొట్టున్నాడు.

ఆ కూలివద్దకే వెళ్లాను. వీపుమీద చేయి వేసి

"నీకెంత కూలి యిస్తారు? అన్నా" అన్నాను.

"అన్నా!" నావంక చూచి ఒకక్షణం నివ్వెర పోయినాడు ఆ కూలి. తెల్లటి బట్టలు వేసుకుని టిప్‌టాప్‌గావుండే ఎవరూ అతన్ని ఎప్పుడూ 'అన్నా' అని సంబోధించటం ఎరగనివాడులావున్నాడు.

"నేనడిగేది నిన్నే మిత్రమా! ఏం పలుకవేం?"

సంకోచిస్తూ ఒకసారి నావంక చూచి తల వంచుకొని రాతిని కొట్తూ "ఒక రూపాయి." అన్నాడుఆ కూలి

'ఒకరూపాయ' తిరిగి వుచ్చరించా. ఎన్ని గంటలు పనిచేస్తావ్?"

"ఎన్నిగంటలో! ప్రొద్దున్నుండి ప్రొద్దుగూకే వరకు" మామూలుగానే చెప్పాడు

"హూ" అన్నా.

"మీయింట్లో ఎంతమంది వున్నారు?"

"ఎనిమిదమంది"

"ఇంకా ఎవరైనా సంపాదించే వారున్నారా?"



"లేరు. అమ్మా, నాయన ముసలివాళ్లు."

"నీ భార్యో!"

"సన్న బిడ్డతల్లి"

"బిడ్డ లెంతమంది?"

"నలుగురు"

"ఈ రూపాయితో సంసారం ఏలా గడుస్తుంది?"

"............"

నా ప్రశ్న అతని ముఖంలో ఏదో విషాద ఛాయల్ని రేపినట్లుంది. 'అవును రూపాయతో ఎల్లా గడుపుతున్నానో' అనే భావం అతని ముఖంలో కనుపించి నట్లు నాకు బాగా అర్థమయింది. మానవుల్లో చాలమంది కష్టాలు పడుతూనే వుంటారు. కాని ఆ కష్టాల్ని ఎవరయినా జ్ఞాపకంచేస్తే వణికిపోతారు. తామేమో ఆ కష్టాల్ని గూర్చి ఆలోచిస్తూవుంటారు కూడా. అదే వణుకు, భీతావహం ఆ కూలి ముఖంలో నాకు స్పష్టంగా కనుపించింది.

అలాగే అయిదారుమంది కూలీలను కలిసి మాట్లాడా. వారి పరిస్థితులు హృదయ విదారకంగా వున్నాయి. ఒక కూలి కొడుకు చచ్చేంత జబ్బులో చావుమంచంలో వున్నాడట మూడురోజుల్నుంచి. కనీసం డాక్టర్ చేత మందుకూడ యిప్పించలేక పోతున్నాడట. ఇంకొకడిభార్య తను తినకుండా బిడ్డలకు, భర్తకే పెట్టి, తను తిన్నానని అబద్ధాలాడి పూటలతరబడి వస్తుండి, జ్వరంతో మొన్ననే చనిపోయిందట. జ్వరమనే చెప్పాడు ఆ కూలి. కాని ఆలోచిస్తే అదేమి జ్వరమో అర్థమవుతుంది. ఆకలి జ్వరమది. అవును ఆకలిచావు. ఈలాగే వారి పరిస్థితులు వింటోంటే ఆ సుత్తి దెబ్బలు రాళ్ళమీద పడేవి నా హృదయానికి తగిలినట్లున్నాయ్. ఎదుగూ బొదుగూ లేని యీ జీవాల జీవితాలు యీలాగే సాగిపోవాల్సిందేనా? పరిష్కార మార్గంలేదా? అని ఆలోచించే నాకు కంట్రాక్టర్ల వికవికలు పకపకలు వినిపించాయ్. అటు తిరిగి వెళ్లుతున్నా.

"ఆకు వచ్చిందోయ్. అందుకే అంత పట్టుకొట్టింది" నవ్వుతున్నాడు బట్టతల కంట్రాక్టర్.

మిగిలిన ముగ్గురూ ఆ కంట్రాక్టర్ నవ్వులో శ్రుతికల్పారు.

నేను లోపలికి అడుగుపెట్టా. 'రూణ్డోం డి' న్నారు అంతా ఒక్కసారిగా. నేనూ లేని చిరునవ్వు పెదవులపైకి తెచ్చుకుంటూ కుర్చీలో కూలబడ్డాను.

"ఎప్పుడూ రానివారు ఏం యీలా బయలుదేరారే!" అడిగాడొక కంట్రాక్టర్.

"ఆ...ఏమీ లేదు. ఏదో చల్లగాలికి. వాహ్యాళివచ్చి యిలాగ వచ్చాయీ పని చూదామని" యదాలాపంగా అన్నాను.

"ఏంపనిలేండి. ఏదో కరువుకాలం. ప్రజలంతా తిండికి గుడ్డకు లేక అల్లాడుతోంటే, మేమే యీ కాంట్రాక్టు తీసుకుని పనిచేయిస్తున్నాం" అన్నాడు బట్టతల కంట్రాక్టర్.

వూ కొట్టాను.

"కూలీలకు విశ్వాసం లేదండి. సోమరిపోతులు! వూరికే చేసినట్లు నటన మాత్రం చేస్తుంటారు. పని తెమల్చరు." చెప్పుకు పోతున్నాడు.

"లేకపోతే యీ పాడు రోజుల్లో వాళ్ళ శ్రేయస్సుకోసం ఎనిమిదివేలకు కంట్రాక్టు తీసుకొని మేమూ వారితోపాటు ఎండలో చస్తూంటే విశ్వాసంకూడ లేకుండావుంటే ఎల్లాగండి?"

"ఎంతకూలి యిస్తారండీ?" ప్రశ్నించా.

"అందరు కంట్రాక్టర్లు ముప్పావలా యిస్తారు. మేము రూపాయ యిస్తున్నాం. ఈ కాంట్రాక్టులో మాకేం లాభంలేదండి. అసలు మేము నలుగురం యిక్కడ కాచుకొని ఉన్నందుకు కూలికూడ పడదు."

"అల్లాగా" అని ఆ నలుగురు మహాశయులవద్ద శలవు పుచ్చుకొని యింటికి బయలు దేరా. నా మెదడంతా ఆ చెరువుగట్టున కూలీల్ని గురించే ఆలోచిస్తోంది....

భోజనం ముగించుకొని ఆరు బయట వెన్నెల్లో పడుకున్నాను. లేతమరకతవర్ణపు ఆకాశం చూచేకొద్దీ ఆహ్లాదకరంగావుంది. ప్రజల మేలును కాంక్షించే ప్రభుత్వం వలె వెన్నెల ప్రజలకు హాయిని కొల్పుతోంది. చల్లని మందమారుతం హాయిగా వీస్తోంది. కాని చెరువుగట్టు కూలీలు నా హృదయంలోనుంచి కదలనందున నాకు ప్రకృతి మధురిమ ఏమాత్రం నచ్చలేదు. ఎప్పుడు సర్వజనులు ప్రకృతి చూచి ఆనందించేది? ఆలోచించేది? ప్రజల ఆర్థిక పరిస్థితి బాగుపడాలి; అందరూ సుఖంగా వుండాలి. అని ఆలోచన చేస్తూ కన్నుమూశాను. ★

నా గుంటూరు ప్రయాణం

శ్రీ గంపల వెంకటలక్ష్మీనరసింహారావు

మా శ్రీమతీ సమేతంగా ఒక్కసారి గుంటూరు రమ్మనమని, మరదలూ తోడల్లుడూ కూడా వుత్తరాల మీద వుత్తరాలు రాస్తూ, ప్రాణాలు తీస్తూన్నారు. ఇక యింట్లో మా దేవిగారు కూడా "పాపం! చెల్లెలూ మరదిగారూ అన్ని వుత్తరాలు రాస్తే, వెళ్ళకపోతే యేం బాగుంటుందండీ? డబ్బు ఖర్చు అవుతుందని, రాలేదు అనుకుంటారో యేం పాడో! ఒక్కసారి వెళ్ళొద్దాం పదండీ! ఏం! దూరమా భారమా? దగ్గిరిలో గుంటూరు పెట్టుకుని. ఆఫీసుకు ఒక్క వారంరోజులు శెలవు పెట్టండీ! నాక్కూడా మా చెల్లెల్ని చూడాలని వుంది. మా చెల్లెలి పెళ్ళయిం తర్వాత, యింత వరకు మన మెప్పుడు వెళ్ళలేదు గూడా!" అని మరోకవైపున పోరుపెట్టూంది. చివరకు యీ పోరుపడలేక, ఆఫీసుకు వారం రోజులు సెలవు పెట్టి ఒక రోజు ప్రయాణం కట్టాను మా దేవిగారితో సహా.

తెల్లవారుఝామున నాల్గుగంటల బండీ అయితే చాలా బాగుంటుంది, ఎండపడక ముందే గమ్యస్థానం చేరవచ్చు"ననే వుద్దేశ్యంతో చివరకా బండే నిశ్చయం చేసుకున్నాను. చెల్లెల్ని చూడాలనే సంతోషంవల్లనైతే నేం, వూరుప్రయాణం అనే వుత్సాహంవల్లనైతే నేం, మా శ్రీదేవిగారి కసలా రాత్రంతా నిద్దరే లేదు. సర్దిందే సర్దటం, కట్టిందే కట్టడం యిదే పని ఆమెకా తెల్లార్లూ. వుండేది వారంరోజులయితే, యే నెల్లాళ్ళకో సరిపడే గుడ్డలు రెండు పెట్టెలకు సర్దింది. "యిన్ని గుడ్డ లెందుకే? మోతబరువూ, కూలీలదండుగ" అంటే, "వుండనివ్వండీ.! గుంటూరులో ఎర్రమట్టి జాస్తంటారు. గుడ్డలు త్వరగా మాస్తయి" అని సమర్థించింది. పైగా, గుంటూరువాళ్ళు బందరు మిఠాయి అంటే యెంతో అంగలారుస్తారనీ, వెళ్ళకవెళ్ళక వెళ్తూన్నాం పదిరూపాయిల మిఠాయైనా తీసుక వెళ్ళకపోతే యేం బాగుంటుందనీ, పోరుబెట్టి ఆ సాయంకాలమే హల్వా, తొక్కుడు లడ్డూలా యింకేమేమో సరిగా పదిరూపాయిలవి తెప్పించింది. శ్రీవారితో పాటు ఆరాత్రి పదకొండు గంటలవరకు నేను కూడా కొంతవరకు సర్ది, యెంతకూ తెమలకపోతే, చివరకు విసుగొచ్చి పడుకొని నిద్రబోయాను.

తిరిగి ఒంటిగంటకే నన్ను లేపింది మా శ్రీమతి. "యిదేమిటే? యెప్పుడో నాల్గు గంటలకు బండీఅయితే యిప్పుడే యెందుకు లేపావ్? వూరు ప్రయాణమయితే నిద్ర కూడా పోఅక్కర్లేదాయేం?" అని పచ్చి నిద్రలేచిన బడలికమీద, ఒళ్లు విరుచుకుంటూ విసుక్కున్నాను.

"అదేంటండీ! ప్రయాణం ముందు కూడా అలా విసుక్కుంటూ రెందుకూ? ఒక్కరోజు నిద్ర తక్కువైతే యేంపోయిందిప్పుడూ? ఎటుగూడి ఒంటిగంటపైగా అయిందయ్యె. స్నానాలు జపాలుచేసి బయలుదేరేసరికి ఆవేళ కాదా యేం? త్వరగా కాలకృత్యాలు తీర్చుకొని స్నానం చేయండీ వేడినీళ్ళు పెట్టాను." అని గుక్క తిరక్కుండా అనేసింది.

ముఖం కడుక్కొని నీళ్ళగదిలో కెళ్లేసరికి, ఒక పెద్ద కాగునిండా వేడినీళ్లూ, పక్కనే సబ్బు, తెల్లటితువ్వాలు రెడీగా పెట్టున్నయ్. అప్పటికే మా శ్రీవారి స్నానం అయిపోయింది. ప్రయాణం సర్దాలో అర్ధరాత్రి అని కూడా అనుకోకుండా, వేడినీళ్ళు పెట్టి యిచ్చినందుకు మా శ్రీవారి నెంతో మెచ్చుకుంటూ, సరిగా నిద్రకూడా లేని బడలికవల్ల ఆ వేడినీళ్లతో హాయిగా స్నానంచేశాను. అట్లా స్నానం చేస్తూంటే నాకు హఠాత్తుగా గుర్తుకు వచ్చింది—వేసవికాలంలో గుంటూరులో సరిగా నీళ్లు దొరకవనీ, అక్కడివాళ్లు నీళ్ళకు చాలా యిబ్బంది పడ్తారనీ. అందువల్ల ఆ పెద్దకాగుడు వేడినీళ్లు పోసుకున్నదే చాలక, పక్కనే చన్నీళ్ళతో నిండావున్న ఒక పెద్దగంగాళంకూడా ఖాళీచేశాను. స్నానంచేసి గదిలోకి వచ్చేసరికి శ్రీవారి ముస్తాబు యింకా పూర్తి కాలేదు. పైగా, "ఎంతసేపండీ స్నానం? ఆడదాన్ని నేనే త్వరగా చేశానుగదా!" అంది జడవేసుకుంటూనే. ఆ మాట వినేసరికి నా కరికాలిమంట నెత్తికెక్కింది. కాని ఆ సమయంలో ఆమె ముఖం చూచేసరికి నా కోప మెటుపోయిందో, వెంటనే చల్లబడ్డాను. "అయితే ఆలస్యంలో నాకంటే నీవే మెరుగంటావ్! మరి యింత వరకు నీ తయ్యారీ పూర్తికాలేదుగా?" అని మాత్రం అన్నాను.

"నాదేముందండీ! మీరు వెళ్లి త్వరగా బండితీసుకురండీ! నా జడకూడా అయిపోయింది. నేను తయారుగానే వున్నాను." అంది యిక తన ఆలస్య మేమీ లేనట్టే. ఆ మాట వినేసరికి నాకు నవ్వువచ్చింది. వెంటనే, నేను డ్రస్సు చేసుకొని బండికని బయటకు వచ్చేసరికి, రాత్రి నేను చెప్పివున్న బండి సాహెబ్ తన గుర్రం బండి తీసుకొని అప్పుడే వస్తూన్నాడు. "బండికూడా వచ్చేసింది, త్వరగా కానియ్యి," అంటూ తిరిగి లోపలికి వెళ్లాను.

* * *

రైలు సరిగా గుంటూరు చేరేసరికి పదిగంట లయ్యింది. మేము వస్తూన్నట్లుగా ముందే కార్డు వ్రాసివున్నందువల్ల, మా తోడల్లుడు స్టేషనుకు వచ్చాడు. అందువల్ల వారి యిల్లు వెతుక్కునేఅవస్థ లేకుండానే, రెండు సైకిల్ రిక్షాలు మాట్లాడుకొని అరండేలుపేట మూడవలైనులో వున్న వాళ్ళ యిల్లు త్వరలోనే చేరుకున్నాం. నేను గుంటూరు రావడం అదే మొదటిసారి. ఎండ అప్పటికే చిటపటలాడుతోంది.

గుమ్మంలోకి రాగానే మరదలు రెండు చెంబులతో నీళ్లు తెచ్చియిచ్చింది కాళ్ళు కడుక్కొడానికని. ఆ నీళ్లుచూస్తే నా కడుపులో గిర్రున తిప్పింది. వట్టి బురద నీళ్లు. మరదలు గదా! పరాచికానికి బావగార్ని గదా అని బురదనీళ్ళిచ్చిందేమో! అని నా భార్య చెంబులో నీళ్లు చూశాను అవీ అంతే! వెంటనే మరదలు ముఖంవంకొకసారీ, ఆమె భర్తముఖంవంకొకసారీ చూచాను తెల్లబోయి.

"బావగారు మా గుంటూరు నీళ్ళుచూసి మొదతే బెదురుతుంటూన్నారే! పర్వా

లేదు కడుక్కోండి. యిక్కడ యీ నీళ్లు దొరకడమే యెంతో బంగారం." అంది మరదలు నవ్వుతూ. ఎట్లాగో ఆ నీళ్ళతో కాళ్లుమాత్రం కడుక్కున్నాను. నోట్లో గాని, ముఖంమీదగాని పోసుకోబుద్ధి పుట్టలా. లోపలికివచ్చి అక్కడున్న పడక కుర్చీలో కూలబడుతూ, "సుందరం! యీ నీళ్లు మీ ఒక్క యింట్లోనే యిలా వుంటయ్యా, లేక వూరంతా యింతేనా?" అని అడిగాను తోడల్లుణ్ని.

"వూరంతా యింతేనండి! అసలు యీ నీళ్లయినా దొరకటం చాలా కష్టంగా వుంది. యీ సంవత్సరం భావులన్నీ యెండిపోయి, వట్టి మట్టి బయటపడ్డది. ఎక్కడన్నా ఒక భావిలో, కొద్దో, గొప్పో నీళ్లు వుంటే, ఆ భావిదగ్గిర వందలకొద్దీ జనం. పగలు రాత్రిళ్లు తెరిపివుండదు. అదైనా సర్కారు భావులైతేనే! యిళ్లల్లో వాళ్ళు అసలే రానియ్యరు బయటివారిని.

"మరీ అంత కష్టంగా వుందా?" అన్నాను ఆశ్చర్యంతో.

"కష్టమని నెమ్మదిగా అంటారేం? యీ నీళ్ళ అవస్థ యింతింతగాదు. భావులు చూస్తే పాతాళాని కంటుకొనివుంటై. బొక్కెనవేస్తే సగానికి కూడా మునగదు. తడవకు చారెడునీళ్లు. యే పాతికసార్లో బొక్కెనవేస్తేగాని ఒక్క బిందె నిండదు. పగలు పనిపాటలూ, రాత్రిళ్లు నిద్రకూడా లేకుండా, అట్లానే అవస్థలుపడి, ఎక్కడో మైలుదూరంలో ఏదైనాభావిలో నీళ్లున్నాయని తెలుస్తే, అక్కడకు కూడా వెళ్లి తీసుకొచ్చుకుంటున్నారు. రాత్రిళ్ళు యే క్షణంలో చూచినా, తెల్లవార్లూ భావి గిలకలు గిరగిరా తిర్గుతూండాల్సిందే!"

"మరయితే యీ వూళ్ళో పంపులు లేవూ?"

"సరె! పంపులుంటే యీ అవస్థయెందుకండీ? అక్కడక్కడా పేటకు. నాలైదు పంపులున్నయ్ పేరుకు అవైనా యేదో చెరువునీళ్లు. రోజుకొక్క గంటమాత్రం ఆ పంపులు వదులుతారు. ఆ గంటలోనే వందలకొద్దీ బిందెలు పెట్టుకూర్చుంటారు. ఆడాళ్ళు ఒకరి నొకరు తోసుకోడం, పోట్లాడుకోడం తప్ప, చివరకు యింటికో బిందె కూడా రాదా పంపుదగ్గిర. ఆ పంపులైనా, కొన్నికొన్ని పేటల్లో అసలేలేవు."

"అరె! మరి, గవర్నమెంటు యేం శ్రద్ధ తీసుకోలా? మునిసిపాలిటీవారేం చేస్తున్నారు, నిద్రపోతున్నారా యేం?"

"గవర్నమెంటు శ్రద్ధతీసుకుంటే యింక లేందేముంది? ఏదో వాటర్ స్కీమన్నారు. అందుకుగాను పెద్ద పెద్ద గొట్టాలు తెప్పించి వూరునిండా పడేశారు. అక్కడేవో పెద్ద పెద్ద టాంకులు కడ్తూన్నారు. యిప్పటికి రెండేళ్లు కావస్తూంది. యింతవరకు సగం కూడా పూర్తికాలా! యింకో రెండు మూడేళ్ళకు పూర్తయినా పూర్తయినట్లే! అసలు వాళ్లకేం పట్టింది! యీ ప్రజల కష్టాలు చూచేదాకా? వాళ్లకి కష్టాలుంటేగా? కష్టమంటే యేమిటో వాళ్ళకు తెలుస్తేగా? పైగా యెలక్షన్లు కూడా అయిపోయాయి. యిక వాళ్ళకు ప్రజలతో అవుసరంకూడా తీరిపోయింది. ఎవరెట్టాచస్తే వాళ్ళదేం పోయింది. పోతే, మునిసిపాలిటీ వారంటారా? ఏవో రెండు మూడు వాటర్ లారీలు తెప్పించి, ఆవల్ల చెరువో, ఎర్రచెరువో లేక ఆకో నేటివో నీళ్లు నింపి, ప్రజలకళ్ళ నీళ్ళు తుడవడానికి పగలు రాత్రిళ్లు సప్లయి చేస్తూన్నామంటారు. యింత టవునుకు, యింతమంది జనాభాకు, రెండు మూడు లారీలు యేం సప్లయి చేస్తాయి? ఒక్కొక్క లారీ దగ్గిర యిక చెప్పటానికే వీల్లేదు జనం. ఆ నీళ్ళకోసం ఒకళ్ళనొకళ్లు తోసుకోటం, బిందెలకి బిందెలేసి పగల కొట్టుకోడం. అసలు ఆడ మగ భేదమే లేదు ఆలారీల దగ్గిర, మనబోటివాళ్ళం పోవటానికూడా భయమేస్తుంది. యింతెందుకండీ! యింకో పదిరోజులు పోతే, అసలీ వూరే ఖాళీ చెయ్యవలసివచ్చేట్టుంది. చెరువుల్లోకూడా యిప్పుడు నీ రెండిపోయే స్థితివచ్చింది. మహావుంటే యింకో పదిపది హేనురోజులుంటయ్యేమో?"

"పోనీ, అంతవరకైనా, మీరు డబ్బిచ్చి పోయించుకోండి, ఆపాతాళంనుండీ అంత అవస్థపడి నీళ్లులాగాలంటే, గుండెలు పగిలి పోతైగాని వేరేమైనా వుందా?"

"వచ్చే ఆర్జనలు తిండికే చాలక పోతూంటే, యింకా నీళ్లు గూడా యేం కొనుక్కొంటాం యీ రోజుల్లో! అయినా పోసేవాళ్లుకూడా దొరకరు. వాళ్ళడిమాండు మరీ యెక్కువగావుంది. భావిలోంచి నీరు చేదిపోస్తే, బిందె ఒకటికి రూపాయి యివ్వాలి. పోనీ పీపా వాళ్ళ చేత పోయించుకుంటామూ అంటే, పీపా ఒకటికీమూడూ, నాల్గు రూపాయిలు. అదైనా యెంతో బ్రతిమలాడితేనే పోయటం. వాళ్ళు పిలుస్తేకూడా సరిగా పలుకరు. పీపాకు పన్నెండు బిందెలు షుమారు వుంటై. కొనుక్కుంటే మనజీతాలు అసలు నీళ్ళకే చాలవు."

"తిండికీ గుడ్డకీ కరువనుకొన్నాంగాని, యిక నీటికరువు కూడా వస్తే యింకేముందీ. జనం నశింపుకిక యెక్కువరోజులు లేదన్న మాట. స్వరాజ్యం వచ్చిన తరవాత అంతా ముదనష్టమే. ఒక్క పనీ యింతవరకుసాను

కాలం కాలా! నాయకులిచ్చే వుపన్యాసాలు చూస్తే కోటలు దాట్తాయి. అందుకనే మన ఆంధ్రదేశంలో రాజకీయా లిలా తలకిందులైనాయి.

"అన్నదమ్ముల మాటల్లో భోజనమే మర్చినట్టున్నారే? భోజనానికి లేవండి ఒడ్డించాం!" అంటూ ఇంతలో మూతి తిప్పుకుంటూ వచ్చింది మరదలు. చెల్లెలిమాటల తీరుకు, ఆ వెనకనే మా శ్రీవారు కూడా నిలబడి నవ్వుతూన్నారు.

"యింతసేపూ, నీ గురించే చెప్పుకొనేది. పాపం! నీవు నీళ్ళు తోడలేక అవస్థ పడుతున్నావని, మీ ఆయనగారు చాలా విచారపడ్తున్నారు." అన్నాను కొంటెగా.

"అబ్బ! యెంత ప్రేమా? అయినా యేం చేయాలీ? పోయించే శక్తి లేకపోతే తెచ్చుకోక తప్పుతుందా? మీ అన్నదమ్ముల బడాయిచూస్తే, అబ్బ! చెప్పటానికే వీల్లేదు. పైకి వూరికే ప్రేమ పొంగి పొర్లిపోతుంది." అంది తిర్గి మూతి ముప్పై మూడు వంకర్లు తిప్పుతూ. ఆ మాటలకు అంతా నవ్వుకున్నాం. అందరూ ఒక్కసారే భోజనానికి లేచాం.

ఆ సాయంత్రం ఆ బురదనీళ్ళే యెట్లాగో అట్లా స్నానంచేసి పార్కుకు బయలుదేరా షికారుగా. ఇంట్లో మరదలు మాణిక్యాలు చేసిన గారెలు తిని, సేమ్యా పాయసం త్రాగి, టీ గూడా తాగి మరీ బయలుదేరా! పార్కులో కూర్చున్న కాస్సేపటికే గొంతెండిపోయేంత దాహం వేసింది. అక్కడేవున్న ఒక కాఫీ హోటల్లోకెళ్లా మంచినీళ్లు తాగుదామని. వూరికే మంచినీళ్ళు అడిగితే అసహ్యంగా బాగుండదని, "ఒక గ్లాసు మంచినీళ్లు ఒక టీ." అన్నా కుర్చీలో కూర్చుంటూ. వెంటనే ఆ సర్వరు నా ముఖంవంక యెగాదిగా ఒక్కమారు చూసి, లోపలకు వెళ్ళిపోయ్యాడు. తిరిగి ఒక గ్లాసు నీళ్ళతో, టీతో సహా వచ్చి, వాటిని నాముందు పెట్టాడు. వాడి తరహా అసలు నాకేమీ అర్థంగాలా! ఆ నీళ్లు బాగాలేకపోయినా, దాహంతోవున్న కక్కుర్తికొద్దీ వెంటనే రెండుగుక్కల్లో తాగేశాను. కాని యింకా దాహం తీరలా! యింకో గ్లాసు యిమ్మన్నాను. వెంటనే వాడు ముఖమంతా కళ్లు చేసుకొంటూ, "మన దే వూరండీ?" అన్నాడు. "ఏం?" అన్నాను. "ఏమీ లేదు. యీ వూళ్ళో నీళ్ళు అసలే దొరకటంలా! యింక నాల్గురోజుల్లో మా హోటల్ కూడా మూసేస్తాం నీళ్లులేక. కావాలంటే, టీలోకి యింకా పాలు పొయ్యమన్నా పోస్తానుగాని, నీళ్ళు మాత్రం లేవు." అన్నాడు. "మరి నాకు దాహం తీరలా, యెట్లా?" అన్నాను వాడేమంటాడో తెల్సుకుందామని. "దాహం తీరకపోతే, బటర్ మిల్కు త్రాగండి" అన్నాడు. నేను తెల్లబోయా ఆ మాట విని. "బటర్ మిల్కు వూరికే యిస్తావా?" అన్నా తిరిగి యెగతాళిగా. "గ్లాసు అణన్నర" అన్నాడు. యిక చేసేది లేక, మంచినీళ్ళబదులు బటర్ మిల్కే త్రాగేను. టీకి బేడ, బటర్ మిల్కు కొక అణన్నర, మూడణాలన్నర బిల్లు చెల్లించి బయటకు వచ్చా!

గుంటూరులో నాల్గురోజు లుండేసరికి, నాలుగేళ్లున్నట్లుగావుంది నాకు. ఒక్క నాకేగాదు మా శ్రీవారికీ అంతే! చెల్లెలు కష్టపడుతూంటే చూడలేక, అక్కగారు కూడా పొయ్యేది నీళ్ళకు. ఆ నాల్గురోజుల్లో ఆమె చేతులన్నీ బొబ్బలుపొక్కి, పచ్చిపుళ్ళయినై. వచ్చేటప్పుడు యెంత వుత్సాహపడివచ్చిందో, అంత పోరుపెట్టూం దిప్పుడు "యింటికి పోదాం"అని. నాకూ కూడా యిక ఒక్క క్షణం వుండ బుద్ధిపుట్టలా.

మాతోడల్లుడు వర్ణించి చెప్పిందానికంటే, యీ నాల్గురోజుల్లో నేను చూచింది యింకా ఘోరంగా వుంది. మేమసలు యీ నాల్గురోజుల్లో సరిగా స్నానంకూడా చేయలా. ఒకొక్కప్పుడు బలవంతంగా దాహం కూడా అపుకొనేవాడిని, ఆ నీళ్లు త్రాగలేక. మరీ పట్టలేకపోతే, నీళ్లువడపోయించుకొని, కొద్దికొద్దిగా మందుత్రాగినట్లు వూరికే గొంతు మాత్రం తడుపుకొనేవాడిని. "ఎన్ని జన్మలకైనా యీ గుంటూరుప్రయాణం వద్దురా బాబూ" అన్నంత విరక్తి పుట్టుకొచ్చింది. ఇంకా నాల్గురోజులు శలవు వున్నప్పటికీ, "ఇక శలవు లేదు, అయిపోయింది, వెళ్లాలి" అంటూ అబద్ధంచెప్పి, నాల్గవరోజు మధ్యాహ్నం రెండుగంటల బండీలో, వడగాడ్పులు వేస్తూన్నా లెఖ్ఖచేయకుండా వచ్చేశాను బందరు. అప్పటి నుండి గుంటూరు ప్రయాణం మాకో సింహస్వప్నమయింది. ★

పాక ప్రవీణ

(15-వ పేజీ తరువాయి)

అయింది. తల వంచుకు లోనికి వెళ్ళింది. వంటసాయానికి వచ్చిన అమ్మలక్కలు బుగ్గలు నొక్కుకొంటూ తమ తమ తప్పులు ఏకరువు పెట్టుకొంటున్నారు. "మీ అందరి ఆసరా చూతకదా నేను రమణమ్మకి శాస్తి చేయాలని ఇలాంటిపనికి పూనుకున్నాను." అనికళ్ళనీళ్ళు రాల్చిందికమలమ్మ.

మేజస్ట్రేట్ పెళ్ళాం ముఖం చిట్లించి "నాకీ వంటపని అంటే తలనొప్పి. ఏదో మీ మాట దాటకూడదని వచ్చా. పుట్టింట ఎరగను, మెట్టినింట ఎరగను పోగ," అన్నది చాలా మెల్లిగా.



మిగతా ఇదరు ముఖాలు వంచుకొన్నారు. అక్కడికొచ్చి ఆ మాటలు విన్న ఓ మిడిమేలపు పిల్లవాడు పరుగున హాలులోకి వెళ్లాడు. "రమణమ్మ రాలేదు వంటకి. మేష్ట్రీట్ అత్తయ్య, రాము మ్మత్తయ్య, జ్ఞానమ్మ పిన్ని, కమలమ్మ పిన్ని వండారు" అని అరిచి చాటించాడు. మేజస్ట్రేట్ ముఖం చింతగింజంత అయినా..."అదే అప్పుడే పసిగట్టేశాను. రమణమ్మవంట కాదని" అన్నాడు.

ఈ మాటలు రమణమ్మవింటే ఆమెకు ఇంకా గర్వమే హెచ్చవుతుందని గృహిణులు తలలు వేళ్లాడతీసుకొన్నారు.

ఇది జరిగి నాలుగురోజు లయిపోయింది. రమణమ్మ మాత్రం ఆ విషయం ఎవ్వరిన్నీ అడిగి తెల్సుకోలేదు. కానీ ఆమెకు అంతా తెల్సు. అందరిళ్ళకూ మామూలుప్రకారం వచ్చిపోతుంటుంది. ఆనాటినుండీ ఇతర గృహిణులు కూడా వంటపని అంటే శ్రద్ధ చూపిస్తూ వుండేవాళ్లు. వంటఅంటే భయపడే ఆడదీ, అసహ్యించుకొనే స్త్రీ, బద్ధకించే సోమరీ...ఎలా చెయ్యడం అని దిగులుపడే ఇల్లాలూ "వంటపని" శ్రద్ధగా చేస్తున్నారు. అందరూ రమణమ్మని నిగూఢంగా అడిగి కిటుకులు తెల్సుకోవాలని ప్లాను వేసుకొన్నారు.

వడుగుభోజనంనుంచి లేస్తూ మేజస్ట్రేట్ అన్నాడు "గోపాలంబాబూ: ఇదేం బాగాలేదు. మీరు త్వరలో గొప్పవిందు చేయాలి. ఆ విందు వెలుగులో ఈ మచ్చ మాసిపోవాలి. ఏదన్నా చూడు నీ పుట్టినరోజన్నా వస్తుందేమో!" గోపాలంబాబు ఆ తర్వాత కమలమ్మని నాలుగూ అడిగేసరికి అసలు విషయం బయటపడ్డది. "ఈ ఆడవాళ్లెప్పుడూ ఇంతే! ఎప్పుడూ కలహాలు. కలకంఠులు కారు కలహకంఠులు. రమణమ్మనినువే పిలవాలి. అందరూ ఏమన్నారో తెలుసా? మీతో డిన్నర్ కావాలట" అని చెప్పాడు.

కమలమ్మ సంకోచం లేకుండానే ఆనాడు రమణమ్మ రాగానే విషయం అంతా చెప్పివేసింది. రమణమ్మ నవ్వుతూ "అదేం భాగ్యం లెండి. ఆడవాళ్ళకు వంట చాతకాకపోతుందీ. వంట అంటే అదో నీచమైన ఉద్యోగమని, వంటలక్క, అనిపించుకొంటే తమ పరువుకి నష్టమని అనుకొంటారు. ఆడది జీవితంలో సాధించవలసింది, సాధించేది "వంటే" అని నా అభిప్రాయం. కోటివిద్యలు కూటికొరకే కదా! వంటపని లేకపోతే ఆ తర్వాత ఒకళ్ళ కొకరితో పనేముంది? నలభీమపాకాలని మీరు విని వుండలేదా? పూర్వం వాళ్లు కూడా "వంటే" చేసి పేరు పొందారు. శ్రద్ధపెడితే బ్రహ్మవిద్య కూసువిద్యయిపోతుంది" అని చిన్న లెక్చర్ కొట్టింది. ఆనాటి విందులో అధ్యక్షత వహించిన ఓ మంత్రి "పాకప్రవీణ" అని బిరుదుఇచ్చి రమణమ్మని సత్కరించారు. డిన్నర్ అయింతర్వాత! ★

చౌర్యంలో క్రొత్తపంథా

(14-వ పేజీ తరువాయి)

కొంచెం ఇచ్చారంటే మీటింగు ఐపోయిందే...

కరుణా : దానికేమండీ తీసుకెళ్లండి.

(గడియారం తీసుకొని రంగనాయకులు నిష్క్రమిస్తాడు.)

3

(ఆ దినం రాత్రి ఏడుగంటలకు-కరుణాకరం చెమటకార్చుకుంటూ వచ్చి మంచం పైన పడిపోతాడు.)

శంకర్ : మీటింగు అప్పుడే ఐపోయిందా నాన్నా?

అన్నపూర్ణ : బాగా మాట్లాడారా నాన్నా? *Funk* గా లేదుగదా.

శంకర్ : పత్రికా ప్రతినిధు లందరూ వచ్చారా?

మీనాక్షి : కొంచెం నిదానించండి. బాగా టిఫిన్ చేసి వచ్చినట్లుంది. భుక్తాయాసం తీరనీ.

కరుణా : టిఫి నెక్కడిదే? వాడెవడో పచ్చిదొంగ. గడియారానికని ప్లాను వేసి నాకు నున్నగా తిరుక్షౌరం చేసేశాడు.

మీనాక్షి : అయ్యవొయ్య! ఇంతకూ ఏం జరిగిందండీ?

కరుణా : జట్కా వాడు ఇక్కడికి రెండుమైళ్ళ దూరంలో ఒక సందులో నన్ను దిగమన్నాడు. అక్కడ బ్రహ్మాండమైన పందిరేమో వుంది. కానీ అక్కడేదో సంతర్పణ జరుగుతుందట. తీరా విచారించబోయేసరికి 'యువజన సమితి' అనే సంస్థే ఈ వూర్లో లేదట! ఎవడో పట్టపగలే నా కండ్లల్లో కారం కొట్టేశాడు.

మీనాక్షి : మిమ్మల్ని చూస్తుంటే ఏడుపూ వస్తున్నది, నవ్వూ వస్తున్నదండీ! పోనీ ఆ సంతర్పణలో భోంచేస్తైనా రాకపోయారా?

కరుణా : ఏమి భోజనమో! ఏ మిత్రులో! ఏమి ప్రపంచమో! అంతామిథ్య.

మీనాక్షి : గడియారం దొంగలింపబడడం కూడా మిథ్యేనా? వెర్రివేదాంతాన్ని కట్టిపెట్టి లేవండి భోజనానికి. ★



సమయస్ఫూర్తి

శ్రీ మహీధర నళినీ మోహనరావు

పుట్టెడు సంసారంతో పాపం!
పొట్టే గడవక పోలయకాపు
దూరపుటూరికి పెళ్లాం బిడ్డల
తోడ ప్రయాణం సాగించాడు.

వల్లకాటిలో పడిపోతూంటే
కళ్ళను బడ్డది కపాల మొక్కటి
దానిని చూచుటతోనే తోచెను
వానికి చక్కని ఉపాయమేదో

ఆపై ఊళ్లో మజిలీ చేసి
అంతకుముందే దాచిన మనుజుని
పుర్రెను బయటకు తీసి రావణుని
పుర్రె యిదేయని పుకారు వేసెను.


ఆఊళ్లోగల పిల్లామేకా
అందరు గుంపులు గుంపులు గా చని
పోలయ చూపిన పుర్రె పదే పదే
చాలా వింతగ చూడగసాగిరి

పుర్రెను చూచినవారల దగ్గర
పోలయ డబ్బులు వసూలుచేసెను.
పాచిక బాగా పారినదనుకొని
పోలయ యెంతో సంతోషించెను.

అంతట్లోకి ఎవరో వృద్ధుడు
అనుమానంతో అడిగేశాడు.
"రావణాసురుని తలకాయైతే
ఏమయ్యా! ఇది ఇంతే ఉందేం?"

తోడనె పోలయ వృద్ధుని ప్రశ్నకు
తొణుకూ బెణుకూ చెందక ఇట్లా
చెప్పెను "ఇది ఆ రావణాసురుని
చిన్నప్పటి తలకాయ సుమండీ!"

★



పంచతంత్రం
మిత్రభేదం
కర్త... శిశుపాత్ముల నరసింహమూర్తి
దమనకుడు:- "ఎవరునువ్వు? ఎందుకట్లు గాడిదవలె ధ్వని చేస్తావ్? రాజుగారు కొలువు తీర్చి ఉన్నారని- ఎరుగవాకో?"
సంజీవకుడు:- రాజెవ్వరు స్వామీ! కొలువెక్కడ తీర్చినారు!!
"అడవిని గల ప్రాణులెల్ల ఎవ్వని కనుసన్నల మెల గెదరో ఆ పింగళకుని ఎరుగవాకో పిచ్చివాడ?"
"తప్పు క్షమించండి స్వామీ! తెలియక నే చేసితినని రాజుగారి తోడ చెప్పి కోపము తగ్గించవలయు"
"సరిసరి నే చెప్పివత్తు; ఇచ్చటనే ఉండు నీవు."
పింగళకుడు: "ఏమైనది, దమనకుడా! ఆమృగమును చూచితివా?"
"చూచితి మహారాజా! అది శివవాహనమైన నంది. శివాజ్ఞచే ఈ అడవిలో కొంతకాలముండునట!"
"అమ్మయ్యో! అట్లాగా ఏమంటివి ఆయనతో?"
"దేవర భయపడనేలా? పార్వతి వాహనమే మా పింగళకుడు అని చెప్పితి."
"సెబాస్ సెబాస్! దమనకుడా ఉంటె నీలాంటివాడు ఉండాలోయ్; ఇక అతని తీసుకురా నాఎదుటకు."
సంజీవక దమనకులు పింగళకుని కడకురాగ
"ఇద్దర మిక మిత్రులమై మెలగెదమిదె నా అభయం."
కొంతకాల మిట్లు గడువ సంజీవక పింగళకులు గాఢ మిత్రులైనారు
పింగళకుడు తమ మాటే మరచెనంచు మిగిలిన మృగ లోకమంత కలతపడగ ఒకనాడు కరటకుడూ దమనకుడూ సమావేశమైనారు
కరటకుడు:- "దమనకుడా! ఊరుకొనక నీవేకద ఈ అనర్థ కమ్ము తెచ్చిపెట్టినావు!"
"దైవ విధికి ఎంతవారు లొంగిపోక తప్పదు కద. సిద్ధుడొకడు పూర్వము ఆషాఢభూతి మోసములో పడుట దైవ విధియే కద!"
కరటకుడు:- "ఎవరా ఆషాఢభూతి? చెప్పు చెప్పు మా గాథను."
5

నేస్తం కలిపిన కథ

"ఆరణి"

టేబుల్ ముందు కూర్చొని, అప్పుడే కలంతీసి కాగితం మీద పెట్టాను. "ఒరేయ్ మధూ! ఓరి మధూ! ఏం చేస్తున్నవురా? చిట్టి ఏడుస్తుంటే వినిపించటం లేదురా?" అంటూ వంటయింట్లో నుంచి అమ్మ బిగ్గరగా అరిచింది. నాకు బలే విసుగు పుట్టుకొచ్చింది. చచ్చీ చెడి కథ అంటూ ఒకటి అల్లి, ఎప్పుడెప్పుడు యిది కాగితం మీదికి ఎక్కించి పత్రికవాళ్లకు పంపుదామా అని నే తొందర పడుతూవుంటే చిటికీ మాటికీ యింట్లో వాళ్లు యిలా పనులు చెప్పి నా వుత్సాహాన్నంతనీ చంపేస్తున్నారు. ఛీ...ఛీ...అనుకొంటూ కలం విసురుగా టేబుల్ మీద పడవేసి చరచరా పోయి వుయ్యాలలో కాళ్లూ చేతులు గింజుకొంటూ యింటికప్పులు ఎగిరిపోయేటంత పెద్దగా ఏడుస్తున్న చిట్టిని చంకకు ఎత్తుకొన్నాను.

చంకకు ఎత్తుకొన్నాక అయినా యీ చిట్టి వూరుకొంటుందేమో అనుకొంటే ఎంతకీ, ఆపదే ఆ రాగం! నాకు బలే కోపం వచ్చింది. వంటయింటి గుమ్మంలో నుంచీ కనుక అమ్మ కనుపించక పోతే, చిట్టి గొంతు నలిపి అవతల పారేసే వాణ్ణే!

నేనూ కథలు వ్రాయాలనీ, అవి పత్రికలలో అచ్చుఅయి రావాలనీ, ఎన్నో రోజులుగా కలలు కంటున్నాను. నేనిలా కథలు వ్రాయబోతున్నాననీ, అవన్నీ అచ్చుఅయి వస్తున్నాయనీ, నాక్లాసు కుర్రాళ్లందరితోనూ ముందుగానే చెప్పిపెట్టాను కూడా. ప్రతిరోజూ సాయంకాలం స్కూలు వదిలిపెట్టాక కాగితం కలం తీసుకొని కథనుగూర్చి ఆలోచిస్తూ కూర్చునే వాణ్ణి. మా అమ్మ వూరుకొంటుందా? నేను కలం కాగితం అలా తీసుకొన్నానో లేదో, బజారుకుపోయి రమ్మనో, చిట్టిని ఎత్తుకోమనో, ఏదో ఒక పని పురమాయిస్తుండేది. దాంతో కథను గూర్చిన నాఆలోచనలన్నీ ముక్కచెక్కలయ్యేవి.

నేనింకా కథవ్రాసి పంపుదామనుకొంటూ వుండగానే మా క్లాసు కుర్రాడొకడు వ్రాసిన కథ ఆంధ్ర వారపత్రికలో ప్రకటించబడింది. అది చూచేసరికి నేనూ కథ వ్రాయాలనే పట్టుదల మరీ ఎక్కువైంది.

నాపేరు పత్రికలో పడాలనే తొందర నాకు ఎక్కువ అవుతున్నకొద్దీ, నాకు వ్రాయదగిన కథ దొరకటం దుర్లభ మౌతున్నది. కథ అల్లటానికి నేనే ప్రయత్నించినందువల్ల యిక లాభంలేదని, మా అక్కయ్యను ఒక చక్కని కథ



చెప్పమని బ్రతిమాలాను. ఆవిడ చాలా చక్కని కథ చెప్పుతా నన్నది. కాని తాను చెప్పిన పనులన్నీ చేసిపెట్టాలని ఒక షరతు పెట్టింది. ఏం చేస్తాం ? ఒప్పుకొన్నాను. ఆవిడ చెప్పిన ప్రతి పనీ చెయ్యటానికి ఒప్పుకొన్నాను. ప్రతి పనీ చేసేవాణ్ణి. అయినా ఆవిడ ప్రొద్దున అడిగితే సాయంకాలమనీ, సాయంకాల మడిగితే ప్రొద్దున అనీ, కథ చెప్పకుండానే రోజులు, వారాలు గడుపుకు వచ్చింది. చివరకు ఆవిడకు ఆ పనులన్నీ చేసిపెట్టటానికి విసుగెత్తి 'నువ్వు కథ చెప్తావా లేదా?' అని కరాఖండిగా ఒకరోజు నిలదీసి అడిగాను. ఆవిడ దేవుణ్ణి ప్రార్థించమని ముక్తసరిగా సమాధానం యిచ్చి అక్కడనుంచీ లేచి చక్కాపోయింది.

కథకోసం ఎవళ్లను నమ్ముకొన్నా యింతే ననిపించి, ఎప్పటికైనా నాబుర్ర నుపయోగించే కథ అల్లాలని పట్టుదల పట్టాను. కాస్తంత నిశ్శబ్దంగా కూర్చొని కథ విషయం ఆలోచిద్దామా అంటే యింట్లో ఒకటే కాకిగోల. అందుకని ఒకరోజు సాయంకాలం కలం కాగితం పుచ్చుకు వీధిలోకి బయలుదేరాను. రోడ్డువెంట నడుస్తూ కథ విషయం ఆలోచించాను. ఊహుఁ! ఏకథా కుదరలేదు. ఇల్లాకూడా కాదనీ, మా నేస్తాలందరూ అలవాటుగా వెళ్తూవుండే మామిడితోటలోకి దారి తీశాను.

పచ్చని చెట్లు, చల్లనిగాలి, కమ్మని కోకిలకూతలు, యిలాటి వాతావరణం వుంటేనైనా చక్కని కథ తట్టుతుందేమో నని బలే ఆశపడ్డాను. మామిడిచెట్టుకింద కూర్చుని ఆలోచనలలో పడ్డాను. కథ ఎంతకీ కుదరటంలేదు. ఎంతసేపు ఆలోచించినా "అనగా అనగా ఒకరాజు ; ఆరాజుకు ఏడుగురు కొడుకులు..."అంటూనే కథ మొదలు అవుతున్నది. ఎంత ఆలోచించినా వేరే రకమైన కథ ఏదీ దొరకటంలేదు. అక్కయ్య దేవుణ్ణి ప్రార్థించమనటం జ్ఞాపకానికి వచ్చింది. ఏ పుట్టలో ఏపాము వుంటుందో, ఎందుకైనా మంచిదని కళ్లు మూసుకొని "ఓ భగవంతుడా? ఈసారైనా నాకథ సాఫీగా సాగిపోయేట్లు చెయ్యి నాయనా !" అంటూ గట్టిగా ప్రార్థించాను.

ఇంతలో ఎవరో గిరాటు వేసినట్లుగా, మట్టిబెడ్డకు చుట్టివున్న చీటిముక్క ఒకటి వచ్చి, నా వళ్లో పడ్డది. ఒళ్లు ఝల్లుమన్నది. కళ్లు తెరచి చూచాను. దడదడ కొట్టుకొంటున్న గుండెలతో చీటి విప్పాను. భగవంతుడే నాప్రార్థనలు ఆలకించి తాను చెప్పదలచుకొన్న కథను యిలా చిన్న చీటిమీద రాసి వైకుంఠంనుంచీ గిరాటు వేశాడేమోనని నాకు అనిపించింది. సంతోషమూ, భయమూ కూడా పుట్టుకొచ్చాయి నా మనస్సులో. తీరా, కాగితం విప్పి చదివితే—

"నీ ఏకాగ్రతకు మెచ్చితిని. నీవు కథ వ్రాసి పంపదలచినచో, నీ విరోధియైన రమణతో మాట్లాడుము. అతడే నీకు ఏకథ వ్రాయవలసినదీ చెప్పగలడు. ఆతనితో మాట్లాడుటకు నీవు సంకోచించినచో యీ జన్మలో నీవు కథ వ్రాయనూ లేవు; నీపేరు అచ్చులో పడనూ పడదు." అని మాత్రం అందులో వున్నది.

ఏం చెయ్యటానికీ తోచలేదు. నిజానికి రమణా, నేనూ ఒకప్పుడు మంచి స్నేహితులం. మా యిద్దరికీ శరీరాలు మాత్రం రెండై, మనస్సు ఒక్కటే అయినట్లు మెలిగేవాళ్లం. కానీ మా క్లాసు కుర్రాళ్లు కొందరు చేరి యిక్కడి మాట అక్కడ, అక్కడి మాట యిక్కడ చెప్పి, మొత్తానికి మా యిద్దరినీ వేరు చేశారు. అప్పటికి కానీ వాళ్ల కళ్లు చల్లబడలేదు. మేమిద్దరం ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడుకొని యిప్పటికి ఆరు నెలలు దాటింది. నాకైతే వాడితో మాట్లాడేద్దామా అని ఒకటి రెండుసార్లు అనిపించక పోలేదు కానీ నేనే ముందుగా ఎందుకు పలుకరించాలనే పట్టుదల కొద్దీ మాట్లాడకుండా వూరుకొన్నాను.

కథకోసం కలవరించి పోతుంటే- ఎవరు పంపిన సలహో అయితేనేం- యీ చీటీ ఒకమార్గం చూపిస్తోంది. ఆచీటీలో వున్న ప్రకారం వాణ్ణి అడిగితే కథ దొరకవచ్చు. వాడికివున్న తెలివితేటలకు, ఓ చిన్న కథ నాకోసం అల్లివేయటం వాడికేమంత కష్టమైన విషయం కాదు. కానీ వాడితో నేను ముందుగా మాట్లాడకూడదనే నా పట్టుదల మాట ఏమిటి ? ఈ పట్టుదల కోసం చూసుకొంటే యిప్పుడు కాదు కదా, యీ జన్మలో మరెప్పటికీ కూడా నేను కథ వ్రాయలేనని యీచీటీ వ్రాసి పంపినవారు తేల్చివేశారే.(కొంప దీసి

యీ చీటి వ్రాసింది నిజంగా భగవంతుడు అయితే-ఆయనమాటకు మరి తిరుగు వుండదే!) పోనీ కథా వద్దు, గిథా వద్దు అని సరిపెట్టుకొందామా అంటే- మనస్సు ఒప్పటం లేదే! పైగా ముందెప్పుడో కథ వ్రాస్తాననీ, అది అచ్చుఅయి పత్రికలో వస్తుంది చూసుకోమనీ క్లాసు కుర్రాళ్లందరితోనూ పందేలు కట్టానే!... పెద్ద చిక్కు వచ్చిపడింది. ఏమిటి చెయ్యటం?

ఆలోచిస్తూ యింటికి చేరాను. రాత్రిఅంతా ఆలోచించి రమణతో మాట్లాడేసి, వాడి స్నేహాన్ని మళ్లా సంపాదించుకోవటమే కాకుండా, కథవ్రాసి పంపి నాపేరు నిలబెట్టుకోవాలనే నిర్ణయానికి వచ్చాను.

మర్నాడు సాయంకాలం స్కూలు వదిలిపెట్టాక రమణావాళ్ళయింటికి, వెళ్లాను. వాడు యింట్లో లేడని వాళ్ళ అమ్మ చెప్పింది. వాడు యింట్లో అన్నా వుండి వుంటే నలుగురికంటా పడకుండా సావాసం కలిపివెయ్య వచ్చు కదా అని ఆశపడ్డ నాకు నిరాశ ఎక్కువైంది. ప్లేగ్రౌండుకు పోయివుంటాడని తెలుసు. ఆ వైపుకే బయలుదేరాను. రమణ ఎదురయ్యాడు. వాడు రావటం చూసి కూడా చూడనట్టే మూతి బిగించి ముందుకు పోబోయాను. తుళ్ళీ జ్ఞాపకం వచ్చింది; వాడితో స్నేహం కలపకపోతే మనకథ మాట వుత్తదే అయిపోతుందని. అప్పటికీ వాడు నన్ను దాటి, ఐదారు గజాలు వెళ్లిపోయాడు. చప్పున పలుకరిద్దామని పించింది. కానీ ఏమని పలుకరించాలి? ఏమీ తోచక "ఒరే! రమణా !" అని మాత్రం పేరు పెట్టి పిలిచాను. రమణ నావంక ఒకసారి అలాచూసి మహాబెట్టుగా పోబోయాడు. నాకు తొందర పుట్టుకొచ్చింది. దబదబా వాడి ముందుకు పోయి నిల్చుని "ఒరేయ్ ; రమణా ! నా తప్పులు క్షమించరా" అని అప్రయత్నంగా అనేశాను. అంత వరకు మహా బింకంగా మూతి ముడుచుకువున్న వాడి పెదిమల మధ్యను చిరునవ్వు ఒకటి తొంగిచూచింది. నాకు బ్రహ్మానంద మైంది. చప్పున చెయ్యిచాచి వాడిచేతిని పట్టుకొన్నాను.

ఇద్దరం చెట్టా పట్టాలు వేసుకొని ఆ సాయంకాలం బాగా చీకటిపడి పోయేదాకా తెగ తిరిగాం; ఎన్నో కబుర్లు చెప్పుకొన్నాం.

నాకు కథ చెప్పమని అప్పుడే అడగటం ఎందుకులే అని రెండు మూడురోజులు పస్తాయించి నాలుగో రోజున వాణ్ణి ఆ మామిడి తోటలోకి తీసుకెళ్లి నేను కథ వ్రాయాలనుకోవటం, ఎంత ఆలోచించినా వ్రాసేందుకు కథ దొరకక పోవటం, చివరకు యీ చెట్టు కింద కూర్చొని కథ విషయం ఆలోచిస్తుండగా ఆచీటి వచ్చి నాబళ్లో పటడమూ, యిదంతా వివరించి చెప్పాను. నేనీ కథఅంతా చెప్తుంటే రమణ ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ వూ కొట్టాడు.

నాకథ చెప్పటం ముగిశాక వాడిచేతులు పుచ్చుకొని "ఒరే, రమణా! నాకోసం ఓకథ అల్లి

పెట్టవుర్రా" అంటూ బ్రతిమాలాను.

వాడు మళ్లీనవ్వి, "ఏం కథ అల్లనురా!" అన్నాడు.

"ఏదైనా సరే. పత్రికల్లో పడే మాదిరి కథ అల్లి పెట్టాలి మరి." అన్నాను.

రమణ ఒకటి రెండు నిమిషాల సేపు ఆలోచించాడు; ఆకాశంలోకి చూస్తూ, ఉన్నట్లుండి ఒక్కసారిగా నావైపుకు తిరిగి "ఒకేయ్! మధూ! మన నేస్తాలు కలిపిన కథనే ఒక కథగా ఎందుకు వ్రాయకూడదూ?" అని అడిగాడు.

రమణ నిజంగా తెలివైనవాడే నని నాకు అప్పుడు అనిపించింది.

"ఎందుకు రాయకూడదూ! తప్పకుండా రాస్తాను." అన్నాను. అంతే యింక యిద్దరం పెద్ద బరువులు దించేసుకొన్నంతగా తేలికపడ్డ మనసుల్తో యింటి ముఖం పట్టాము.


ఇంటికి చేరీ చేరటంతోటే నాగదిలోకి వెళ్లి లాంతరు వెలిగించి, ఎక్సర్‌సైజు పుస్తకంలోంచి పది కాగితాలు బర్రున చింపి గబగబా మొదటినుంచీ జరిగిందంతా వ్రాసేశాను. ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడుపోయి యీ కథను రమణకు వినిపిద్దామా అనుకొంటూ ఆరాత్రి అతి కష్టంమీద నిద్రపోయాను.

ప్రొద్దునే లేచి, కాఫీ తాగి రమణ యింటికి పరిగెత్తాను.

"ఏంరోయ్! కథ వ్రాసేసినట్లున్నావే? పెద్ద కాగితాల కట్ట పట్టుకొచ్చావ్" అంటూ ఎదురయ్యాడు రమణ.

"అవున్రా! వ్రాశాను. వింటావా?" అని అక్కడే వాళ్ల అరుగుమీద కూర్చొని చదివి వినిపించాను. వాడు ఆకథ అంతా విని అక్కడక్కడా కొన్ని సవరణలు చేశాడు.

అదంతా అయ్యాక అడిగాను- "అది కాదుగాని, ఓరోయ్, ఆరోజు



విజ్ఞాన వీధులు

"డాక్టర్"





15. కొండ గుహలు ఎలాగు ఏర్పడతాయి?

కొండల్లో గుహ లుంటాయనీ పెద్ద పెద్ద అరణ్యాల్లోని కొండ గుహల్లో పులులూ చిరుతపులులూ ఉంటాయనీ మన కందరికీ తెలుసు. ఆఫ్రికా దేశపు అరణ్యాల్లో సింహాలు కొండగుహల్లోనే నివసిస్తాయి. ఈ గుహలు ఎవ్వరూ తవ్వి ఉండరు కదా, మరి ఎలాగు ఏర్పడతాయో?

రైల్లో ప్రయాణము చేస్తూ వుంటే పెద్ద పెద్ద నల్ల శేనపు రాళ్లు ఎవరో పేర్చినట్టు ఒకదానిమీద ఒకటి చక్కగా అమిరి కనపడతాయే! ఇవి ఎవరు పేర్చారూ?

పెద్ద వాన కురిసి వెలిసిన తర్వాత కొండలమీద సెలయేళ్ల జాడలు తవ్విన కాలవల్లాగు కనపడతాయే వీటిని ఎవ్వరు తవ్వేరూ?

ఈ ఆఖరి ప్రశ్నకి జవాబు అందరూ చెప్తారు, "ఎవ్వరూ తవ్వలేదు. వాననీరు పల్లానికి పారినప్పుడు మెత్తని మట్టి నీటి కాలవలలో కిందకి కొట్టుకుపోవడమువల్ల సెలయేళ్ల జాడలు ఏర్పడతాయి" అని. నీరు ఎక్కువగా పారిన జాడలు లోతుగావుంటాయి. నదుల శయ్యలు ఇలాగు ఏర్పడినవే.

ఒకదానిమీద ఇంకొకటి అమిర్చినట్లుండే రాళ్లు చాలా కాలము కిందట మట్టితో కప్పబడిన చిన్న చిన్న గుట్టలుగానే వుండేవి. వాన కురిసినప్పుడల్లా ఆ గుట్టల మట్టి కడుక్కుపోయి పొరలు పొరలుగా తగ్గిపోతుంది. తరవాత అడుగున వుండే రాళ్లు మాత్రమే నిలిచి చిత్ర చిత్రమైన పేర్పులతో మనకి కనపడుతున్నాయి. ఈ రాళ్లు కూడా అంతటా ఒకే రకముగా వుండకపోడము చేత వాననీటి దెబ్బకి, ద్రావణ (కరిగించగల) శక్తికి లొంగిపోయిన చోట గంట్లూ, చాళ్లూ పడి చిత్రవిచిత్రమైన మృగాల రూపాలుగా తయారౌతాయి.

కొండ గుహలు కూడా వాన నీటికి మట్టి కొట్టుకుపోవడమువల్ల ఏర్పడిన ఖాళీలే. అయితే ఈనీరు కొండమీదనించి పారే నీరు కాదు. వాన కురిసినప్పుడు నీరు ఇంకి, శైలగర్భములో జారి జారి, అలా జారుతూన్నప్పుడు మట్టిని కూడా కోరి కోరి ఖాళీ చెయ్యడమువల్ల కొండల్లో గుహలు ఏర్పడతాయి. ★

నావొళ్లో ఆచీటి ఎవరు పడవేశారంటావ్?" అని — నన్ను పట్టుకు వేధిస్తున్న యీ అనుమానాన్ని వీడు ఏమైనా తీర్చగలడేమో అన్న ఆశతో.

"ఇంకెవరు?" అన్నాడు రమణ నవ్వుతూ.

"నువ్వేనా! అరి దొంగా! నేకథ వ్రాయాలనుకొంటున్నానీ, వ్రాయలేక పోతున్నాననీ నీ కెలా తెలుసు?" అని అడిగాను క్రాసు ఎగ్జామిన్ చేద్దామని.


"ఓరి వాజమ్మా! నువ్వు 'కథలు వ్రాస్తున్నా, కథలు వ్రాస్తున్నా' అంటూ ప్రతివాడి దగ్గరా గొప్పలు చెప్పుకోవటం నే నెరగననుకొన్నావా? ఏకథా వ్రాయలేక నువ్వు పడుతున్న అవస్థలు నేను చూడలేదనుకొన్నావా?" అని ఎదురు ప్రశ్న వేశాడు రమణ.

"నేను అవస్థలు పడుతుంటే—"

"నాకు జాలివేసిందీ."

"అందుకని?"

"అందుకని - ఆ పన్నాగం పన్నాను. నీ అవస్థ తప్పించానా? లేదా?"— రమణ గర్వంగా చూశాడు. ★




గడియారం చెప్పిన కథ

(గత సంచిక తరువాయి)

"ఏమోయ్! సుందరం; కొన్ని వందల ఏండ్లపాటు గంటలు కొట్టిన జాక్వెమర్ దంపతులను గురించిన ముచ్చట్లు చెప్తానన్నాను కదూ!" గడియారం సుందరాన్ని హెచ్చరించింది.

సుందరం అవునన్నట్లు బుర్ర వూపాడు. గడియారం సాద అందుకొన్నది.

"ఫ్రెంచి దేశంలో డిజన్ అనే పెద్ద పట్టణం ఒకటి వున్నది. ఆ వూరికి ఎవరైనా క్రొత్త మనుష్యులు వస్తే, వూళ్లో వుండేవాళ్లు పనిగట్టుకు యీ క్రొత్త మనుష్యులను ఒకచోటికి తీసుకుపోయి యీ జాక్వెమర్ దంపతులను చూపిస్తారు. జాక్వెమర్‌కు దాదాపు 40 ఏళ్ల వయస్సు వుంటుంది. మంచి విశాలమైన వక్షస్థలం. మనిషి కొంచెం కుదుమట్టంగా వుంటాడు. నోట్లో పైపు ఎప్పుడూ పళ్ల సందున బిగించి పట్టుకొంటాడు. ఇక ఆయన భార్య —ఆవిడను ఆ దేశంలో వుండే పల్లె పడుచుల్లో ఎవరితోనైనా పోల్చవచ్చు. ఈయిద్దరు వ్యక్తుల ఆకారాదుల్లో ఏమంత చెప్పుకోదగిన విశేషం లేకపోయినా, వీరిపేరు ప్రఖ్యాతులు దిగంతాలవరకు వ్యాపించాయి. ఒకానొక దొడ్డకవి యీ దంపతుల పెండ్లిని వర్ణిస్తూ పద్యరత్నాలు కూడా రచించాడు. డిజన్ నగరవాసులందరికీ యీ దంపతుల పట్ల అపారమైన గౌరవభావం ఎల్లప్పుడూ చెక్కు చెదరకుండా వుంటుంది. ఆ పట్టణవాసుల్లో ఎవరు ఎప్పుడు ఆ దంపతులకేసి చూసినా వూర్ధ్వ దృష్టితోనే చూస్తుంటారు."



"వూర్ధ్వదృష్టితో చూడటమంటే?" సుందరం అడిగాడు.

"అంటే — ఆకాశం కేసి చూసి అప్పుడు తలలు పైకెత్తి చూస్తామే— అల్లాగా పైకి చూడటమన్నమాట."

"ఎందుకు అలా పైకి చూడటం?"

"ఎందుకంటే ఆ దంపతులు అంత ఎత్తు బురుజుమీదనుంచీ ఎప్పుడూ క్రిందికి దిగిరారు కనుక."

"ఏమిటీ! ఎప్పుడూ క్రిందికి దిగిరారూ?"

"ఊహూ! ఇన్ని వందల ఏండ్లలోనూ ఒక్కసారి కూడా దిగిరాలేదు. ఎప్పుడూ ఆ బురుజు మీదే వుంటూ గంటగంటకూ గంటలు కొట్టుతూ వుంటారు."

"విచిత్రంగా వున్నదే!"

"విచిత్రమే మరి! వాళ్లను

అసలు ఆ బురుజుమీదికి పంపించినవాళ్ళే, యిద్దరికీ చెరొక సుత్తి యిచ్చి ఆ కంచుగంటమీద గంటలు కొట్టమని చెప్పి పంపించారు."

"వాళ్లు ఆ బురుజు ఎక్కి ఎన్ని ఏళ్లు అయిందన్నావ్ ?"

"కొన్ని వందల ఏళ్లు."

"కొన్ని వందల ఏళ్లే?...అసలు వాళ్లు మనుష్యులేనా ?"

"కాదు...కంచుతో చేసిన బొమ్మలు."

"మరి వాటికా పేర్లు ఎలా వచ్చాయి ?"

"ఆ బొమ్మలూ, ఆ గడియారం చేసినవాడిపేరే యీ బొమ్మలకు వచ్చి వుంటుంది."

"ఊ! అయితే యీ బొమ్మలే గంట కోసారి గంటలు కొట్టేవా ?"

"గంటలు యీ పెద్ద వాళ్లిదరూ కొట్టితే పావుగంటలు కొట్టటానికి వీళ్లపిల్లలు ఇద్దరు ఎప్పటి కప్పుడు బురుజులోనుంచి పైకి పరుగెత్తుకు వచ్చి సుత్తిదెబ్బలు మోగించేవారు."


"ఆ పిల్లలు కూడా కంచు బొమ్మలేగా."

"ఆహాఁ!...ఇలాగు ఒక పట్టణంలో కొన్ని గంటస్థంభాలు వెలిసే సరికి, యూరప్‌లో యించుమించు అన్ని పట్టణాలలోనూ గంట స్తంభాలు వెలిశాయి. ఒక వూరివారిని చూచి మరొక వూరివాళ్లు పోటీలుపడి, ఒకవూళ్లో కేవలం గంటలుకొట్టే గడియారాలే వుంటే, యింకొక వూరివాళ్లు వాళ్ళ వూళ్లో గంటలు కొట్టటం మాత్రమే కాకుండా, సంగీత స్వరాలు కూడా పలికే గడియారాలు పెట్టించుకొన్నారు. ఇలా సంగీతస్వరాలు వాయించే గడియారాలు ఒకప్పుడు హాలండు దేశంలో తెగ వెలిశాయి. రష్యా చక్రవర్తి 'పీటర్ ది గ్రేట్' హాలండు దేశంలో యిలాటి గడియారాన్ని చూచాక తన రాజ్యంలోనూ యిలాటివి వుండి తీరాలన్న పట్టుదలతో, కొన్ని కొన్ని చోట్ల యీ సంగీతపు గడియారాలు కట్టించాడు. కానీ ఆ గడియారాలలో సంగీతస్వరాలు ఎలా పలుకుతాయో, ఆ యంత్రాల బిన ఏమిటో రష్యా దేశస్థులకు తెలిసింది కాదు. అందుకని హాలండునుంచే యీ యంత్రాల విషయం తెలిసిన కొందరు వ్యక్తులను పిలిపించి వారికి పెద్ద జీతాలూ అవీ యిచ్చి, తన ఆస్థానంలో అట్టే పెట్టుకొన్నాడు కూడా."

"అయితే-ఆ జాక్వెమర్ దంపతులన్నావే—వాళ్లు యిప్పటికీ గంటలు కొట్టుతునే వున్నారా ?"

"ఆ! అదేనోయ్ సుందరం—వెనుకటి రోజుల్లో తయారైన వస్తువులు కానీ, అప్పటి మనుష్యులు కానీ యిప్పటిలాగా అనుకొన్నావా ఏమిటి ? ఇప్పుడు వచ్చే గడియారాలు చూడు – ఎంత పెద్ద ఖరీదు పెట్టి కొన్నవైనా సరే యిట్టే పాడైపోతున్నాయ్. అసలు యిప్పటి మనుష్యులు కూడా అంతేలే. పాతికేళ్లు నిండకముందే ప్రతి కుర్రాడి తలా నెరిసి పోతున్నది. ప్రతి మనిషికీ ఎప్పుడూ ఏదో ఒక జబ్బు. ఆ జబ్బుల్లో కూడా ఎన్ని కొత్త రకాల జబ్బులు వచ్చాయ్! అప్పటి మనుష్యులు అలా వుండే వారా మరి? మీ తాతయ్య వున్నాడంటే– ఆయన అంత ఎత్తు వుండేవాడు! ఒకసారిటా –మీ తాతయ్య ఒంటరిగా వాళ్ళ అత్తవారి వూరికి వెళ్లుతున్నాట్ట. ఇప్పటిలాగా అప్పుడు రైళ్లూ మోటార్లు లేవుగా! అంచేత కాలినడకనే ప్రయాణాలు చేసేవాళ్లు. ఆయన అలా నడిచి పోతుంటే యిద్దరు దొంగలు యీయనమీద కలబడ్డారట. మీ తాతయ్య ఏం చేశాడో తెలుసా?

(46-వ పేజీ చూడండి)



డాన్ క్విక్ సెట్

పూర్వ కథ

లామంచా అనే గ్రామానికిచెందిన డాన్ క్విక్ సెట్ అనే వెర్రి వెంగళప్ప ఒకడుతనుకూడా ఒకవీరుడు (నైట్) గా పేరుపొందాలని వుబలాటపడి, 'రోజినాంటె' అనే ఒక కుంటిగుర్రాన్ని ఎక్కి బయలుదేరాడు. ఒకానొక స్త్రీమూర్తిని ఎంచుకొని ఆమెకుతానే 'డల్ సీనియా' అనేపేరు పెట్టుకొన్నాడు. ఆమెమన్నన సంపాదించటంకోసమే తాను ధర్మరక్షణమనే కఠోరదీక్ష స్వీకరించానని నమ్మాడు.

ఏవేవో వెర్రివెర్రి ఆశలుచూపి శాంకోపాంజా అనే ఒక అమాయకపు కూలీని తన బంటుగా చేసుకొన్నాడు. వాడు 'డాపుల్' అనే ఒక గాడిదనెక్కి యీాయన వెనకాలే బయలుదేరాడు. మంచుతెరలు విప్పని వేకువసమయంలో దూరంగా కనుపిస్తున్న గాలిమరలను చూసి డాన్ క్విక్ సెట్ అవి ఏవో పెద్దరాక్షసులనుకొని వాటిమీదికి యీాటె పుచ్చుకు పరిగెత్తాడు. గాలిచక్రం ఆకులు గిరాగిరా తిరుగుతూ యీాతడు విసిరిన యీాటెను ముక్కలు ముక్కలుగా చేసి పారేశాయి. ఆ కుదుపుకు డాన్ క్విట్ గుర్రంమీదనుంచి దొర్లిపోయాడు. వళ్లంతా గాయాలు అయినా యింటికిపోకూడదనే పట్టుదలతో బయలుదేరి 'లాపిస్' ప్రాంతంవైపు యిద్దరూ తమ వాహనాలను నడిపించుకుపోయారు. అక్కడ ఎవరో యిద్దరు సన్యాసులు, ఒక గుర్రపుబండి, కొందరు మనుష్యులు కలిసి ప్రయాణం చేస్తూ వీళ్ల కంటబడారు. ఆ సన్యాసులిద్దరూ మాంత్రికులనీ, ఆ బండిలో ఎవరో రాకుమార్తెను వీళ్లు బందీగా తీసుపోతున్నారనీ డాన్ క్విక్ సెట్ వూహించి, వాళ్లమీద యుద్ధానికి వెళ్లాడు. అక్కడ చిన్నయుద్ధం జరిగింది. డాన్ క్విక్ సెట్ చేసిన హంగామాకు ఆ గుంపులో వాళ్లు బెదిరిపోయారు. ఈయన పెట్టిన షరతులకు ఒప్పుకొని, వాళ్లు తమ దారిని తాము వెళ్లిపోయారు.

5

డాన్ క్విక్ సెట్ కు బలే గర్వం పుట్టుకొచ్చింది.

గర్వం పుట్టుకు వచ్చిందంటే తప్పేముంది? పుట్టిన్నాళ్లకు పురుషుడు యజ్ఞం చేశాడన్నట్లు, వీరాభిషేకం చేయించుకొని యిన్నాళ్లయితే. యిప్పటికి కదా - తానొక సాహస కార్యం చేసింది! అందులోనూ ఎటువంటి సహసకార్యం? ఒక్కరా, యిద్దరా? దగ్గర దగ్గరగా పదిమంది దాకా ఆవిడ తాలూకు మనుష్యులుంటే, యిందరికీ తాను ఒక్కడు, ఒక్కడు అంటే ఒ—క్క—డు—, సమాధానంచెప్ప గలిగాడు. హే! ధీరుడంటే అల్లా వుండాలి!! తన ధాటికి ఓర్వలేక పదిమంది పిక్కబలం చూపిస్తే ఎంతటి వాడికైనా భుజాలు పొంగవూ?

డాన్ క్విక్ సెట్ యిలాగు తియ్యతియ్యని ఆలోచనలు చేసుకొంటూ గుర్రం ఎటు పోతున్నదీ,— అసలు పోతున్నదీ, పోకుండా నిలుచున్నదీ కూడా— గమనించటం లేదు.

ఇంతసేపూ శాంకో పాంజా ఏమి ఆలోచిస్తున్నాడో తెలుసా? వాడు యిల్లువిడిచి బయలుదేరిన క్షణం నుంచీ వాడి దృష్టిఅంతా డాన్ క్విక్ సెట్ జయిస్తానన్న ఆ దీవిపైనే వుంటున్నది. ఇప్పుడు డాన్ క్విక్ సెట్ ఎవరితోనో యుద్ధంచేసి, విజయం సాధించటం వీడు కళ్లారా చూస్తూనే వున్నాడుగా! తన యజమాని యీా యుద్ధంలో ఆదీవిని కాస్తా తప్పక జయించి వుంటాడని వీడికి వల్లమాలిన నమ్మకం ఏర్పడింది. దీవిని జయించిన తరువాత కూడా తనకా గవర్నరు పదవి యిచ్చివెయ్యకుండా తన యజమాని యింకా ఎందుకు ఆలస్యం చేస్తున్నాడో వాడికి, ఎంత ఆలోచించినా, అర్థంకాలేదు.

ఇక, వుండ బట్టలేక నడుస్తూ నడుస్తూ వున్న తనగాడిద 'డాపుల్'ను చటుక్కున ఆపేసి, దానిమీాదినుంచి దిగిపోయి డాన్ క్విక్ సెట్ రెండు కాళ్లూ పట్టుకొన్నాడు.

"స్వామీ! ఆలస్యం చేస్తే అమృతమైనా విషమౌతుందంటారు పెద్దలు. శుభకార్యం చప్పున చేసెయ్యమని కూడా ఆపెద్దలే అన్నారు కదా! అయినప్పుడు, మీారు ఆదీవులను జయించాక కూడా, నన్ను గవర్నరుగా చేసెయ్యకుండా నన్నెందుకు వేధి

(36-వ పేజీ చూడండి)

రచన: శ్రీ విశ్వాత్ముల నరసింహమూర్తి

వెంకటపతి సత్రం

శ్రీ జి. వి. జి. కృష్ణ

వేటపాలెంలో వెంకటపతి అనే వైద్యుడొకడుండేవాడు. అతను యిచ్చేది మంచి మందయినా, ఆమందు విలువ కెక్కువగా డబ్బు పుచ్చుకొనేవాడు. బీదాసాదా అని చూడక, చేది మాత్రలకు కూడా బోలెడంత డబ్బు గుంజేవాడు. పైగా పిసినారి; ఎంగిలి చేత్తో కాకినైనా తోలేవాడు కాడు.

ఆ ఊరిలోనే శరభయ్య అనే ఒక రైతు. అతనికున్న ఆస్తల్లా మూడు ఆవులూ, ఆరు దూడలూ. మునసబుగారి పొలంలో పనిచేసి, వచ్చిన కూలి డబ్బులతో ఎలాగో సంసారాన్ని నెట్టుకొని పోతూండేవాడు.

ఒకరోజు పొలంలో పని చేస్తూంటే, శరభయ్య కాలిమీద ఏదోపాము కాటు వేసింది. అది ఏపామో తెలీదు కానీ, కరిచింది మాత్రం పాము అని తెలిశాక, శరభయ్య స్పృహ తప్పి అలాగే పడిపోయాడు. తోటి రైతులు శరభయ్యను ఒక ఎద్దు బండిలో పడుకోబెట్టి, అతనింటికి చేర వేశారు. వళ్లు తెలియని స్థితిలో వున్న శరభయ్యను చూడగానే, అతని భార్య సావిత్రమ్మ గుండెలు బాదుకొంటూ ఏడవడం మొదలెట్టింది.

"ఎందు కేడుస్తావు తల్లీ అలా కళ్లు పోయేటట్లు...భయమేం లేదమ్మా. వెంకటపతి గారికి కబురంపాము. వారు గనక వచ్చి మందు వేశారంటే ఎంతలావు విషమైనా యిట్టే దిగిపోతుంది, క్షణంలో" అని ఓదార్చాడు, అక్కడ మూగిన గుంపులో నించి, ఒక పెద్దమనిషి.

కాసేపటికి వెంకటపతి రానే వచ్చాడు. శరభయ్య కాలును బాగా పరీక్షించి "రెండు కాట్లు పడివున్నాయ్. ఇది తప్పక త్రాచు పాము కాటే అయివుంటుంది" అన్నాడు.

"అది ఏ పామైతే ఏం కానీ, ముందు మందు వేయించండి" అని కళ్ళ నీళ్లు తుడుచుకొంటూ అడిగింది సావిత్రమ్మ.

"ఓ...అదెంత పనీ-మన చేతిలో వుండేదేగా ... కానీ ... ఫీజు విషయంలో మాత్రం మనసంగతి తెలి



సించేగా!" అని వెంకటపతి నసిగాడు.

"ఏమాత్రం పుచ్చుకొంటా వేమిటి, పాముకాటుకు?" అని ఆ గుంపును తోసుకొని ముందుకొచ్చి ప్రశ్నించాడు, ఆవూరికరణం గారి కొడుకు. వెంకటపతికి ఈ అత్యాశ వదిలించాలని ఆ కరణం కొడుక్కి ఎప్పట్నుంచో పట్టుదలగా వుంది.

"చూడబ్బాయ్!...ఇందులో నాకొచ్చే లాభమేమీ లేదు. పైగా-శరభయ్య మనవాడు. అతని పేదరికం నాకు తెలియదు కనుకనా? అంచేత మందు మూలికలకు అయ్యేఖర్చు తొంభై రూపాయలు మాత్రం ఇప్పించండి. క్షణంలో నయం చేస్తాను. త్రాచు పాము కాటంటే సామాన్యమైనదా? ఇప్పటికే ఎంతో ఆలశ్యమైంది కూడాను. డబ్బుకు వెనుకంజ వేసి మీరింకా ఆలశ్యం చేస్తే ప్రాణానికేమోసం" అని తన మామూలు ధోరణిలో మాట్లాడాడు.

"ఇస్తాం కానీ-ముందు మందు వేయించండీ" అని బ్రతిమాలింది సావిత్రమ్మ.

"మందు సిద్ధంగా వుంది. మరి డబ్బుమాట ఏమంటారూ?" అని అడిగాడు వెంకటపతి.

"మీడబ్బు ఎక్కడికీ పోదులెండి...మీరు మందు వేయండి బాబూ!" అని మళ్ళీ బ్రతిమలాడింది సావిత్రమ్మ.

"మీరిస్తారు లేమ్మా-ఆసంగతి నాకు తెలుసు. కానీ...పాపం మీ దగ్గిర మాత్రం ఇల్లాటి సమయానికి అంత సొమ్ము వుంటుందా అని! అంటూ నీళ్లు నమలడం మొదలుపెట్టాడు వెంకటపతి.

"సొమ్ము లేకపోతే సొత్తు లేదనుకున్నావటయ్యా? వాళ్ల ఆవు నొకదానిని అమ్మి, ఇప్పిచ్చేస్తానులే. ముందు నువ్వు మందు ఏదో వేసెయ్యి" అని కరణం గారబ్బాయి రెట్టించాడు.

కరణం గారబ్బాయి ఆలా మధ్యవర్తిగా నిలిచినాకూడా, వెంకటపతి మాత్రం అనుమానంతోనే మందు వేశాడు. వెంకటపతి చేతి చలువ వల్లనో, లేక ఆమందు గుణం వల్లనో కానీ, ముక్కులోకి రెండు చుక్కలు పడ్డాయో లేదో, నిద్రనించి మేల్కొన్న వాడికి మల్లే లేచి కూర్చున్నాడు శరభయ్య. అక్కడ నిలుచొనున్న వారందరూ వెంకటపతినీ, ఆయన వేసిన మందును తెగ మెచ్చుకొన్నారు.

"ఊఁ ... డబ్బిప్పిచ్చేయండీ ... నేను పోవాలి...అవతల నాకు బోలెడు పనులున్నాయ్" అని అప్పుడే తొందర చేయడం మొదలెట్టాడు వెంకటపతి.

"కాస్త ఆగవయ్యా నీది; మరీనూ. ఆయన ఇంకా సరిగా లేచాడో లేదో-అప్పుడే నువ్విలా తొందర చేస్తే ఎలా గయ్యా...ఒక రెండు మూడు రోజులు గడువివ్వు... నీసొమ్ము ఎక్కడికీ పోదులే!" అని కరణంగారబ్బాయి అనేసరికి ఆకాశమంతెత్తు ఎగురుతూ "ఇదేనటయ్యా నీ మాట...ఆఖాత ఏదో ముందే కూయక పోయావ్?... నేనేం వెర్రివాడననుకున్నావా ఏమిటీ?...మీఎత్తు లేవీ నాదగ్గర సాగవు...ఆవును అమ్మి, డబ్బిప్పించే స్తానని ఇందాక వారి పరంగా మాట్లాడిందిందు కేనా? నీ మాట నమ్మేగా అంత ఖరీదైన ఈమందు యీయన మొగానపోసి నేనిప్పుడు రొంపిలో దిగబడి పోయిందీ!" అని పెంకు లెగిరి పోయేటట్లు కేకలు పెట్టడం మొదలెట్టాడు వెంకటపతి.

అంతమంది ఎదుట తన్నలా ఆడిపోసుకోవటం కరణం కొడుకుకు చిన్నతనంగా తోచింది. "ఇదిగో నయ్యా..నాతో కూడా రా, సంతకు; నీ డబ్బును నీ మొహాన పారేయిస్తా. ...ఏదండీ శరభయ్యగారూ! మీ ఆవుల్లో ఒకటి ఇలా ఇవ్వండీ" అని తనే నేరుగా పశువుల పాకలో కెళ్లి, కట్లు విప్పి, ఒక ఆవును తోలుకొని పోబోయాడు. ఇంతలోనే తన మెదడుకు ఏం తట్టిందో ఏమో కానీ, అక్కడేన్న ఒక కోడిపుంజు వుంటే, దాన్ని కూడా తీసుకొని బయలు దేరాడు సంతకు. వెంకటపతి కూడా అతన్ని వెంబడించాడు.

సంతలో కరణంగారబ్బాయి ఏం చేశాడంటే, ఒక రచ్చ తిన్నె మీద ఆ ఆవును నిలిపి, దానిపైన ఆకోడి పుంజును నిలబెట్టి "ఈ ఆవు ఆరు రూపాయలు...దానిమీద వుండే ఈ అందమైన కోడిపుంజు నూరు రూపాయలు...రెండింటినీ ఒకేమారు కొనేవారికే అమ్మబడుతవి" అని ఎలుగెత్తి అరుస్తూ నిలుచున్నాడు.

దీన్ని విని కొందరు పకపక నవ్వుకున్నారు. కొంత మంది ఆశ్చర్య పోయారు. మరి కొంత మంది ఇదేం పిచ్చో, చాదస్తమూ అన్నారు. కొద్ది సేపట్లోనే ఆ తమాషాను చూడటానికి, సంతకు వచ్చిన జనమంతా అక్కడే మూగిపోయారు.

ఒక్కడు మాత్రం ముందు కొచ్చి, నూట ఆరు రూపాయలూ చెల్లించి, ఆ రెండింటినీ కొనుక్కొని వెళ్లిపోయాడు.

కరణంగా రబ్బాయి, వెంకటపతి చేతికి ఆరు రూపాయలిచ్చాడు.

"ఇదేమిటి ఆరు రూపాయ లిచ్చావ్" అని గావు కేక పెట్టాడు వెంకపతి.

"మరి, ఆవు ఎంతకండీ అమ్ముడు పోయింది - మీా ఎదుటనేగా ఆరు రూపాయలకు అమ్మిందీ ?" అని దబాయించాడుకరణంగారబ్బాయి.

"మరి మిగతా డబ్బులో?..." అని గాభరాతో అడిగాడు వెంకటపతి.

"నాకేం తెలుసూ ? మీాకేమని మాటిచ్చానూ ? ...ఆవు నమ్మిన డబ్బుయిస్తానన్నాను...అవునా?... ఆవు ఆరు రూపాయలకు అమ్ముడు పోయింది...అదే ఈ ఆరు రూపాయలు" అన్నాడు కరణంగా రబ్బాయ్, ఏమీా ఎరగనట్టు. వెంకటపతికి తల తిరిగి నోట్లోకి వచ్చింది.

"పోనీ-ఒక రెండు మూడు రోజుల్లోగా ఇప్పిస్తానన్నావుగా-ఇందాక ఊర్లో, ఇందా- ఈ ఆరు రూపాయలు తీసుకొని, నా డబ్బును పూర్తిగా రెండు మూడు రోజుల తర్వాతే ఇప్పించు...పరవాలేదు" అని తగ్గిపోయాడు.

"ఆమాట ఇందాక ఊళ్లోనే ఎందుకు అనలేక పోయావ్? చెయ్యి జారాక ఇప్పుడంటే ఏం లాభం?-నాకవేమీా తెలియవు. .. మీారు ఆవును అమ్మి డబ్బివ్వమన్నారు - నేనల్లాగే ఇచ్చేశాను. . .చేతులు కాలిన తర్వాత



"ఖాళీ తెమ్మంటారా అమ్మా?"

ఆకులు పట్టుకొంటే ప్రయోజనమేమీా లేదు ... అంతగా మీాకు పూర్తి డబ్బులు కావాల్సొస్తే, ఇందాక మీారు నాచేత అమ్మించిన ఆవును ఎలాగైనా అవస్థలు పడి, మళ్లీ కొని తెచ్చి నాకప్పగించండీ - వెంటనే మీా డబ్బును మీాకు చెల్లిస్తా" అని కరణంగా రబ్బాయి అనేసరికి, వెంకటపతి ఇహ నోరెత్తి మాట్లాడలేక, తన మందు ఖరీదుకు రెండింతల విలువ, ఆ ఆరు రూపాయలైనా దక్కినందుకు సంతోషిస్తూ ఇంటిదారి పట్టాడు. కరణంగా రబ్బాయి జాణతనానికి, శరభయ్య మెచ్చుకొని, అతనికి ఎన్నో విధాల కృతజ్ఞుడై వుండేవాడు.

అప్పట్నించీ, పిసరంత మందుకు కొండంత డబ్బు గుంజాలనే ఆశ తగ్గించుకొన్నాడు వెంకటపతి. క్రమేపీ అతనిలో ఆ ఆత్యాశపోయి, ధర్మబుద్ధి అలవడింది. దాని ఫలితమే నేటపాలెంలో వెలిసి, ఇప్పటికీ చెక్కు చెదరక వున్న, ఆ వెంకటపతి ధర్మసత్రం!!! అందుకు అదేసాక్షి. ★

డాన్ క్విక్‌సెట్

(32-వ పేజీ తరువాయి)

స్తున్నారు ?" అంటూ వెక్కి వెక్కి ఏడ్వటం మొదలు పెట్టాడు.

పీడి అమాయకత్వం చూసేసరికి డాన్ క్విక్‌సెట్‌కు జాలివేసింది. "ఓ నా శాంకో! నీవెంత జ్ఞానశూన్యుడవు! వీరులు, వీరోచిత కార్యములు నీకు ఖాత్రిగా తెలియక యుండుట కడుంగడు శోచనీయంబు. నే నింతదనుక సలిపిన పోరాటము దీవులకై కాదని గుర్తింపలేక పోయితివి కదా! ఏ మందును— నీ మంద బుద్ధిని. అయిననూ—శాంకో—యింతలో నిరుత్సాహ పడనేల! మనమింకనూ ఎన్నియో యుద్ధముల జేయవలసి యున్నది. ఆ యుద్ధములలో ఎందరో రాజులను ఓడించవలసి యున్నది. ఆరాజులలో ఎవరో ఒకని వద్దనుండి నీకై ప్రత్యేకముగా నొక దీవిని వూడ లాగికొని, ఆదీవికి నిన్నే తప్పక గవర్నరుగా చేసి తీరెదను. ఇంతలో తొందర పడెదవేలనోయి! నాశాంకో,నీవొకింత ఓపికపట్టిన,దీవి ఏమి ఖర్మము— ఒక పెద్ద భూఖండమునే మనము వశముచేసుకో గలము. అప్పుడు దానికి నీవే రాజ్యపాలనాధికారము వహింతువు లెమ్ము. వీరుడైన వాడు—అందును డాన్ క్విక్‌సెట్ వంటి వీరాగ్రేసురుడు, ఆడిన మాటను ఎన్నటికైనా తప్పునా! వేగిర పడకుము; వేగిర పడకుము," అంటూ అతనిని ఎంతో బుజ్జగించాడు.

శాంకో పాంజాకు కూడా తన యజమాని మాటలు వినగా వినగా వాటిలో కొంత నిజంలేక పోలే దనిపించింది. ఇక ఆవిషయమై అట్టే పట్టుదల పట్టటం మంచిదికాదని తోచింది. డాన్ క్విక్‌సెట్‌ను మళ్లీ గుర్రం ఎక్కించి, తానుకూడా పోయి యధాప్రకారం 'డాపుల్' మూపున ఎక్కాడు.

ఇద్దరూ కలిసి తాము సంపాదించబోయే రాజ్యాలు, సామ్రాజ్యాలు, భూఖండాలు, ద్వీపాలు, ద్వీపకల్పాలను గూర్చి యిచ్చవచ్చినట్లు చిత్రించుకొంటూ, యిచ్చకాలు ఆడుకొంటూ ప్రక్కనే వున్న అడివి మార్గంగుండా వాహనాలను నడిపించారు. అలా కొంతదూరం పోయేసరికి డాన్ క్విక్‌సెట్‌కు కడుపులో ఆకలిబాధ ఎక్కువ కాసాగింది. ఆకలి బాధ ఎక్కువ అవుతున్న కొద్దీ, మాటల ధోరణి తగ్గింది. యావగా చెట్లకొమ్మల కేసి చూడటం మొదలు పెట్టాడు—కాయో కసరు ఏమైనా కంటపడుతుందోమోనని! అంత వుత్సాహంగా రాబోయే విజయాలను గూర్చి ముచ్చటించుకొంటున్న వారల్లా, వున్నట్లుండి యిద్దరూ మౌనంలో పడ్డారు. లోపల ఆకలిమంటలు మరీ ఎక్కువ అయినాయి. ఇక వుండలేక డాన్ క్విక్‌సెట్—

"శాంకో! యీసమీప ప్రాంత మందెచ్చటనైనను చక్కనికోట యొకటి కంటబడిన బాగుండును కదా! ఆకోటలోనికి బోయి, వా రాదరముతో నీయగల యాహారమునుతిని క్షుద్బాధనుపశమింప జేసుకొనవచ్చునే!" అంటూ అంగలార్చాడు.

ఆకలిబాధ కంటే కూడా యితనిని మరొక బాధ ఎక్కువగా పీడిస్తోంది. ఆవిషయం మాత్రం అతడు బయటపెట్టలేదు. అలా బయట పెట్టటం వీరుడి లక్షణం కాదు కూడాను. ఇందాక జరిగిన కత్తియుద్ధం సందర్భంలో—ఆ గుర్రపుబగ్గీలో వస్తున్న ఆస్త్రీ తాలూకు హంగుదారుడు కత్తిపుచ్చుకొని తన వుక్కుటోపీ మీద కొట్టినప్పుడు, ఆటోపీ ముక్కలు ముక్కలు కావటమే కాకుండా, తనకుడిచెవిలో కొంత భాగం కత్తిరించుకుపోయి చిల్లపెంకులా ఎగిరి పోయింది. ఆచుట్టుపట్ల ఎంత కలయ చూచినా, తెగిన చెవి ముక్క ఎక్కడ పడిందీకూడా కనుపించనైనా కనుపించలేదు. ఆముక్క కనుపిస్తే అయినా యింత బాధ వుండకపోనేమో! యుద్ధం చేస్తున్నప్పుడు— ఆ వుద్రేకంలో యీబాధ అంతగా తెలియలేదు. యుద్ధం అయిపోయి, యిలా యీ అడివి దారివెంట వస్తున్నప్పుడు, ఎక్కువ భాగం ఆయుద్ధంలో తనకు చేకూరిన విజయాన్ని గురించి, యిక ముందు తానూ, శాంకో పాంజా వశపరచుకో బోతున్న భూఖండాలను గురించీ ఆలోచిస్తుంటే కూడా యీ బాధ కనుపించలేదు. ఆధోరణి ఆగిపోకుండా అలా కొనసాగినా బాగుండేది! మధ్యలో ఆకలిబాధ ఒకటి వచ్చి పడింది. సామాన్యంగా, ఒక బాధ ఎప్పుడైతే తెలిసి వస్తుందో, లేనిపోని బాధలు కూడా కొన్ని అప్పటి కప్పుడు పుట్టుకొస్తాయి కదా! అలాంటప్పుడు యింత సేపు కానరాకుండా సలుపు పెట్టుతున్న ఆచెవి

కోత తాలూకు బాధ, ఒక్కమారుగా పెద్ద వరదవచ్చి పడ్డంత వుధృతంగా, తెలిసొచ్చింది. ఎంత బాధగా వున్నదో పది పదిహేను మాటల్లో ఎవరికైనా చెప్పుకొన్నా కొంతమటుకు బాధ వుపశమిస్తుందేమో అనుకొంటే, వీరుడైనవాడు అలాటి బాధలు పైకి చెప్ప రాదాయెను? అందుకే—కోట ఏదైనా కంటబడితే బాగుండు ననుకొన్నాడు. ఆకోటలో చాటుగానో మాటుగానో ఎవరికి తెలియకుండా యింత చిలక ముక్కు చెట్టు ఆకు పసరుతీసి, ఆ చెవికి పూసుకొంటే ఆ బాధ వుపసమిస్తుంది కదా అని ఆశపడ్డాడు. ఆ ఆశ కొద్దే, కోట ఎక్కడైనా కనుపడుతుందేమో నని మాత్రం పైకి అన్నాడు.

డాన్ క్విక్ సెట్ లోలోపల పడుతున్న బాధ అంతా శాంకో పాంజాకు తెలియదు. వాడికి కూడా ఎప్పటినుంచో ఆకలి అవుతున్నదేమో—యజమానికి వున్న బాధకూడా ఒక్క క్షుద్బాధే కాబోలు ననుకొన్నాడు. తన సంచీలో కాసిని ఎండిపోయిన రొట్టె ముక్కలు, పాచిపోయిన జున్నుముక్క, ఒక వుల్లి పాయ వున్నాయని బయట పెట్టాడు.

ఏదో ఒకటి—తిన తగిన వస్తువు అంటూ ఒకటి శాంకో పాంజా దగ్గిర వున్నదని వినేసరికే, డాన్ క్విక్ సెట్ కు నోరు వూరింది. "అయితే బయటకు తియ్యి, తిందామ"ని నోరు తెరిచి అనబోయే లోగానే, శాంకో పాంజా వెఱ్ఱిమొఖం పెట్టి, "నాదగ్గిర అయితే యీ రొట్టెముక్కలు, జున్నుముక్క, వుల్లి పాయి వున్నాయి కానీ, మీలాంటి వీరులు, దొడ్డ మనుష్యులు యివి తినకూడదేమో?" అంటూ వెధవ అనుమానం ఒకటి బయటపెట్టాడు. డాన్ క్విక్ సెట్ కు దీనితో తలపై పెద్దపిడుగు పడ్డట్లయింది. ఒక చెంపను ఆకలితో చెవులు ఘుడియలుపడి పోతూవుంటే, తినటానికి యిప్పట్లో ఏదీ దొరకదేమో అని భయపడి చస్తుంటే, శాంకో పాంజా యిలా తనవద్ద తినటానికి కొన్ని వస్తువులు వున్నాయని బయటపెట్టి, 'అవి మీలాంటి వీరుడు తినకూడదేమో' అంటూ అడ్డు పెట్టేసరికి, అతడికి వళ్ళు మండుకు వచ్చింది. 'పరవాలేదులే, యిటుతే' అందామా అంటే—ఏగడ్డి పడితే ఆగడ్డికరిచే అల్పుడిక్రింద యీ శాంకో పాంజాయే తనను జమ కట్టేస్తాడేమో! పోనీ—వాడు ఒక్కడే అలా అనుకొన్నా యింతలో కొంప ముంచుకు పోయేదీ ఏమీ లేదు. తాను యిలాగు వుల్లిపాయలతో కడుపు నింపుకొన్నాడనే వార్త, వీడి మూలంగా ఆనోటా ఆనోటా ప్రాకిందంటే, వీరుడుగా తనకు యింక వచ్చి మంచి కీర్తైనా వుట్టవే! పెద్ద చిక్కు వచ్చి పడింది. ఏం చెయ్యటానికీ తోచలేదు. కొంచెం సేపు ఆలోచించాడు. బంగారం లాంటి ఆలోచన ఆ(మట్టి) బుఱ్ఱలో గబుక్కున మెరిసింది.

"శాంకో! నీ అమాయకత్వమును జూచిన కొలదీ నీపై నాకుగల జాలి అధికమగు చున్నది. ఎంత చెప్పినను, ఎంత చూచిననూ, నీకు వీరులు, వీరోచిత కార్యముల తీరులు బోధపడక యున్నవే! ఈమహోత్తర విషయములను గూర్చి నేనెన్ని విధముల బోధించినను, ప్రత్యక్షముగా ఆచరించి చూపిననూ, నీకు యిసుమంతయు బోధపడక యున్నదే! కటకట—నేనేమి చేయుదును? నేజదివిన వీరగాథ లన్నిటి యందును వీరులైన వారు పెద్దపెద్ద రాజభవనములలో మాత్రమే విందులు కుడిచినట్లు వర్ణింపబడివున్నది. అంతవరకు నది సత్యమే. కానీ-వున్నచోట వుండక, మన్నచోట మనక, ఎల్లప్పుడును సంచార కార్యక్రమము లందు మునిగితేలు యీ వీరులు అందరునూ, మనుష్య మాత్రులే అయినందున, ప్రతిదినమును, దినమునకు రెండుసార్లు అయినను కడుపునకు ఏదియో ఒకింత వేయక వారికినీ తప్పి యుండదు కదా! వారు సామాన్యముగా అడవులు, ఎడారులలో ప్రయాణములు చేయుదురు కదా! అచ్చట ఆహార పదార్థములు ఎట్టివి? కందమూలములు, ఆకు లలములు, ఎండు ఖర్జూరములు. ఇంతియే గదా! ఆవీరులు వీటితోనే కాలము గడుపుకొని యుండవలయు. వారు తిన్న ఆ కంద మూలముల కంటెనూ, ఆ యాకులలముల కంటెను మిక్కిలిగా నీసంచిలో నున్న యీ రొట్టెముక్కలు, వుల్లిపాయలు వీరులకు భోజ్య వస్తువులే. కాన తొల్లిటి వీరులు మ్రింగిన ఆ ఆకులలముల కంటె రుచికరములైన ఆహార పదార్థములు నీవద్ద నుండగా, వానిని నావంటి వీరునకు సమర్పించ రాదేమోనన్న కుశ్శంక నీమంద బుద్ధికి ఏల తోచెడినో నాకు అర్థముగాక యున్నది. వెఱ్ఱిమొఱ్ఱి అనుమానములతో ప్రమేయము పెట్టు

కొనక, నీవద్దగల ఆ ఆహార పదార్థముల నిటు తెమ్ము" అన్నాడు.

ఎంత చిన్న విషయానికి ఎంత పెద్ద ఉపన్యాసం యివ్వవలసి వచ్చింది? ఇంత పెద్ద ఉపన్యాసం యిచ్చినందుకు ఫలితం కనుపించింది. ఆ శాంకో పాంజాకు పుట్టుకొచ్చిన అనుమానాలు తొలగి పోతున్నట్టే అతని ముఖంలో కవళికలను బట్టి డాన్ క్విక్ సెట్ కు అర్థమయింది.

"ఏదో తెలియని వాణ్ణి; నన్ను మన్నించాలి స్వామీ! మీరు చెపుతున్న వీరుల గాధలు నేనేమీ చదువక పోవటమే నా అజ్ఞానానికి కారణం. నేనా పుస్తకాలు చదువక పోవటానికి కారణం, నాకు చదువు రాకపోవటమే. నాకు చదువురాదనీ, వీరుల గాథలు చదువలేదనీ, మీరు యిప్పుడు ఎంత విచారిస్తే మాత్రం ఏం లాభం? మీ ఆహారం విషయంలో యికముందు మాత్రం తగినంత జాగ్రత తీసుకొంటాను. వీలైనప్పుడల్లా మీకోసం వీలైనన్ని ఎండు ఖర్జూర కాయలు, కందముక్కలు, చేమగడ్డలు సంపాదించి, యీసంచి నిండా పోసిపెట్టాను. ఇక నాతిండి విషయమంటారా—నాకు ఎలాగూ మీరు చెప్పే వీరాభిషేకం వగైరాలు ఏమీ కాలేదు కనుకనూ, వీరదీక్ష పుచ్చుకొన్నవాడిని కాను కనుకనూ, కందమూలాలు, ఎండబెట్టిన ఖర్జూరపళ్ళే తినాలనే నియమం నాకు లేదు కాబట్టి, మనంపోయే మార్గాలలో ఎక్కడైనా కోళ్ళు, కొక్కిరాయలు, కాబేజీ, బీట్ రూటూ బంగాళాదుంపలూ, మసాలాదినుసులు, కొబ్బరి లౌజు, యిలాంటివి దొరికినప్పుడల్లా వాటిని సేకరించుకొని, వాటితోనే కాలం గడుపుకొంటాను తిండి" అన్నాడు శాంకోపాంజా; అక్కడికి తాను ఏదో హీనమైన తిండి తినబోతున్నట్లు దిగులుగా మొఖం పెట్టి.

శాంకో పాంజా ముందు ముందు నిజంగానే కోడి మాంసంలాంటి మంచి మంచివి అన్నీ తనే తినేసి, తన మొఖాన యింత దురద కందపారేసి, 'నువ్వు వీరుడివి కనుక, యివే తినాలని' అంటాడేమోనని డాన్ క్విక్ సెట్ కు గాభరా వేసింది. తనబంటు అంత మంచి భోజనం తింటూవుంటే తాను ఆగడ్డీగాదం ఎక్కడతినాల్సివస్తుందోనన్న ఆవేదన ఎక్కువైంది. అందుకని మళ్ళీ ఉపన్యాస ధోరణి లంకించుకొని, వీరులు కేవలమూ కందమూలలే తిని తీరాలనే నియమం ఎక్కడా లేదనీ, దొరికితే ఏదైనా తినవచ్చుననీ, శాంకో పాంజాకు అరఘంటసేపు వివరించి చెప్పాడు. వాడికి యివన్నీ నచ్చ చెప్పాక కానీ, వాడాసంచీ లోనుంచి ఆరొట్టె ముక్కలు, జున్నుముక్క, వుల్లిపాయలను బయటకు తీయలేదు. ఎండి వరుగులావున్న ఆరొట్టె ముక్కలలో రెండూ, పాచిపోయిన జున్ను ముక్కలో నగం, డన్ క్విక్ సెట్ కు యిచ్చాడు. వుల్లిపాయ చితకొట్టి అందులోనుంచీ కూడా ఒక ముక్క చేతికి అందించాడు. ఇద్దరూ ఆరొట్టె ముక్కలూ, అవే పంచభక్ష పరమాన్నాలను కొని, వాటినే పీక్కుతిని, యిన్ని నీళ్ళు త్రాగి త్రేన్చారు.

ఆవిధంగా 'విందు' ముగించుకొని యిద్దరూ మళ్ళీ వాహనాలు ఎక్కి, బయలుదేరారు. అప్పటికి ప్రొద్దు గూకింది. కాలి కాలి వున్న కడుపులకు ఏదో యింత తిండి పడేసేసరికి, యిద్దరికీ కంటిమీదికి కునుకు వచ్చింది. నడుం వల్చాటానికి యింత చోటు ఎక్కడైనా కనుపిస్తే బాగుంటుందని యిద్దరికీ అనిపించింది.

అలా కొంతదూరం జోగుతూ జోగుతూ పోయేసరికి, అక్కడ గొర్రెలు కాచుకొనే వాళ్ళపల్లె ఒకటి వీళ్ళకంట పడింది. ఆపల్లె యింకా రెండు మూడు ఫర్లాంగుల దూరంలో వుండగానే, మంచి పోపులవాసన ఘుమాయించింది. ఆ ఘుమాయింపుకు యిద్దరూ సమ్మోహితులై ఆవాసన వస్తున్న వైపుకే వాహనాలను పోనిచ్చారు.

అక్కడ గొర్రెల కాపరులు కొందరు చేరి పెద్ద కోలాహలంగా వంటలు వండుకొంటున్నారు. వాళ్ళు మంచి హుషారులో వున్నారేమో, యీ ఆగంతకులను యిద్దరినీ చూడగానే వారికి బ్రహ్మాండమైన స్వాగత మిచ్చారు. ఆరాత్రికి తమతోపాటు భోజనంచేసి అక్కడే పడుకోమని ఆప్యాయంగా ఆహ్వానించారు. అనుకోకుండా వచ్చిపడ్డ యీ అదృష్టానికి వీళ్ళు యిద్దరు మహదానందం పొందారు.

'రోజి నాన్ టే'ని 'డాపుల్'ని తీసుకొనిపోయి అక్కడే ఒక చెట్టుకు కట్టివేసి వీళ్ళు యిద్దరూ, ఆ విందిభోజనాలు జరుగుతున్న చోటికి చిరునవ్వులు ఒలకబోసుకొంటూ వచ్చారు. అక్కడివాళ్ళు అందరు గొఱ్ఱె



తోళ్లు నేలమీద పరుచుకొని నెగడుచుట్టూ కూర్చొని వున్నారు. నెగడుమీద పెద్ద గంగాళంలో కమ్మని పులుసు సలసల కాగుతున్నది. వీరుడి వేషంలోవున్న డాన్ క్విక్‌సెట్‌ను, తమతో పాటు నేలమీద చతికిల పడమంటే బాగుండదని, ఆగొల్లవాళ్లు, నీళ్ల గాబునొక దానిని బోర్లించి, దానిమీద ఆయనను ఆసీనుడు కమ్మన్నారు. శాంకో పాంజాకూడా ఆయన ప్రక్కనే కూలబడ్డాడు. గొల్లవాళ్లు యీ అతిథుల నెంతో మర్యాదచేశారు. వాళ్లు తినగలిగినంత తిండిపెట్టి, త్రాగేందుకు కాస్త మంచిరకం సారాకూడా యిచ్చారు. ఇద్దరూ పూటాగా పొట్టలు నింపుకొన్నారు. గొల్లవాళ్లు వాళ్లలో వాళ్లు ఆడుకొనే పరాచికాలు వింటూ ప్రొద్దు గడిపారు. వాళ్లు వన్నె చిన్నెలుగా చెప్పుకొంటున్న కథలన్నిటినీ చెవులు రిక్కించి విన్నారు.

భోజనాలు హడావుడి అంతా ముగిసేసరికి మరొక గొల్లవాడు ఎక్కడినుంచో అప్పుడేవచ్చి, వీళ్లతో కలిశాడు. ఇతనివయస్సు యిరవై, యిరవై ఐదు మధ్యను వుంటుంది. కండలు మెలితిరిగి, మనిషి చూడ ముచ్చటగా వున్నాడు. మాటలాడటంలో కూడా బలే చమత్కారం చూపించాడు. అలా సరదాగా కాసేపు కబుర్లుచెప్పి, వాడుపాటలు పాడటం మొదలు పెట్టాడు. గొంతెత్తి పాడుతూ, నాటు రకం ఫిడేలు ఒకటి పుచ్చుకు చక్కగా వాయించాడు. అతడి కంఠంకూడా ఎంతో శ్రావ్యంగా వున్నది. ఇతడు పాటలు పాడటం అదీ ముగిశాక, వాళ్లలోనే మరొకడు పెద్ద కథఒకటి చెప్పటం మొదలు పెట్టాడు. అందరూ ఎంతో యిదిగా విన్నారు, వాడు చెపుతున్న ఆకథను. ఇదంతా పూర్తి అయ్యేసరికి రాత్రి చాలా ప్రొద్దుపోయింది. అందరు నిద్రలకుపడ్డారు. మన డాన్ క్విక్‌సెట్ ఆయన బంటూకూడా అక్కడే నడుములువాల్చి, బాగా గురకలు పెట్టూనిద్రపోయారు.

(ఇంకావుంది.)



శుభోదయావారి "ఆదర్శం"లో రేవతి.



లజ్జాసంభ్రమంలో సుగుణ (సావిత్రి) చేతిలో పుస్తకం కిందపడుతుంది. చంద్రం (ఎన్. టి. రామారావు) తీసిఇస్తున్నాడు.

పీపుల్స్ ఆర్ట్ వారి "పల్లెటూరు"లో దృశ్యం.

దేవకీబోసు అభిప్రాయాలు

గత నెల 22 వ తేదీన బెంగాలీ చిత్ర నిర్మాత, డైరెక్టరు అయిన దేవకీబోసు వుడ్ లాండ్స్ హోటల్ లో పత్రికా ప్రతినిధులతో గోష్ఠి జరిపాడు. దేవకీ బోసుకు సినిమా రంగంలో 24 ఏళ్ల అనుభవమున్నది. న్యూథియేటర్స్ సంస్థలోను, విడిగాను ఉండి కొన్ని ఉత్తమ చిత్రాలు ("విద్యాపతి") తీశాడు. ఈయన కొత్తగా విడుదల చేసిన "రత్నదీప్" చిత్రం ఈ ఏడాదివచ్చిన ఉత్తమ హిందీ చిత్రాలలో ఒకటిగా పరిగణింప బడింది. హింధీ, బెంగాలి ప్రాంతాల్లో బాక్సాఫీసును మారగొన్న ఈ చిత్రాన్ని దేవకీ బోసు తమిళంలో కూడా త్వరలో విడుదల చేయబోతున్నాడు.

బొంబాయిలో ఈ ఏడాదిలో ఇప్పటికి విడుదల అయిన సుమారు 53 చిత్రాల లోనూ మూడు చిత్రాలు (రత్నదీప్, యాత్రిక్, మా) మాత్రమే ఆర్థికవిజయం పొందాయని 'ఫిల్మ్‌ఫేర్' పత్రిక అంచనా వేసింది "రత్నదీప్" చిత్రం అంతగా ప్రజాదరణ పొందటానికి కారణమేమిటి అని దేవకీబోసును ఒక పత్రికా ప్రతినిధి అడిగాడు. దానికి ఆయన చెప్పిన సమాధానం ఇది:

"ఈ రోజుల్లో వెలువడే చాలా భారతీయ చిత్రాలను ఏవిధంగానూ భారతీయ చిత్రాలనటానికి వీల్లేకుండా ఉంది. కథలు, డాన్సులు, సంగీతం, దుస్తులు, నటన అన్నీ విదేశీయమైనవిగా ఉంటున్నాయి. ఇటువంటి చిత్రాలు మన ప్రజాసామాన్యంమీద ఏవిధమైన ప్రభావమూ చూపలేవు. అందుచేత అవి దెబ్బతిన్నాయంటే ఆశ్చర్యం లేదు.

"రత్నదీప్" చిత్రంలో నేను కథా వస్తువులోనూ, వాతావరణం, మొదలైన అన్ని అంశాలలోనూ భారతీయతనే పాటించాను. ఇదే నా చిత్రంయొక్క విజయానికి ముఖ్యకారణమని భావిస్తాను."

తారలను గూర్చి మాట్లాడుతూ దేవకీ బోసు ఇలా అన్నాడు.

"తారలు చిత్ర విజయానికి అనవసరమని నేననను. కాని కథా వస్తువులో



అంజలీవారి "పరదేశి"లో నూకాలుగా సీతారాం దేవయ్యగా రేలంగి భావయ్యగా రాయుడు సత్యం.

బలం, నిజాయితీ, జాతీయత ఉండేటట్లయితే ఆ చిత్రానికి బాక్సాఫీస్ తారలు అక్కరలేదు. అటువంటి చిత్రం తప్పక విజయం పొందుతుంది. ఈరోజుల్లో చిత్రనిర్మాణ వ్యయం విపరీతంగా పెరిగిపోవటానికి ముఖ్యకారణం తారలు పుచ్చుకునే పెద్దపెద్ద మొత్తాలే. చిత్ర నిర్మాణంలో పనిచేసే చిన్నచిన్న కార్మికులు అతి స్వల్పవేతనాలతో, దారిద్ర్యంతో బాధపడుతుండగా తారలుమాత్రం స్వార్థబుద్ధితో అంతంత జీతాలు పుచ్చుకోవటంకంటె అన్యాయం వేరేలేదు. ప్రతి కార్మికుడికీ శుభ్రంగా జీవించటానికి తగిన జీతం ఇచ్చాక, తారలు ఎంత పెద్ద మొత్తం తీసుకున్నా నాకేమీ అభ్యంతరం లేదు.

అయితే సినిమా పరిశ్రమలో ఆర్థికమైన ఈ ఎక్కువ తక్కువలకు బాధ్యత తారల నెత్తిపైన వేసి లాభంలేదు. ఇందుకు బాధ్యత వహించవలసింది ప్రొడ్యూసర్లు. తారలకు ప్రొడ్యూసర్లు లక్షలకు లక్షలు ఎందుకు ధారపోస్తారు? తాము మరికొన్ని లక్షలు సంపాదించటానికే గదా? ధనార్జన చేయటం తప్పనికాదు నా అభిప్రాయం. ప్రతివాడూ శక్తివంచన లేకుండా శ్రమించి ధనం ఆర్జించవలసిందే. కాని అనేకమందిని దరిద్రులను చేయటం ద్వారా ఒకడు కోటీశ్వరుడు కావటం కూడదనే నేనంటున్నాను. ఒకడి ఆనందం అనేకమంది దుఃఖంమీద ఆధారపడి ఉండరాదనే నా అభిప్రాయం. అనేకమందిని దుఃఖపెట్టినవాడు ఎన్నటికీ తాను కోరిన ఆనందం పొందలేడు."

దేవకీబోసు మనదేశపు పత్రికలపై కొన్ని అభిప్రాయాలు వెలిబుచ్చారు.

"మన పత్రికలు సినిమా తారలను తారాపథానికెత్తేయటం విచారకరంగా ఉంది. కొన్నికొన్ని పత్రికలు తారల నటనా సామర్థ్యాన్ని గూర్చి వ్రాయటం బదులు వారి ఆంతరంగిక జీవితానికి విపరీతమైన పబ్లిసిటీ ఇస్తాయి ఏ తారకు ఏ కూర ఇష్టం, ఏ చీరఇష్టం, ఏ కారు ఇష్టం మొదలైన అసందర్భపు విషయాలను ప్రచారంచేస్తాయి. ఇటువంటి ప్రచారం వలన చాలా ప్రమాదం జరుగుతుంది. పూర్వం మన ఇళ్ళలో రాముడు, కృష్ణుడు అశోకుడు మొదలైన జాతీయ వీరుల పటాలుండేవి ఇప్పుడవన్నీ ఎక్కడ అంతర్థానమైపోయాయో తెలియదు. ఇప్పుడు ఏ ఇంట్లో చూసినా పత్రికల్లో ప్రకటించబడిన తారల ఫోటోలే గోడలమీద కనిపిస్తాయి. వీటివలన మన బాలబాలికలు, యువతీయువకుల లేతమనస్సులు కలుషితం కావటంకంటె వేరే ప్రయోజనం లేదు. పత్రికలవారు ఈవిధమైన కాలుష్యాన్ని



అవర్ ఇండియావారి "నాయిల్లు"లో నాగయ్య.

ప్రచారం చేయటం మానివేస్తారని ఆశిస్తున్నాను."

కొన్ని పత్రికలు సినిమాపరిశ్రమకు సంబంధించిన విషయాలకంటె సినిమా వ్యక్తుల ఆంతరంగిక విషయాలకే అనవసరమైన ప్రాధాన్యమిస్తున్నాయన్న ఆరోపణ తోసివేయదగింది కాదు. కాని ఒక ప్రొడ్యూసరు పత్రికలమీద ఇలా ఆరోపణ చేయటం అన్యాయం. సాధారణంగా పత్రికలకు స్వతంత్రమైన స్థానం లేదు. రాజకీయపత్రికలు దేశ రాజకీయాలమీద, సాహిత్యపత్రికలు సాహిత్యంమీద, సినిమా పత్రికలు సినిమాపరిశ్రమమీద ఆధారపడి ఉంటాయి. భాష లేకపోతే వ్యాకరణం లేనట్లు, భాషతోపాటు వ్యాకరణం అభివృద్ధి పొందినట్లు దేశంలో సినిమాలు లేకపోతే సినిమాపత్రికలుండవు; సినిమాపరిశ్రమ ఏ స్థాయిలో ఉంటే సినిమావిషయాలు ప్రచురించే పత్రికలు కూడా దాదాపు అదే స్థాయిలో ఉంటాయి. కనుక అసలు లోపం సినిమా పరిశ్రమలో ఉంది గాని సినిమాపత్రికలలో లేదు. ఒక దేశపు రాజకీయాల్లో ఏ పార్టీకి ప్రధానం ఉంటే ఆ పార్టీ విధానాన్ని అనుసరించే పత్రికలే ఎక్కువ ఉంటాయి. అలాగే సినిమాపరిశ్రమలో ఈనాడు తారలకున్నంత ప్రాధాన్యం మరెవరికీ లేదు. అందుచేత ఆ ప్రాధాన్యం పత్రికల్లో కూడా ప్రతిబింబించక తప్పదు. సినిమా పరిశ్రమలోను, చిత్రాలలోనూ నైతికమైన విలువలకు, వాస్తవజీవిత చిత్రణకూ ప్రాధాన్యం హెచ్చినప్పుడు పత్రికలు కూడా వాటంతట అవే స్వయం సంస్కృతాలవుతాయి; ఆనాడు కూడా ఏ తారకు ఏ కూర ఇష్టమో ప్రకటించే పత్రిక లుంటే అవి హాస్యాస్పదాలవుతాయి. ★

రష్యన్ సర్కస్

మద్రాసు నగరంలోని సాగర్ టాకీస్ "ఓడియన్ సినిమా" అనే కొత్త పేరుతో సహానీ సోదరుల యాజమాన్యం క్రింద ఇటీవల పునర్నిర్మించబడింది. ఈ సినిమాహాలుకు గత గురువారం నాడు రాష్ట్ర విద్యాశాఖమంత్రి ఎమ్. వి. కృష్ణరావుగారు ప్రారంభోత్సవం చేశారు. ఆనాటిరాత్రి "ఆన్ది సర్కస్ ఎరీనా" అనే రష్యన్ చిత్రప్రదర్శనంతో కొత్తహాలు ప్రారంభమైంది. హాలులో కూర్చునే ఏర్పాట్లు, లైటింగు, సౌండు ఏర్పాట్లు అన్నీ బాగా అభివృద్ధి చేయబడ్డాయి.

ప్రారంభోపన్యాసం చేస్తూ మంత్రిగారు ఈ ప్రజాస్వామిక యుగంలో సినిమా చిత్రాలకు అద్వితీయమైన స్థానం ఉన్నదనీ, సినిమాకళ నిజమైన ప్రజాస్వామిక కళ అనీ అన్నారు. అసంఖ్యాక ప్రజలను ఆకర్షించే సినిమాచిత్రాలు నైతికంగా ప్రజలను ఉత్తేజపరచేవిగా ఉండాలనీ, అమెరికా మొదలైన పాశ్చాత్యదేశాల నుండి వచ్చే చిత్రాలలాగ అవినీతిమీద మోజు కలిగించేవిగా ఉండరాదనీ కూడా ఆయన అన్నారు.



ప్రతిభావారి "చిన్నకోడలు"లో జి. ఎన్. స్వామి.

తరవాత రష్యానుండి వచ్చిన చిత్రాలు ప్రదర్శించబడ్డాయి. వాటిలో రెండు రంగుల కార్టూన్ చిత్రాలు. దాదాపు ప్రతి విషయంలోనూ అమెరికన్లతో రష్యన్లు పోటీచేసి కృతకృత్యు లవుతున్నట్లు కనిపిస్తుంది. కార్టూన్ సినిమాచిత్రాలకు కళాగౌరవం ఆపాదించిన మొదటి నిర్మాత వాల్ట్ డిజ్నీ. ఆ తరవాత ఆరంగంలోకి ప్రవేశించిన రష్యన్లు వాల్ట్ డిజ్నీనికూడా తలదన్నినట్లు కనిపిస్తున్నది. కార్టూన్ చిత్రాలు ముఖ్యంగా బాలబాలికలకు అత్యంతప్రీతి కరమైనవి. మామూలు చిత్రాలద్వారాకంటె కార్టూన్ చిత్రాలద్వారా బాలబాలికలకు వినోదంగాని, విజ్ఞానంగాని కల్పించటం తేలిక. రష్యన్ కార్టూన్ చిత్రాలలో వినోదం, నీతిబోధన సమపాళ్లలో ఉండటం గమనార్హమైన విషయం.

"ఆన్ది సర్కస్ ఎరీనా" అనే సర్కస్ చిత్రం సెసిల్ బి. డిమిల్ తీసిన "గ్రేటెస్ట్ షో" అనే చిత్రంతో పోటీపడి తీసినదనే వదంతి ఎంతవరకూ నిజమో తెలియదు కాని ఆచిత్రం వర్ణనాతీతమైన ఆశ్చర్యం గొలిపేదిగా ఉన్నది. సర్కస్‌లో వెనుకబడిఉన్న మనకు అమెరికన్, రష్యన్ సర్కసులు రెండూ అద్భుతంగా ఉండటంలో ఆశ్చర్యంలేదు కాని యూరప్‌లో కల్లా మంచిసర్కసుగా పేరుపొందిన స్విస్ బర్గర్ సర్కస్ క్లబ్ సభ్యులు కూడా "సర్కస్ ఎరీనా" చూసి దిగ్భ్రాంతులై "మేము అసాధ్యమని వదిలిపెట్టిన ఫీట్లు రష్యన్లు సాధించా"రని పొగిడారు. సింహాలనోళ్లలో తలదూర్చటం ఎలుగుబంటిచేత మోటర్ సైకిలు తొక్కించటం, గుర్రపుస్వారీ మొదలైన ఫీట్లు అపూర్వంగా ఉన్నాయి. సర్కస్ చూస్తున్నంతసేపూ అద్భుతరసంలో నిమగ్నులైపోతారు ప్రేక్షకులు. సర్కస్‌ను కూడా రసస్థాయికి తీసుకురాగలగటం అన్నిటికంటె గొప్ప ఫీటుగా కనిపిస్తుంది. ★

సినిమా వార్తలు

భారతప్రభుత్వంవారి ఫిల్మ్‌శాఖ ఇకమీద డాక్యుమెంటరీ చిత్రాలతోపాటు కథా చిత్రాలు కూడా నిర్మిస్తుందట. కాని వార్తాచిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలలాగ కాకుండా ఈ కథా చిత్రాలను

వ్యాపార రంగంలోకి దింపుతారట. అంటే మిగతా సినిమాలకువలెనే ప్రభుత్వంతీసే సినిమాలకు కూడా టిక్కెట్లు ఉంటాయన్నమాట. కాని ప్రైవేటు నిర్మాతలవలె లాభాలమీదనే దృష్టి పెట్టుకోకుండా ప్రజాభ్యుదయమే ఆశయంగా పెట్టుకుని సినిమాలు తీస్తారట. ఈ ఏడాది అక్టోబరు ప్రాంతాల్లో మొదటి-చిత్రం నిర్మించటానికి వీలుగా నిర్మాత భవ్నాని ఆధ్వర్యాన ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నదట. ప్రభుత్వానికి సొంతస్టూడియో, ఇతర పరికరాలు ఉన్నందున, తారలను బుక్ చేసే తలపు లేనందున నిర్మాణవ్యయం మరెవరూ కని విని ఎరగనంత తక్కువగా ఉంటుందట.

* * *

ఆగస్టునెలలో విడుదల కానున్న "ఝాన్సీకీరాణి", "ఆన్" టెక్నికలర్ చిత్రాలు బాగా ధనం ఆర్జిస్తాయో లేదో చూసి టెక్నికలర్ చిత్రనిర్మాణానికి పూనుకోవాలని బొంబాయి నిర్మాతలు చాలమంది ఆశిస్తున్నారు. అందుకు వీలుగా కొన్ని మామూలు స్టూడియోలు టెక్నికలర్ స్టూడియోలుగా త్వరలో మారబోతున్నవి. ఇప్పటికి సెంట్రల్, మినర్వా (సొహ్రాబ్ మోడీ) ఆర్. కె. (రాజ్ కపూర్), రాజకమల్ కళా మందిర్ (శాంతారాం), కర్దార్, మోడరన్ స్టూడియోలు టెక్నికలర్ యంత్రసామగ్రిని తెప్పించుకొనే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నాయి.

* * *

ఏ. వి. ఎమ్. ప్రొడక్షన్సువారు (మదరాసు) హిందీలో తీస్తున్న "లడ్కీ" చిత్రంలో వైజయంతీమాలకు ఉజ్జీగా నటించటానికి బొంబాయి నటుడు భారత్ భూషణ్ బుక్ అయ్యాడు. ప్లేబాక్ పాటలు పాడటానికి లతామంగేష్కర్ బుక్ అయిందట.

* * *

అశోక్‌కుమార్ మరొక భాగస్వామితో కలిసి ఒక చిత్రం హిందీ, ఇంగ్లీషు భాషల్లో నిర్మిస్తున్నాడు. ఉభయభాషల్లోనూ ఈ చిత్రాన్ని ప్రసిద్ధ బ్రిటిష్ చిత్రనిర్మాత హెర్బర్టు మార్షల్ డైరక్టు చేస్తాడు హిందీలో ముల్క్‌రాజ్ ఆనంద్, ఇంగ్లీషులో హెర్బర్టు మార్షల్ స్క్రిప్టు వ్రాస్తారు. ఆగస్టులో పని ప్రారంభం కానున్న ఈ చిత్రంలో అశోక్‌కుమార్ కూడా నటిస్తాడు.

* * *

"ఝాన్సీకీరాణి" చిత్రాన్ని విదేశాలలో విడుదలచేసే ఏర్పాట్లకోసం సొహ్రాబ్ మోడీ ఇంగ్లండు వెడుతున్నాడు. నాయిక పాత్ర ధరించిన తన భార్య మెహతాబ్‌ను కూడా ఆయన తనతో తీసుకు వెడుతున్నాడు ఈ టెక్నికలర్ చిత్రం నిర్మాణానికి 70 లక్షల రూ. లు వ్యయమైందని అంచనా.



ఆంధ్రా చార్లీచాప్లిన్ బిరుదు కొట్టేద్దామనే ఆ పోజు?

ఈస్టిండియావారి "సంక్రాంతి"లో శివరావు, ఆశాలత.

* * *

ఈ సంవత్సరారంభంలో ఇండియా వచ్చిన సోవియెట్ ఫిల్ము ప్రతినిధులు వివిధ నగరాలలో పర్యటించినప్పుడు కొన్ని రీల్సు షూట్ చేసి తమతో తీసుకుపోయారు ఆ రీల్సును "ఎక్రాస్ ఇండియా" అనే పేరుతో వర్ణచిత్రంగా మాస్కో డాక్యుమెంటరీ ఫిల్ము స్టూడియోవారు రష్యాలో విడుదల చేశారని టాస్ వార్తా సంస్థ తెలుపుతోంది. రష్యన్ ప్రతినిధులు వాహినీ స్టూడియోలో కూడా కొంతభాగం షూట్ చేశారు.

* * *

అమెరికన్ వ్యతిరేకచర్యల సంఘం వారిచేత కమ్యూనిస్టుగా పేర్కొనబడటం చేత నిరుద్యోగులైన హాలీవుడ్ డైరెక్టర్లు, నటీనటులు, రచయితలు మొదలైనవారంతా కలిసి తమకు తామే ఒక ఫిల్ము కంపెనీ స్థాపించారట. కమ్యూనిస్టులనే ఆరోపణమీద స్టూడియోలనుండి తొలగించబడినవారికి ఈ కంపెనీలో స్థానం ఉంటుందట. ★

ప్రవృత్తులు

(4-వ పేజీ తరువాయి)

జాలిగా కుంటివాడు గుడ్డివాడి వంక చూస్తూ 'ఐతే మనుష్యులంటే ఎలా వుంటారో కూడా నీకు తెలియదన్నమాట!'

'నా మాదిరిగా నే వుంటారేమోగానీ అసలు నే నెల్లా వుంటానో నాకు తెలిస్తేగా!'

'కళ్లుండి ఈ కుళ్లుప్రపంచాన్ని చూళ్లేక మూసుకునే కంటే అసలు లేకపోవటమే నయమేమోలే!'

నిరాశగా గుడ్డివాడు 'ఏమిటో కళ్లు లేకపోతే ప్రపంచమే లేదు!' అన్నాడు.

కుంటివాడు మాట్లాడకపోవడం చూసి

'ఏమన్నా! మాట్లాడవేం?' అన్నాడు గుడ్డివాడు.

వులిక్కిపడి కుంటివాడు 'ఏమిటి! అంటున్నావు?' అన్నాడు.

'నువ్వేమిటి ఆలోచిస్తున్నావు' అన్నాడతను.

'అబ్బ! ఏం చీరలూ, ఏం అందం! ఏం నగలు!' తనలో అనుకొంటున్నట్టుగా అంటున్న కుంటివాడి మాటలు విని

'ఏమిటన్నా అవన్నీ!' అని అడిగాడు.

'ఓరి గుడ్డోడా! అవన్నీ చూస్తుంటేనే కడుపు నిండుద్దిగదయ్యా!' అన్నాడు తృప్తిగా.

కళ్లుండటంవల్ల కలిగే లాభాలు ప్రత్యక్షంగా కనిపిస్తున్నా, ఆ లాభాలూ, ఆ కళ్లు, తనకేం వుపయోగం కావన్న సంగతి గ్రహించి, అవన్నీ తెలియని గుడ్డివాడి ముఖంలోవున్న నిశ్చలతని చూసి తనెందుకు గుడ్డివాడు కాలేదాఅని విచారించాడు ఒక్కక్షణం.

ప్రపంచంలోవున్న అందాన్నీ, ఆకార్లనీ అన్నీ చూసి కడుపునింపుకోటానికన్నా నోచుకోలేదేమో అని గుడ్డివాడు తనలో తను కుళ్లిపోతున్నాడు.

షికార్నుంచీ మెల్లిగా నడుస్తూ ఇంటికి వెళ్తున్న ఒకతన్ని చూసి కుంటివాడు ఒక డుగు ముందుకేసి

'బాబ్బాబూ! కుంటివాణ్ణి బాబూ ఒక్కణా డబ్బులు ధర్మం చెయ్యండి బాబూ!' అని ప్రాధేయపడ్డాడు.

కుంటివాడు మాట్లాడటం చూసి ఎవరో అక్కడికొచ్చారని గ్రహించిన గుడ్డివాడు

'రొండు రోజుల్నుంచీ అన్నం లేదు బాబూ ఒక్కణా ఇప్పించండి బాబూ!' అంటూ చెయ్యి జాపాడు.

కొయ్యకాలువొంక చెయ్యి చూపిస్తూ బాధగా మొహం పెట్టిన కుంటివాడికంటే కూడా ఏమీ సంబంధంలేని వాడిమాదిరిగా వున్నచోట్నుంచీ ఒక్కడుగన్నా ముందుకి కదలకుండా నిశ్చలంగా చెయ్యి జాపిన గుడ్డివాడికే అణా ఇవ్వటం న్యాయమని తోచి ఒకణా వాడిచేతిలో పడేశాడు అతను.

గుడ్డివాడు చేత్తో తాకి చూసుకొని,

'దర్మప్రభువులు' అని రొండు చేతులూ ఎత్తి దణ్ణం పెట్టాడు అతనికి.

కుంటివాడు అతనివంక కోపంగా చూసి మొహం ఎర్రచేసుకొని, ఈర్ష్యతో కర్ర కొట్టేసుకొంటూ పెద్దపెద్ద అంగలు వేస్తూ వెళ్ళిపోయాడు.

అమాయకంగా గుడ్డివాడు చేత్తో తడుముతూ 'అన్నా!' అన్నాడు.

అప్పటికే చాలాదూరం వెళ్ళిపోయిన 'అన్న'కి ఈ తమ్ముడిమాట వినిపించలేదు!

★

గడియారంచెప్పిన కథ

(31-వ పేజీ తరువాయి)

ఆ యిద్దరు వెధవల్నీ చెరొక చంకలోనూ యిరికించుకొని అలాగే వాళ్ల అత్తవారి వూరిదాకా యీడ్చుకుపోయి, అక్కడ వాళ్ళ అత్తగారి యింటి గుమ్మంలో యిద్దరినీ నిలబెట్టి, బాగా బుద్ధి వచ్చేదాకా తన్ని, వదిలిపెట్టాడట. ఇదంతా మీ నాన్నగారే మొన్న ఎవరితోనో చెప్పుతుంటేవిన్నాను."

తన తాతయ్య గొప్పదనాన్ని గురించి గడియారం గొప్పగా చెప్పుతూవుంటే సుందరానికి బలే గర్వం పుట్టుకొచ్చింది.

"అప్పటి మనుష్యుల్లాగే, అప్పటి గడియారాలు కూడా గొప్పవి" అని గడియారం స్వాత్రీకరించింది. వాళ్ళ తాతయ్య గొప్పతనంలో యీ గడియారం కూడా కొంత భాగాన్ని కొట్టెయ్యాలని చూస్తున్నట్లు తోచింది సుందరానికి.

"అయితే నీ వయస్సు ఎంత?" అని అడిగాడు.

"ఏం? ఎంత లేకేం? నే నీ యింట్లో యీ గోడమీదకు ఎక్కి రేపు శ్రావణ మాసంతో పాతికేళ్లు నిండుతాయి"

"అబ్బా! పాతికేళ్లే?"

"ఆఁ! పాతికేళ్లు. పాతికేళ్ల పాటు క్షణం వూరికే కూర్చోకుండా పగలూ రాత్రి పనిచేస్తూనే వున్నాను. ఇప్పుడిప్పుడు గుండెల్లో కొంచెం నొప్పిగా వుంటూ వుంటుంది. నాపనీ అయిపోతోంది." అని గడియారం ఒక్క నిట్టూర్పు విడిచింది.

(ఇంకావుంది)

రెండు మహానగరాలు

(6-వ పేజీ తరువాయి)

తున్నాను—నువ్వు నాయందు వుంచిన ఈ పెద్దరికానికి కృతజ్ఞుణ్ణి'—అంటూ ఆప్యాయంగా చేయి అందించాడు.

'డాక్టర్ గారూ!—నాకు తెలుసు!—మీకూ మీ అమ్మాయికీ మధ్య యెలాంటి తీవ్రమైన అనురాగబంధం వున్నదో నాకు తెలుసు. మీరు అనుభవించిన కష్టాలూ, మిమ్మల్ని తిరిగి మనుషుల్లోకి తెచ్చుకోవటానికి లూసీ మీపట్ల చూపిన ఆప్యాయతా, యిదంతా కారణంగా, మీ ఇద్దరి మధ్యనూ, యే తండ్రీ బిడ్డల మధ్యా వుండటానికి వీలులేనంతటి అవినాభావం యేర్పడటానికి కారణమైంది. పసితనంలో, లూసీకి తల్లిదండ్రుల వాత్సల్యంలో పెరిగే సావకాశం లేకపోయింది. ఇప్పుడు మీరు తిరిగి లభించటంతో, యౌవనదశకు వచ్చినదై వుండి కూడా ఆ పసికందు హృదయంతోనే, మీ చుట్టూ పెనవేసుకుంటోంది. తను, స్వయంగా, తల్లిలా అనురాగం చూపి, మిమ్మల్ని బ్రతుకుబాటలోకి తెచ్చుకుంది. లూసీ చేతులు రెండూ మీకంఠాన్ని పెనవేసుకునేటప్పుడు, ఆ నరాలలో శిశుహృదయం, స్త్రీత్వం, మాతృత్వం ముప్పిరిగొని ప్రవహిస్తూవుంటుందని నాకు తెలుసు. లూసీ మిమ్మల్ని ప్రేమించుతోందంటే, మీలో, తన తల్లినికూడా చూచుకుని ప్రేమించుతోంది. భగ్నహృదయంతో మరణించిన తన తల్లిని మీలో చూచుకుని జాలిబడుతోంది; మీరు పడ్డ కష్టాలన్నీ తలపుకు తెచ్చుకుని, జాలిపడి, శిశువులా మిమ్మల్ని ఆలింగనంలోకి పొదువుకుని మాతృత్వసుఖాన్ని అనుభవించుతోంది. ఇదంతా నాకు స్పష్టంగా తెలుసు; మీ కుటుంబంతో పరిచయం యేర్పడ్డ మరుక్షణంనుంచీ ఇదంతా నేనూ తేటతెల్లంగా అవగతం చేసుకోగలుగుతున్నాను'

డార్నే మాటలన్నీ వింటూ, డాక్టర్ మానెట్ తలవంచుకుని మౌనంగా కూర్చున్నాడు. ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసాలుమాత్రం కొంచెం ఆదుర్దాను సూచించుతున్నయ్. కాని తన మనసులో రేగుతున్న ఆందోళన నంతా పైకి కనుపించకుండా అణచివేసుకోవటానికి చాలా ప్రయత్నించుతున్నాడు.

'డాక్టర్ గారూ! ఇదంతా నాకు తెలుసు—మీ యిద్దరి మధ్యనూ వున్న ఈ అవినాభావాన్ని అవగతం చేసుకున్నాను గనుకనే ఈ విషయాన్ని యెత్తటానికి యిన్నాళ్ళూ ఇంత పస్తాయించాను. లూసీపట్ల నాకున్న ప్రేమను వెల్లడించటంవల్ల మీ జీవితంలోకి తీవ్రమైన ఆవేదనను విసిరినవాడ నౌతానని భయపడ్డాను—ఇప్పుడు కూడా అలానే భయపడుతున్నాను. కాని—డాక్టరుగారూ!—నేను లూసీని ప్రేమించుతున్నాను—దైవసాక్షిగా ప్రేమిస్తున్నాను.'

'నాకు తెలుసు' అన్నాడు డాక్టరు, దుఃఖం ముంచివేస్తున్న రుద్ధకంఠంతో. 'ఈ సంగతి నేను చాలా రోజులక్రిందటే గ్రహించాను—నాకు తెలుసు'

డాక్టర్ కంఠనాళాల కదలికలో, డార్నేకు, ఆయన మనస్సులో పడుతున్న సంక్షోభమంతా అర్థమయింది:

'కాని డాక్టరుగారూ! ఒక్క మనవి వినండి—నేను అదృష్టవంతుణ్ణయి, లూసీ నాకు భార్యగా దక్కే సుదినమే వస్తే, లూసీని మిమ్మల్నుంచి దూరంచేస్తాననే అభిప్రాయంమటుకు యెప్పుడూ పెట్టుకోకండి. అలాంటిది యెన్నడూ తలపోయటానికి వీల్లేని అసంభవకార్యమనీ, కిరాతకృత్యమనీ నాకు తెలుసు—అలాంటి దుష్కృత్యాన్ని నా జీవితంలో ఎప్పటికీ తలపెట్టను—మీ చెయ్యి ముట్టి ప్రమాణం చేస్తున్నాను'

డాక్టరు చెయ్యిపట్టుకుని ఇలా మాట్లాడుతున్నాడు:

'నేనూ, మీకుమల్లేనే ఫ్రాన్సునుంచి తరిమివేయబడిన కాందిశీకుణ్ణి, మాతృదేశంలో జరుగుతున్న కిరాతాలూ, అవినీతీ, దురాగతాలూ చూసి భరించలేక మీకుమల్లేనే ఇక్కడికి ఏకాకినై వచ్చి తలదాచుకుంటున్న దురదృష్టవంతుణ్ణి; భవిష్యత్తులో సత్కాలం రాకపోతుందా అనే ఆశతో, యిక్కడ చేతనైన కష్టం చేసుకుని మీకుమల్లేనే సుఖంగా బ్రతకాలని చూస్తున్నాను. మీ కష్టసుఖాల్లో భాగస్వామిని కావాలని వాంఛించుతున్నాను. ఇల్లూ వాకిలీ లేని ఏకాకిని, మీ యిల్లు నాయిల్లుగా మీ కష్టసుఖాలు నా కష్టసుఖాలుగా, మీ కుటుంబంలో ఒక వ్యక్తిగా బ్రతకాలని అపేక్షించుతున్నాను. లూసీని మీనుంచి విడదీయటానికి ప్రయత్నించను. మీ అనురాగబంధాన్ని విచ్ఛేదం చెయ్యటానికి ప్రయత్నించను. చేతనైతే మీ వాత్సల్యానురాగాలను మరింత బలపరచటానికి సాయపడతాను.'

డాక్టర్ తల పైకెత్తి డార్నే ముఖంలోకి చూచాడు. ఆయన పడుతున్న ఆందోళనంతా పైకెత్తిన ఆ నుదురులో స్పష్టంగా కనుపించుతోంది.

'ఎంతో హృదయంవున్న మానవుడులా, నాకష్టసుఖాలన్నీ అర్థంచేసుకుని చాలా ఉదారంగా మాట్లాడుతున్నావు నాయనా! ఎంతో కృతజ్ఞుణ్ణి; నా మనస్సులోవున్న అభిప్రాయమేదిటో దాపరికం లేకుండా చెబుతాను. లూసీ నిన్ను ప్రేమించుతున్నదని విశ్వసించటానికి తగిన ఆధారమేదైనా నీకు కనిపించిందా?'—

'లేదు—యిప్పటికి అలాంటిదేమీ లేదు'

'నాకు ముందుగా తెలియపర్చి—ఆ విషయాన్ని తేల్చుకుందామనేనా ఇప్పుడు యీ సంగతి నాతో ప్రస్తావించటంలో నీకు గల ఉద్దేశం?'—

'అది కూడా కాదు—ఆవిషయం యిప్పుడప్పుడే తేలకపోయినా నాకేమీ బెంగ లేదు. ఎప్పుడో ఒకప్పుడు అదే తేలుతుంది—తేలితే రేపే తేలవచ్చుకూడా.'

'ఈ సంగతి తేల్చుకోవటానికి నా సహాయమేమైనా అపేక్షించుతున్నావా?'

'అల్లాంటిదేమీ అక్కర్లేదు—అల్లాంటిదేదైనా మీరు యివ్వదలిస్తే ఆవిధమైన సూచనను స్వీకరించటానికి నాకు ఎలాంటి అభ్యంతరమూ లేదు.'

'అలాగైతే నావల్ల కావలసిన సహాయమేమిటి? నానుంచి

వాగ్దానమేదైనా కావలసివుందా'—

'వుంది—అదే మిమ్మల్ని యాచించుతున్నాను.'

'ఏమిటది?'—

'మీ సంగతి తేలంది, ఈ విషయంలో ఎలాంటి ఆశలు పెట్టుకోవటానికి ఆస్కారమేమీ వుండదని నాకు తెలుసు. లూసీకి మనసులో నామీద ఒకవేళ మమకారం వున్నా—వున్నదని చెప్పటం లేదు—తండ్రిమీద లూసీకివున్న అనురాగం ముందు అది యేవిధంగానూ లాభం వుండదని నాకు తెలుసు'—

'అంటే ఈ విషయం చాలావరకు నా బాధ్యతమీద ఆధారపడి వున్నదంటావా?'

'అవును—లూసీని కాంక్షించుతున్నవారిలో ఏ వరిపక్షాన మీరు ఒక్క సుముఖమైనమాట చెప్తారో అతను కృతకృత్యుడౌతాడు. ఆ మాటకోసం లూసీ తన జీవితసర్వస్వాన్నీ ఆ విధంగా త్యాగంచేసి తీరుతుంది. కాని, అలాంటి మాట నా పక్షాన పలకమని మిమ్మల్ని కోరటంలేదు.'

'అలాంటిది నీవు నన్ను కోరవని నాకు తెలుసు—ప్రేమ చాలా విచిత్రమైంది. ప్రేమహృదయం ఈవిధంగా వుంటుందని అర్థం చేసుకోలేము—యే పరిణామాలకు దారితీస్తుందో ఊహించలేము—నిజానికి ఈ విషయంలో లూసీ సంగతి నేను ఆవంతేనా అర్థం చేసుకోలేకుండా వున్నాను. దాని మనస్సులో యేముందో భగవంతుడికే తెలియాలి.'

'ఈ సంగతి అడగవచ్చునో లేదో—లూసీని కాంక్షించుతున్నవారు...'

'ఇంకా యెవరేనావున్నారా అనేనా అడుగుతున్నావ్—ఏమో ఎలా తెలుస్తుంది? ఇక్కడికి తరుచు వచ్చేవారిలో కార్టన్ ఒకడు—స్ట్రైయివర్ ఒకడు—ఆ యిద్దరిలో ఏ ఒక్కరికేనా మనసులో, అలాంటి అపేక్ష వున్నదేమో!'

'ఉంటే యిద్దరికీకూడా వుండోచ్చు'—

'అది సరే—నువ్వు నావల్ల యేదో వాగ్దానం కావాలన్నావ్—ఆ సంగతేమిటో తేల్చావు లేదు.'

'మిమ్మల్ని నేను కోరేదల్లా ఒక్కటే—లూసీ యెప్పటికైనా తమ సముఖానికివచ్చి, ఇప్పుడు నేను చెప్తున్నట్టే, తన అభిప్రాయాన్ని వెల్లడించినప్పుడు, నామనస్సులో వున్న అభిప్రాయమేమిటో మీకు చెప్పాను గనక, ఆమాటలు లూసీతో అనండి, నామాటలలో మీకు సంపూర్ణమైన విశ్వాసం వున్నదని హామీ యివ్వండి, నాయందు సుముఖభావం వుంచండి, నాకు వ్యతిరేకంగా లూసీ మనసు మార్చటానికి ప్రయత్నించకండి—అంతకంటే మీరు నాకేమీ సహాయం చెయ్యమని కోరటంలేదు—ఇదే నేను మీనుంచి కోరుతున్న వాగ్దానం. ఏ షరతులకు లోబడి నేను ఈ వాగ్దానం మీ నుంచి తీసుకుంటున్నానో వాటికి కట్టుబడి వుండటానికి నేను సర్వథా సంసిద్ధుణ్ణయి వున్నాను'

'ఎలాంటి షరతులూ కోరకుండానే, వాగ్దానం చేస్తున్నాను. నీ సహృదయంమీద నాకు నమ్మకం వుంది. నాకూ నా బిడ్డకూ మధ్యవున్న అనురాగాన్ని పెంపుచేయటానికి ప్రయత్నించే ఉదారత నీలో వున్నదని నాకు నమ్మకమే; తన సుఖశాంతులకు నీ హృదయబాంధవ్యం అవసరమని లూసీ నాతో అంటే—తప్పకుండా—లూసీని, మీ చేతిలో వుంచుతాను.

డార్నే కృతజ్ఞతాపురస్సరంగా డాక్టర్ చెయ్యి పుచ్చుకున్నాడు.

'డార్నే! ఒక్కమాట చెబుతున్నాను విను—లూసీ యే పురుషుణ్ణైనా ప్రేమించితే—ఆ మనిషిమీద నాకుగాని ఇతరులకుగాని యెలాంటి అభిప్రాయాలున్నా అవన్నీ నేను పాటించను. లూసీ సౌఖ్యంకొరకు నేను ఏ త్యాగమైనా చేస్తాను—లూసీ నా సర్వస్వం—లూసీ సౌఖ్యం నా సౌఖ్యం, లూసీకోసం యే కష్టాలైనా భరించుతాను—ఏ అవజ్ఞతలైనా నెత్తి కెత్తుకుంటాను—ఏదేనా—సరిసరి ఇదంతా వెర్రిధోరణిగా మాట్లాడుతున్నాను'

మాట్లాడుతూ మాట్లాడుతూ, చాలా చిత్రంగా ముడుచుకుపోయి మౌనం వహించాడు—డార్నే చేతిలోనుంచి తన చెయ్యి మెల్లగా జారలాక్కున్నాడు. ఒక్కక్షణం అలా స్తబ్ధంగా ఊరుకుని మళ్లా స్పృహలోకి వచ్చి, చిన్న చిరునవ్వు నవ్వుతూ డార్నే ముఖంలోకి చూచాడు:

'ఆఁ! అన్నట్టు యేమిటీ ఇందాక చెబుతున్నావూ?'

'నాయందు మీరు అలాంటి విశ్వాసం వుంచారుగనక నేను నా విషయంలో ఏవిధమైన దాపరికం లేకుండా సర్వం చెప్పి వుంచవలసివుంది. ప్రస్తుతం నేను యిక్కడ యింగ్లండులో మారుపేరుతో వుంటున్నాను. నేనెవరో, ఇక్కడ ఇంగ్లండులో యెందుకు వుండవలసివచ్చిందో చెబుతాను'—

'ఆగు చెప్పక్కర్లేదు!'—డాక్టర్ వారించాడు.

మీ నామధ్య ఏవిధమైన రహస్యాలూ వుండకుండావుంటే, మీకు నామీద సంపూర్ణమైన విశ్వాసం యేర్పడటానికి వీలౌతుందని ఆశించుతున్నాను'—

'వద్దు—ఇప్పుడు వద్దు—నేను అడిగినప్పుడు చెప్పుదువుగాని—లూసీకీ నీకూ మధ్య ప్రేమానురాగాలు పెరిగి వివాహం చేయవలసిన శుభదినం వచ్చిననాడు ఆ ఉదయం చెబుదువుగాని అందాకా వద్దు—ఇది నీకు అంగీకారమేనా?'

'సరే!'—

డాక్టర్ డార్నే చేతిని ఆప్యాయంగా అందుకుని ఆశ్వాసించాడు: 'అమ్మాయి వచ్చే వేళయింది—మనం యిద్దరం మాట్లాడుకున్నామని అమ్మాయికి తెలియటం మంచిదిగాదు—శుభం, వెళ్ళిరా!'

డార్నే, డాక్టర్‌గారి యింట్లోనుంచి బయటికివచ్చేసరికే బాగా ప్రొద్దుగూకింది. తరువాత, మరోగంటకు గాని లూసీ యింటికి చేరుకోలేదు. ఇంట్లోకి అడుగుపెట్టీపెట్టడమే, డాక్టరు చదువుకునే గదిలోకి పరుగెత్తింది. ఆయన కుర్చీలో లేడు.

'నాన్నా! నాన్నా!' అంటూ పిలిచింది.

సమాధానం రాలేదుగాని, డాక్టర్ పడకగదిలోనుంచి సుత్తిశబ్దం వినుపించుతోంది. పడకగదిగుమ్మంలోకి పోయి లోపలికి తొంగిచూచింది: 'అయ్యొ బాబోయ్!—ఇప్పుడేమి చెయ్యాలి?' అంటూ క్షణం కంగారుపడ్డది. మళ్లా మరుక్షణంలో ధైర్యం తెచ్చుకుని గది గుమ్మంలోకి వెళ్లి: 'నాన్నా!' అంటూ ఆప్యాయంగా పిలిచింది. లూసీ పిలిచిన మరుక్షణంలోనే సుత్తిధ్వని ఆగిపోయింది. డాక్టర్ నెమ్మదిగా బయటికి వచ్చేశాడు. ఇద్దరూ కలిసి ఇటూ అటూ మేడమీద కాసేపు పచారు చేశారు.

రాత్రి బాగా పొద్దుపోయింది. లూసీ తన పక్కమీదినుంచి దిగి తండ్రి పడకగదిలోకి వచ్చింది. ఆయన గుండెలమీద చెయ్యి వేసుకుని నిశ్చింతగా నిద్రపోతున్నాడు. ఆయన తాలూకు చెప్పులుకుట్టే సామాన్లు మూలనున్న బల్లమీద మామూలు మోస్తరుగానే చెల్లాచెదరుగా పడివున్నయ్. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madra



పద్మపాణి బోధిసత్త్వుడు

(అజంతాలోని కుడ్యచిత్రం.)

*

Rgd. No. M. 4479

జూలై విడుదల



డిస్ట్రిబ్యూటర్లు:

ఆంధ్ర, సీడెడ్ : నవయుగ రిలీజు — మైసూరు, నైజాం : రాజ్‌శ్రీ రిలీజు